

పింఛన్ కోసం ఒంగోలులోని ఓ సచివాలయానికి వస్తున్న వృద్ధురాలు

పింఛన్ల పంపిణీ వ్యవహారంలో వైసీపీ ప్రభుత్వ డ్రామాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఉద్దేశపూర్వకంగా బ్యాంకుల్లో నగదు జమచేయకుండా పండుటాకులను మండుటెండలో ఏడిపించారు. ఏడు పదుల వయస్సు దాటిన వృద్ధులకు వైసీపీ డ్రామాలు అర్థం కాక, గంటల తరబడి ఎదురుచూశారు. గతంలో ఎన్నడూ సచివాలయం ముఖం చూడని వారు సైతం పింఛన్ల కోసం బారులు తీరారు. ప్రభుత్వం కావాలనే జాప్యం చేసి పింఛన్‌దారులను ఇబ్బందులకు గురిచేయగా, ఆ నెపాన్ని టీడీపీపై మోపేందుకు వైసీపీ శ్రేణులు విశ్వప్రయత్నం చేశాయి. అయితే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పింఛన్ల పంపిణీలో ఆలస్యం చేసిందనే విషయాన్ని గ్రహించిన కొందరు సచివాలయ సిబ్బందిని ప్రశ్నించారు. పేదలకు పింఛన్లు అంటూ గొప్పలకుపోయే వైసీపీ ప్రభుత్వం చివరకు వాటిని రాజకీయం చేసి, తమ స్వార్థం కోసం విషప్రచారం చేయడాన్ని పలువురు చీదరించుకుంటున్నారు.

నిధులివ్వకుండా నిందలు



డబ్బులు రాలేదని సచివాలయ సిబ్బంది చెప్పడంతో నిరాశగా వెళ్తున్న పింఛన్‌దారులు

వైసీపీ రాజకీయ క్రీడతో సచివాలయాల వద్ద వృద్ధుల అగచాట్లు

- పింఛన్ కోసం రోజంతా పడిగాపులు
- పలుచోట్ల ఉదయం నుంచే నిరీక్షణ
- బ్యాంకుల వద్ద సిబ్బంది ఎదురుచూపు
- మధ్యాహ్నం తర్వాత ఖాతాలకు జమ
- కొన్ని సచివాలయాలకు అందని నగదు
- అరకొరగానే నిధులు.. సాయంత్రం ప్రారంభం
- కొద్దిమంది లబ్ధిదారులకే అందజేత

ఒంగోలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ వైసీపీ ఆడుతున్న రాజకీయ క్రీడ సామాజిక పింఛన్ పొందే లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసింది. ప్రత్యేకించి వయస్సు మళ్లీ, పింఛన్‌పైనే ఆధారపడిన వృద్ధులు, వితంతువులు సచివాలయాల వద్ద ఉదయం నుంచి పింఛన్ కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. అయినా అత్యధికులకు పింఛన్లు అందిన పరిస్థితి లేదు. జిల్లాలో మొత్తం 2,93,120 మంది వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు మొత్తం



ఒంగోలులోని కబాడిపాలెం సచివాలయం వద్ద పింఛన్ కోసం ఎదురుచూస్తున్న మహిళలు



ఒంగోలులోని ఇందిరమ్మ కాలనీలో డబ్బులు అయిపోయాయని చెప్తున్న సిబ్బంది



త్రిపురాంతకంలోని సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

రూ.87.93కోట్ల మేర సామాజిక పింఛన్ అందుతుంది. టీడీపీ హయాంలో గ్రామకార్యదర్శుల ద్వారా చెల్లింపులు జరిగేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నూతనంగా తెచ్చిన వలంటీర్లతో ప్రతినెలా 1వతేదీన ఇంటికి వచ్చి ఇస్తున్నారు. కాగా ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలుతో వలంటీర్ల ద్వారా పంపిణీకి ఎన్నికల కమిషన్ బ్రేక్ వేసింది. అధికార వైసీపీకి చెందిన కార్యకర్తలనే వలంటీర్లుగా నియమించి వారి ద్వారా ప్రభుత్వ కార్యక్రమాల పేరుతో పార్టీ ప్రచారాన్ని సాగిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో అలా ఈసీ నిర్ణయం తీసుకుంది. ప్రత్యామ్నాయంగా సచివాలయ సిబ్బంది ద్వారా చెల్లింపులకు ఈసీ సూచనలకు అనుగుణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ విషయాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం రాజకీయం చేసింది. పింఛన్లను టీడీపీ అడ్డుకుంటున్నదన్న దుష్ప్రచారాన్ని అధికార పార్టీ నాయకులు ప్రారంభించారు.

సరిపడా సిబ్బంది ఉన్నా ఇవ్వరట..

ఇంటింటికీ తిరిగి పింఛన్‌ను ఇచ్చేందుకు సరిపడా సచివాలయాల సిబ్బంది ఉన్నప్పటికీ అలాకాకుండా లబ్ధిదారులు సచివాలయాలకు వచ్చి తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తద్వారా వైసీపీ, అలాగే ప్రభుత్వ ఉన్నతాధికారులు టీడీపీపై నిందలు వేసే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన టీడీపీ, మిత్రపక్షాల నేతలు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేస్తూ వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు అసలు ప్రభుత్వ ఖజానాలో ఉన్న డబ్బును వైసీపీ అనుకూలురైన కాంట్రాక్టర్లకు దోచిపెట్టి పింఛన్‌లకు లేకుండా చేశారన్న విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. అందువల్లనే ప్రభుత్వం 1వ తేదీన పింఛన్లు ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో అటు ప్రభుత్వ ఉన్నతాధికారులుతోపాటు వైసీపీపైనా ఒత్తిడి, విమర్శలు పెరగడంతో బుధవారం సచివాలయాల వద్ద పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ముందుగానే నగదు సిబ్బందికి ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులందరికీ సక్రమంగా సమాచారం ఇవ్వలేకపోయారు. దీంతో బుధవారం ఉదయం తొమ్మిది గంటలకే జిల్లాలోని ఆయా ప్రాంతాల్లోని సచివాలయాల వద్దకు వృద్ధులు, ఇతర లబ్ధిదారులు పెద్దసంఖ్యలో చేరారు. ఆ సమయానికి సచివాలయ సిబ్బంది ఎక్కువ మంది విధులకు రాకపోగా వచ్చిన వారు అడ్మిన్ సెక్రటరీలు డబ్బు కోసం బ్యాంకులకు వెళ్లిన విషయాన్ని చెప్పడంతో లబ్ధిదారులంతా సచివాలయాల వద్దనే పడిగాపులు కాచారు.

మధ్యాహ్నం తర్వాత.. అదీ అరకొరగానే..

అడ్మిన్ సెక్రటరీలు బ్యాంకుల వద్దకు వెళ్లగా మధ్యాహ్నం 12 గంటల వరకు నగదు జమకాలేదు. అప్పటి వరకూ అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది. ఆ తర్వాత ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమయంలో సాయంత్రం నాలుగు గంటల వరకు ఖాతాలలో వేశారు. అది కూడా మొత్తం కాకుండా కొద్దిమేర మాత్రమే జమ చేశారు. దీంతో కొన్నిచోట్ల మధ్యాహ్నం మూడు గంటల నుంచి పంపిణీ ప్రారంభమైంది. అప్పటివరకు వృద్ధులు, ఇతర లబ్ధిదారులు పడిగాపులు కాగయా, తీరా సెక్రటరీలు వచ్చాక కొద్దిమందికి మాత్రమే పంపిణీ చేశారు. టంగుటూరు మండలం అనంతవరం సచివాలయ పరిధిలో 477మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికి సుమారు రూ.15లక్షలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.50వేలు మాత్రమే ఖాతాలో జమయ్యాయి. దీంతో సిబ్బంది ముందువరుసలో ఉన్న 16 మందికి ఇచ్చి మిగతా వారికి మరుసటిరోజు వచ్చి తీసుకోమని చెప్పిపంపారు. ఒంగోలు నగరంలో పలుచోట్ల అరకొరగా పంపిణీ జరిగింది. స్థానిక వడ్డెపాలెం సచివాలయంకు అసలు నగదే అందక పంపిణీ ప్రారంభం కాకపోగా ఇందిరమ్మ కాలనీ వద్ద పెద్దసంఖ్యలో వృద్ధులు ఉన్నా కొద్దిమందికే ఇచ్చే సరికి నగదు అయిపోయిందనడంతో వారంతా రాత్రి వరకు అక్కడవేసి చూసి వెళ్లాల్సి వచ్చింది. కొప్పోలు సచివాలయం వద్ద తీవ్ర రద్దీ ఏర్పడగా అక్కడ కొద్దిమందికి ఇచ్చారు.

ఉసూరుమంటూ ఇళ్లకు..

జిల్లాలోని ఇతర అన్ని ప్రాంతాల్లోనూ సచివాయాల వద్ద గంటల కొద్దీ పింఛన్ కోసం ఆశతో పడిగాపులు కాచిన వృద్ధులు, ఇతర లబ్ధిదారులు చివరకు నగదు అందకుండానే ఇళ్లకు పోవాల్సి వచ్చింది. కొన్నిచోట్ల కనీసం కూర్చునేందుకు కుర్చీలు, తాగడానికి మంచినీరు కూడా లేక అవస్థలు పడ్డారు. గిద్దలూరులోని కొన్ని సచివాలయాల వద్ద చెట్ల కింద, నేలపై కూర్చొని నిరీక్షించాల్సి వచ్చింది. కురిచేడులో దాతలు ఏర్పాటు చేసిన బల్లలపై సేదతీరారు. త్రిపురాంతకంలో సచివాలయ మెట్లపైనే కూర్చొని వృద్ధులు పడిగాపులు కాశారు. పొదిలిలో పంపిణీ సమయంలో రద్దీ కనిపించింది. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం 6.30 గంటల సమయానికి 36.26శాతం మందికి మాత్రమే పంపిణీ చేశారు. జిల్లాలో ఉన్న మొత్తం 2,93,920మంది పింఛన్‌దారులకు రూ.87.93 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఆ సమయానికి 1,06,574 మందికి రూ.32.23కోట్లు వరకు అందజేసినట్లు సమాచారం. మిగిలిన వారికి గురు, శుక్రవారాల్లో పంపిణీ చేస్తామని అధికారులు చెప్తున్నారు. మొత్తం మీద రాజకీయ లబ్ధికోసం వైసీపీ ఆడిన క్రీడ పింఛన్ లబ్ధిదారులను ప్రత్యేకించి వృద్ధులను తీవ్ర అగచాట్లకు గురిచేసింది.


తొలిరోజు 47శాతం మందికే!

కొన్ని బ్యాంకులకు మధ్యాహ్నం తర్వాతే జమ అయిన నిధులు

ఒంగోలు నగరం, ఏప్రిల్ 3: జిల్లాలోని పలు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ తొలిరోజు ప్రారంభం కాలేదు. మొత్తం 2,93,920 మంది లబ్ధిదారులు ఉండగా వీరికి పింఛన్లను అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.87.92 కోట్ల నిధులను ఇవ్వాల్సి ఉంది. కానీ ఇందులో సగం మాత్రమే జిల్లాకు బుధవారం విడుదల చేసినట్లు సమాచారం. ఎస్‌బీఐ, యూబీఐ బ్యాంకులకు మధ్యాహ్నం వరకు నిధులు జాడే లేదు. ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం జిల్లాలో బుధవారం 47శాతం మందికి మాత్రమే పింఛన్‌ల పంపిణీ జరిగింది. మిగిలిన వారికి అందజేయలేకపోవడానికి తగినంత నగదు బ్యాంకుల్లో లేకపోవడమే కారణమని తెలుస్తోంది. కొన్ని సచివాలయాల్లో డ్రా చేసిన సొమ్ము పంపిణీ చేశారు. ఇంకా లబ్ధిదారులు ఎక్కువ సంఖ్యలో పింఛన్ కోసం వేచి ఉండటంతో గురువారం రావాలంటూ వెనక్కి పంపించారు. మిగిలిన నగదు గురువారం బ్యాంకుల నుంచి డ్రా చేసి తీసుకు వచ్చి పంపిణీ చేయాల్సి ఉంది. అదీ ప్రభుత్వం నిధులను బ్యాంకులకు జమచేస్తేనే అని సచివాలయ సిబ్బంది పింఛన్ లబ్ధిదారులకు చెప్పి వెనక్కి పంపించారు. దీంతో ప్రభుత్వం ఇచ్చే పింఛన్ సొమ్ముతోనే కాలం వెళ్లదీస్తున్న వారు ఆందోళన చెందుతున్నారు.

ఉలిక్కిపడ్డ పోలీస్!

- ఎస్పీపై బదిలీ వేటు ఎఫెక్ట్
- అడ్డగోలు వ్యవహారంతో ఏసీబీకి చిక్కిన టంగుటూరు ఎస్‌ఐ
- మరికొంతమందిపైనా ఈసీ దెబ్బపడే అవకాశం



ఒంగోలుక్రైం,ఏప్రిల్ 3: ఊహించని విధంగా ఎస్పీ పరమేశ్వరరెడ్డిపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేయడంతో పోలీసు శాఖ ఉలిక్కిపడింది. ప్రధానంగా అధికారపార్టీకి కొమ్ముకాస్తున్న కొందరు పోలీసులలో ఆందోళన మొదలైంది. పైకి ఎన్నికల ప్రక్రియలో ఇదంతా సాధారణమే అంటూ కొట్టిపారేస్తున్నా లోపల మాత్రం వణికిపోతున్నారు. ఇప్పటికే ఆరోపణలు, కేసులు ఎదుర్కొంటున్న వారు లోలోన కలవరం చెందుతున్నారు. తమపై వేటు పడకుండా ఎలా బయటపడాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు. అదేసమయంలో టంగుటూరు ఎస్సై నాగేశ్వరరావు రూ.70వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారులకు దొరికిపోయారు. రెండు ఘటనలు మంగళవారమే జరగడంతో పోలీసుశాఖలో కలకలం మొదలైంది. అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా వేటు తప్పదు అనే సంకేతాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కొంతమంది పోలీసు అధికారులు ఎన్నికల నిబంధనలకు లోబడి పనిచేసుకు పోదాం అని చర్చించుకోవడం విశేషం.

మరికొంతమందిపైనా వేటు పడే అవకాశం

పోలీసు శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి అధికారులు మరికొంతమందిపై వేటు పడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే అధికారపార్టీకి వంతపాడుతూ ఇతరులపై కక్షగట్టి పనిచేసిన కొందరు సీఐలు, ఎస్‌ఐలపై ఇప్పటికే ప్రతిపక్షాలు నేరుగా ఈసీకి ఫిర్యాదులు చేశాయి. అలాగే కోర్టులోనూ కేసులు వేశాయి. వాటిపై విచారణ అనంతరం చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోలీసు శాఖలోనే చర్చ నడుస్తోంది.

వెనక్కి తగ్గిన కొందరు పోలీసు అధికారులు

పోస్టింగ్ ఇప్పించి ఆదరించిన వారి రుణం తీర్చుకోవాలని నిన్నమొన్నటి వరకు బాహాటంగా చెప్పిన పోలీసు అధికారులు సైతం కాస్త వెనక్కు తగ్గారు. ఎస్పీపైనే వేటు పడటంతో అధికారపార్టీతో అంటకాగుదామని నిర్ణయం తీసుకున్న వారి వెన్నులో వణుకు ప్రారంభమైంది. జిల్లా బాస్‌ను ఎన్నికల విధులకు దూరంగా ఉంచమని ఈసీ ఆదేశించడంతో కిందిస్థాయి అధికారుల్లో అలజడి మొదలైంది. ఏ ఇద్దరు పోలీసు అధికారులు కలిసినా ఇదే చర్చ నడుస్తోంది. కొంతమంది ఎస్‌ఐలు ఫోన్లు చేసుకొని జాగ్రత్తగా ఉండాలంటూ మాట్లాడుకోవడం కనిపించింది. కిందిస్థాయి సిబ్బంది కూడా అలర్ట్ అయ్యారు. ముఖ్యంగా తిరుపతిలో అక్రమాలతోపాటు గిద్దలూరు మండలం పరమేశ్వరపురంలో జరిగిన మునయ్య హత్య విషయంలో ఎస్పీ పీకల్లోతున ఇరుక్కుపోయిన విషయం తెలిసిందే. అయితే గిద్దలూరు ప్రాంతంలో పనిచేస్తున్న పోలీసు అధికారులపైనా విచారణ జరుగుతుందని సమాచారం. ఎస్పీపై వేటు వేసిన ఎన్నికల కమిషన్ అందుకు నేరుగా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటుందని తెలుస్తోంది. ఇటీవల మంత్రి రుణం తీర్చుకోవాలన్న తలంపుతో టీడీపీ నాయకులను బెదిరించడంతోపాటు రౌడీషీట్లు తెరిచిన ఎస్‌ఐపై కూడా విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే ఒంగోలులోని ఇద్దరు సీఐలపైన నేరుగా టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేశారు. వారిపైన కూడా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

నగదు, సామగ్రిని గమ్యం చేర్చారు

తిరుపతి నుంచి జిల్లాకు ఎస్పీ పరమేశ్వరరెడ్డి బదిలీపై రావడమే వివాదాస్పదంగా మారింది. ఒంగోలు పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ తరఫున బరిలో ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించేందుకు పరమేశ్వరరెడ్డి బదిలీ జరిగిందని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అనంతరం చెక్‌పోస్టుల వద్ద అధికార పార్టీ నగదు, సామగ్రి బాస్ సిఫార్సులతో గమ్యం చేరాయని ఆరోపణలు ఉన్నాయి. అదేక్రమంలో ప్రధానమంత్రి సభకు ట్రాఫిక్ విధుల్లో పాల్గొన్న పరమేశ్వరరెడ్డి వైఫల్యం చెందారు. ఇలా అనేక ఆరోపణలు రావడం, అవన్నీ నిజమేనని తేలడంతో ఎన్నికల కమిషన్ విచారణ చేసి వేటువేసింది.


సీసీసీ ఫోన్ నెంబర్ 08592 288599

- ఎవరైనా ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేయొచ్చు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోలు సెంటర్ (సీసీసీ)లో 24 గంటలు పనిచేసేలా టెలిఫోన్ నెంబరును ఏర్పాటు చేసినట్లు సెంటర్ ఇన్‌చార్జి వరకుమార్ తెలిపారు. ప్రజలు/ఓటర్లు ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను 08592288599కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని ఆయన పేర్కొన్నారు.

వైసీపీ పతనం ప్రారంభం

- టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి విజయ్‌కుమార్
- 55 కుటుంబాలు వైసీపీ నుంచి తెలుగుదేశంలో చేరిక
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన బీఎన్



బీఎన్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ సీనియర్ నాయకుడు మాదాల నరసయ్య

సంతనూతలపాడు, ఏప్రిల్ 3 : రాష్ట్రంలో వైసీపీ పతనం ప్రారంభమైందని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ అన్నారు. జగన్ నిరంకుశ పాలనపై పేద, మధ్యతరగతి ప్రజల్లో తీవ్రవ్యతిరేకత నెలకొన్నదన్నారు. మండలంలోని మైనంపాడులో గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు మాదాల నరసయ్య, మాదాల రవితోపాటు అనుచరులు బుధవారం బీఎన్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారితోపాటు 55 కుటుంబాలు వైసీపీని వీడి సైకిలెక్కాయి. వారందరికీ బీఎన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాదాల నరసయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తున్నదని, వైసీపీ మాత్రం మాటలతో మాయ చేస్తున్నదన్నారు. బీఎన్ గెలుపు ఖాయమని, బాబు పాలనలో మళ్లీ బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర కులాలకు సమన్యాయంగా పథకాలు అందుతాయని తెలిపారు. మాదాల రవి మాట్లాడుతూ ఇటు రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ వైసీపీ నాయకుల నియంత పోకడలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. చంద్రబాబు సీఎం కావడమే దీనికి సమాధానమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, తన్నీరు శ్రీను, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

అరకొరగానే జీతాలు

- పదిశాతం మంది ఉద్యోగులకు కూడా పడలేదు
- విశ్రాంత ఉద్యోగుల ఎదురుచూపులు



ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఉద్యోగులకు జీతాల కష్టాలు తప్పడం లేదు. మార్చి 31వ తేదీతో గత ఆర్థిక సంవత్సరం ముగియడంతో 2వతేదీ నుంచి ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు జీతాలు వస్తాయని గత నెలలోనే ప్రభుత్వం ప్రకటించింది. దీంతో వారంతా మంగళవారం నుంచి జీతాలు, పింఛన్‌లు తమ అకౌంట్లలో జమ అవుతాయని ఆశించారు. కానీ బుధవారం సాయంత్రం వరకు కూడా పడలేదు. జిల్లాలో పనిచేసే వారిలో పట్టుమని పదిశాతం మందికి కూడా జీతాలు అందలేదు. ప్రభుత్వ ఉద్యోగులు జీతాల కోసం, రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత కొంతకాలం నుంచి వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఉద్యోగులు, పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, రిటైర్డ్ ఉద్యోగులు 48వేల మందికిపైగా ఉన్నారు. వీరిలో కేవలం సచివాలయ, పోలీసు, ట్రెజరీ ఇతర శాఖల్లోని కొద్దిమందికి జీతాలు పడగా, ఉపాధ్యాయులకు నిరాశే ఎదురైంది. ఉద్యోగులు తమ బ్యాంకు అకౌంట్లలో వేతనం పడిందా లేదా అని సెల్‌ఫోన్ మెసేజ్ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గత నాలుగైదు నెలల నుంచి ప్రభుత్వం శ్లాబ్ విధానంలో జీతాలు వేస్తుండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఆర్థిక శాఖ అమరావతిలోనే డిపార్ట్‌మెంట్ల వారీగా విభజించి జీతాలు వేస్తుండగా ప్రస్తుత నెలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. జీతాలు ఎప్పుడు పడతాయోనని అందరూ ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పింఛన్ల పంపిణీపై వైసీపీ డ్రామా!

నగదు ఇవ్వకుండా టీడీపీపై నిందలు • డివిజన్‌లలో వైసీపీ నాయకుల దుష్ప్రచారం
పింఛన్ల కోసం పండుటాకులు పడిగాపులు • మధ్యాహ్నం వరకు బ్యాంకుల్లో పడని నగదు
సమాధానం ఇవ్వలేక ముఖం చాటేసిన సెక్రటరీలు



రాజాపానగల్ రోడ్డులో పింఛను కోసం నడవలేని స్థితిలో వస్తున్న వృద్ధురాలు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 3 : పేదలకు ఇళ్ళ వద్దకే పింఛను అంటూ ఇన్నాళ్ళు కపట ప్రేమ చూపిన వైసీపీ ప్రభుత్వం పాలన ముగిసే సమయానికి అసలు రూపం బయట పెట్టింది. పాపం పండుటాకులని కూడా చూడకుండా మండుటెండలో నిలబెట్టింది. అయితే పింఛను పంపిణీలో నగదు జాప్యం సమాచారాన్ని ముందే తెలుసుకున్న వైసీపీ నాయకులు డివిజన్‌లలో ఇంటింటికీ తిరిగి తెలుగుదేశం పార్టీపై విష ప్రచారం చేశారు. ఈ రెండు నెలలు పింఛను ఇవ్వకుండా చంద్రబాబు నాయుడు కోర్టులో పిటిషన్ వేశారని, సచివాలయాలకు వెళ్ళాలని లబ్ధిదారులకు అసత్య ప్రచారాలు చేశారు. దీంతో చేసేదేమి లేక ఏడుపదులు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, సచివాలయాలకు పరుగులు పెట్టారు. అయితే అక్కడ కూడా వైసీపీ నాయకులు రాజకీయం చేయడాన్ని పలువురు తప్పు పడుతున్నారు. పింఛన్లకు నగదు ఇవ్వలేక, సమయానికి బ్యాంకుల్లో నగదు జమ చేయకపోవడంతో సచివాలయ సెక్రటరీలు సైతం ముఖం చాటేశారు. కార్యాలయాల వద్దకు విచ్చేసిన లబ్ధిదారులకు ఏం సమాధానం చెప్పాలో అర్థం గాక బిక్కమొహం వేశారు. అయితే మొదటి నుంచి పింఛన్ల పంపిణీపై డ్రామాలు చేసిన వైసీపీ తమ వైఫల్యాన్ని తెలుగుదేశం పార్టీపై రుద్దేశ ప్రయత్నాలు బాగానే చేసింది.

నగరంలో 21వేల మంది లబ్ధిదారులు

ఒంగోలు నగర పరిధిలో 50 డివిజన్లు ఉండగా ఆయా డివిజన్లలో సుమారు 1370 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ నుంచి వారి సేవలను నిలిపివేశారు. అయితే నగరంలో మొత్తం 70 సచివాలయాలు ఉండగా, ఒక్కో సచివాలయంలో పది మంది సెక్రటరీలు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు వలంటీర్లపై ఆధారపడిన సెక్రటరీలకు లబ్ధిదారుల ఇళ్ళు తెలియకపోవడంతో లబ్ధిదారులనే సచివాయాలకు రావాలని కబురు పెట్టారు. నగర పరిధిలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనారోగ్యంతో ఉన్న వారు మొత్తం కలిపి 21 వేల వరకు లబ్ధిదారులు ఉండగా, వారికి నెలనెలా రూ.6.5 కోట్లు అందజేస్తున్నారు. నెల క్రితం వరకు 1వ తేదీన పింఛన్లు అందించగా, కోడ్ అమలులో ఉండటంతో వైసీపీ ఓటర్లలో, కూర్చునేందుకు ఎలాంటి కుర్చీలు కూడా లేకపోవడంతో నిలువగాళ్లమీద గంటల తరబడి ఎదురు చూసినా నిరాశ ఎదురైంది. దీంతో పలువురు ప్రభుత్వ తీరుపై విమర్శలు చేయగా, వయసుమళ్ళిన వృద్ధులు వైసీపీ డ్రామాలు అర్థం కాక, అధికారులను, ప్రతి పక్ష పార్టీలను తిట్టుకుంటూ ఇంటిబాట పట్టారు.

మధ్యాహ్నం నుంచి మొదలు..

బుధవారం మధ్యాహ్నం 2గంటల నుంచి బ్యాంకుల్లో నగదు జమ అయ్యాయి. అది కూడా ఒకేసారి కాకుండా విడతల వారీగా జమ కావడంతో వాటిని డ్రా చేసుకునేందుకు సెక్రటరీలు సాయంత్రం వరకు బ్యాంకుల్లోనే నిలబడాల్సిన పరిస్థితి. దీంతో నగరంలోని ఆయా బ్యాంకుల్లో సాధారణ సేవలకు ఆటంకం ఏర్పడగా, పింఛను నగదు అందించడానికే బ్యాంకు సిబ్బందికి సమయం సరిపోయింది. దీంతో మధ్యాహ్నం 3-30 గంటల తర్వాత పలు సచి



కొప్పోలు సచివాలయంలో పింఛను కోసం క్యూ



ఇందిరమ్మకాలనీలోని సచివాలయంలో ఎదురుచూపులు

పింఛనుదారుల్లో సానుభూతి పొందేందుకు వేసిన కొత్త ఎత్తుగడలు కష్టాలు తెచ్చిపెట్టాయి. ఏడుపదులు దాటిన వృద్ధులు సైతం సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. ఆయా సచివాలయాల్లో కనీసం తాగునీరు లేకపోగా, వాలయాల్లో పింఛను పంపిణీ కార్యక్రమం మొదలైంది. అయితే ఈ పంపిణీ కార్యక్రమం రాత్రి 7గంటల వరకు కొనసాగించాలని, అవసరమైతే ప్రభుత్వ సెలవురోజుల్లో కూడా పూర్తిస్థాయిలో అందించాలని అధికారుల నుంచి



ఘోషా ఆసుపత్రి ఆవరణలోని సచివాలయానికి వస్తున్న వృద్ధులు

ఆదేశాలు రావడంతో లబ్ధిదారులకు సచివాలయాల వద్దనే పంపిణీ చేశారు. ఇదిలా ఉంచితే నడవలేనివారు, అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితం అయిన వారికి గురువారం పింఛను ఇవ్వనున్నట్లు సమాచారం.

ముందస్తు సమాచారం ఇవ్వని వైనం

గత నెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఇప్పటి వరకు వైసీపీ కార్యకర్తల్లా పనిచేసిన వలంటీర్లు ఈ ఎన్నికల్లో ఓటర్లను మరింత ప్రభావితం చేసే అవకాశం ఉందని భావించిన ఎన్నికల కమిషన్ వలంటీర్లను విధులకు దూరంగా ఉంచింది. అయితే వలంటీర్లు లేకపోయినా, సచివాలయ సెక్రటరీలు ఇంటికెళ్ళి పింఛన్ అందించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ సెక్రటరీ కార్యాలయాలు వదలి బయటకు వెళ్ళని పరిస్థితి కనిపించింది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఆరోగ్యం సరిలేక మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దకే వెళ్ళి పింఛను ఇవ్వాలని ఆదేశాలు ఉండగా, దానిపై క్లస్టర్‌లలో ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దీంతో ఈనెల పింఛన్‌పై లబ్ధిదారులు అయోమయానికి గురయ్యారు.

6 నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 3 : అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 6 నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ)-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి తెలిపారు. పరీక్షల టైం టేబుల్‌ను ఆయన విడుదల చేశారు. 1 నుంచి 8 తరగతి వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, 9వతరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు పరీక్ష జరుగుతుంది. 6న అన్ని తరగతులకు ప్రథమభాష తెలుగు పరీక్ష ఉంటుంది. 8న 1 నుంచి 5 తరగతులకు ఇంగ్లీషు పార్ట్ ఏ, 6 నుంచి 9 తరగతులకు ద్వితీయ భాష హిందీ ఉంటుంది. 10న 1 నుంచి 5 తరగతులకు ఇంగ్లీషు పార్ట్‌బీ లోఫెల్, 6 నుంచి 9 తరగతులకు ఇంగ్లీషు పార్ట్‌ఏ పరీక్ష, 12న 1 నుంచి 5 తరగతులకు గణితం, 6 నుంచి 9 తరగతుల వరకు ఇంగ్లీషు పార్ట్‌బీ లోఫెల్, 13న 3, 4, 5 తరగతులకు పరిసరాల విజ్ఞానం, 6 నుంచి 9 తరగతులకు గణితం పరీక్ష ఉంటుంది. 15న 3, 4, 5 తరగతులకు ఓఎస్‌ఎస్‌సీ, 6, 7 తరగతులకు జనరల్ సైన్స్, 8, 9 తరగతులకు ఫిజికల్ సైన్స్, 16న 1 నుంచి 5 తరగతులకు ఎస్‌ఎల్‌ఏఎస్ గ్రేడ్ 4, 8, 9 తరగతులకు బయాజికల్ సైన్స్ పరీక్ష, 18న 6 నుంచి 9 తరగతులకు సోషల్ స్టడీస్ పరీక్ష ఉంటుంది. 19న 6 నుంచి 9 తరగతులకు కాంపొజిట్ కోర్సు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలు పూర్తయిన తర్వాత 21వతేదీ నాటికి జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తిచేయాలి. 23వతేదీ నాటికి ప్రోగ్రెస్ కార్డులు, ప్రమోషన్ జాబితాలు తయారుచేయాలని ఆ ఉత్తర్వులో డైరెక్టర్ ఆదేశించారు.

ఎన్నికల కోడ్‌లోనూ
గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలు

• పట్టించుకోని పోలీసు, రెవెన్యూశాఖ





మల్లవరంలో ఇసుక తవ్వకాలు, అన్నంగి కొండ నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పరు

మద్దిపాడు, ఏప్రిల్ 3: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా మండలంలో ఇసుక, కొండ గ్రావెల్ అడ్డూ అదుపులేకుండా తవ్వకాలు సాగుతున్నాయి. ఇలా తవ్విన వనరులను బహిరంగంగానే నిల్వచేసి విక్రయిస్తున్నా పట్టించుకుంటున్న వారే కరువయ్యారు. ముఖ్యంగా మల్లవరం, కొలచనకోట, ఇనమనమెళ్లూరు గుండ్లకమ్మ పరివాహన ప్రాంతాల్లో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇక అన్నంగి కొండ గ్రావెల్‌ను వైసీపీ నాయకులు బాహాటంగా టిప్పర్లతో తరలిస్తున్నా పట్టించుకుంటున్న అధికారులే లేరు. గుండ్లాపల్లికి చెందిన ఓ వ్యక్తి రాత్రిళ్లు కొండను తవ్వి ఉదయం పూట టిప్పర్లతో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ఎన్నికల విధుల్లో ఉండటంతో అక్రమార్కులకు కలిసివస్తోంది. కొంతమంది పోలీసులు అక్రమార్కులకు సహకరిస్తూ నజరానాలు అందుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన అజితారావు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 3: గత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ యర్రగొండపాలెం అభ్యర్థిగా పోటీ చేసిన బూదాల అజితారావు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న అజితారావు, త్వరలో జరిగే ఎన్నికల్లో యర్రగొండపాలెంలో పోటీ చేసేందుకు ఆ స్థానాన్ని ఆశిస్తున్నారు. ఈ మేరకు తనకు అవకాశం ఇవ్వాలని అజితారావు కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ మహాసంఘ్ జిల్లా అధ్యక్షుడిగా ప్రసన్నకుమార్‌శర్మ



లంకా ప్రసన్నకుమార్

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 3: అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ్ జిల్లా అధ్యక్షుడిగా ఒంగోలుకు చెందిన ప్రముఖ పురోహితులు లంకా ప్రసన్నకుమార్‌శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు కొద్ది రోజుల కిందట నియామకపు ఉత్తర్వులు అందగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా పోగుల దుర్గాప్రసాద్, సూరపరాజు రాము శర్మ ఉపాధ్యక్షులుగా, రామరాజు మల్లికార్జునశర్మ ప్రధానకార్యదర్శిగా, పి.నరసింహారావు, దూపాటి రఘురాం, శంకరమంచి శ్రీధర్‌లు కార్యదర్శులుగా నియమితులైనట్లు ప్రసన్నకుమార్‌శర్మ తెలిపారు. జిల్లాలో బ్రాహ్మణుల అభ్యున్నతి, సంక్షేమం కోసం తమ శక్తిమేరకు కృషిచేస్తామని వారు పేర్కొన్నారు. కాగా మహాసంఘ్ నూతన కార్యవర్గానికి ఆలూరు రామారావు, కూరపాటి చంద్రశేఖర్, జొన్నలగడ్డ వేదసాయి శర్మ, కూరపాటి ప్రసాద శర్మ, శివదేవుని మురళీధర శర్మ, గుడ్లూరి సురేష్ శర్మ, సంగుభొట్ల ప్రసాదశర్మ తదితర పురోహిత ప్రముఖులు అభినందించారు.

కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి రావాలి : బీఎన్

సంతనూతలపాడు, ఏప్రిల్ 3: దేశంలోను, రాష్ట్రంలోను ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావాలని టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని తన కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తేనే ప్రజలకు సంక్షేమపాలన అందుతుందన్నారు. జనసేన సమన్వయకర్త కందుకూరి బాబు మాట్లాడుతూ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్‌ను, బాపట్ల ఎంపీ అభ్యర్థి తేనేటి కృష్ణప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, బీజేపీ నాయకులు బత్తుల ఆనంద్‌కుమార్, నాలుగు మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రతినిత్యం ప్రజల కోసం పనిచేస్తా..





చిన్నారులతో సెల్ఫీ దిగుతున్న దామచర్ల, రియాజ్, రాఘవరెడ్డి, పూలమాలతో సత్కరిస్తున్న స్థానికులు

• టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల
• భాగ్యనగర్‌లో ఇంటింటి ప్రచారం

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 3: ప్రజలు ఆశీర్వదించి ఆదరిస్తే అందరికీ అండగా ఉండి అభివృద్ధి చేస్తానని ఒంగోలు టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. బుధవారం నగరంలోని 20వ డివిజన్ భాగ్యనగర్‌లో జనం కోసం జనార్దన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం అధికారంలోకి రాగానే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడే భాగ్యనగర్‌లో రోడ్లు, డ్రైన్‌లు, పార్కులు అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. ఇక్కడి ప్రజల కోసం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు గతంలో కొద్దిపాటి వర్షానికే చెరువులను తలపించేలా ఉన్న వీధులను బాగుచేయించినట్లు వివరించారు. పారిశుధ్యం మెరుగు కోసం, మురుగు నీటి పారుదల వ్యవస్థ కోసం అవసరమైన నిధులు కేటాయించి కాలువలు, రోడ్లు, ప్రతి వీధిలో పచ్చని మొక్కలు నాటించి అభివృద్ధి చేస్తామనని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించిందని తెలిపారు. చివరికి చెత్తపైనా పన్ను విధించిన పనికిమాలిన ప్రభుత్వానికి వచ్చే నెలలో జరిగే ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరిన ఆయన సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశాన్ని ఇవ్వాలని దామచర్ల కోరారు. ఎంపీ మాగుంట తనయుడు రాఘవరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా, పలువురు మహిళలు దిష్టి తీసి, హారతులు అందించి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, టీడీపీ నాయకులు కొఠారి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, బండారు మదన్, డివిజన్ అధ్యక్షులు బోయపాటి హరిబాబు, నల్లూరి అశోక్, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, తన్నీరు వాసు, మలగా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి..అభివృద్ధి చేస్తా..!



మట్టిగుంటలో ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్



దొడ్డవరంలో మాట్లాడుతున్న బీఎన్

• తెలుగుదేశం కూటమి ఎస్‌ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 3 : వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, తద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మట్టిగుంట గ్రామంలో బుధవారం రాత్రి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ అందరికీ సుపరిచితుడిని అయిన తనను ఎమ్మెల్యేగా గెలిపిచాలన్నారు. గతంలో నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, తెలగతోటి జాన్సన్, బి.సెల్వం తదితరులు పాల్గొన్నారు.

దొడ్డవరంలో మౌలిక వసతులు కల్పిస్తా..

మద్దిపాడు: దొడ్డవరం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని, త్వరలో జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. బుధవారం దొడ్డవరంలో వడ్డెర సామాజికవర్గ సోదరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రజల పార్టీ అని, అందరికీ సామాజిక న్యాయం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు సమష్టిగా పనిచేసి విజయ్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, నాయకులు కుంచాల రామాంజి, పల్లెపు రామాంజనేయులు, అంకమ్మరావు, వడ్డెంపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పింఛన్ డబ్బు దారి మళ్లించిన జగన్

తన అడ్డగోలు అవినీతి, అసమర్థ విధానాలతో ఖజానాను ఖాళీ చేసింది కాక పింఛన్ డబ్బును కూడా దారిమళ్లించిన సీఎం జగన్ ప్రతిపక్షాలపై నింద వేయడం ఆయన అసమర్థతకు నిదర్శమని బీఎస్.విజయకుమార్ విమర్శించారు. పింఛన్లు ఆగడానికి కారణం వైసీపీ ప్రభుత్వానిదేనని, అయితే అసత్య ప్రచారానికి దిగిందని ధ్వజమెత్తారు.

జీజీహెచ్‌లో మెరుగైన సేవలు అందించాలి

• మెడికల్ డైరెక్టర్ రంగనాథన్

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 3: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య విద్య డైరెక్టర్ రంగనాథన్ సూచించారు. బుధవారం ఒంగోలు విచ్చేసిన ఆయన జీజీహెచ్‌లోని వైద్య అధికారులతో సమీక్షించారు. రోగులకు అందుతున్న సేవలు, వైద్య కళాశాలలో మౌలిక వసతులపై ఆయన సంబంధిత హెచ్‌వోడీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రంగనాథన్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రతి ఒక్కరికి శస్త్ర చికిత్సలు అందేలా చూడాలని తెలిపారు. అలాగే ఆసుపత్రిలోని వైద్య పరికరాల పనితీరు, మెడికల్ కళాశాల, హాస్టల్‌లో వసతులు, విద్యాబోధన అలాగే, నర్సింగ్ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై ఆయన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పదిసంవత్సరాలు కిత్రం రికార్డులను స్కానింగ్ చేసి డిజిటల్ ఈ ఫైల్ విధానంలోకి తీసుకురావాలని ఆర్‌ఎంవోకి సూచించారు. అనంతరం ఆయన ఆసుపత్రిలోని పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు తాగునీటి ఇబ్బందులను డైరెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ వైద్యులు సుధాకర్‌రావు, ప్రభాకర్‌రావు, బాలాజీనాయక్, చైతన్యవర్మ తదితరులు పాల్గొన్నారు.



వైద్య అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ రంగనాథన్

అవీ..ఇవీ..

జనసేన నాయకురాలికి అభినందన



శ్రీదేవిని అభినందిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 3 : జనసేన పార్టీ కృష్ణా, పెన్నా ప్రాంతీయ కమిటీ సభ్యురాలుగా బొంది ల శ్రీదేవి నియమితులయ్యారు. ఒంగోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం శ్రీదేవి అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీదేవిని బొకేలు అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. భవిష్యత్‌లో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో నాయకులు చిట్టెం ప్రసాద్, ముత్యాల కళ్యాణ్, జడా బాలనాగేంద్రం, పిల్లి రాజేష్, పల్ల ప్రమీల, రాఘవ, ఆకుపాటి ఉష, మాదాసు సాయి, సుంకర కళ్యాణి, పవన్, అలా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలను పరిష్కరిస్తాం : డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 3: జిల్లాలో ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఒంగోలులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం ఆశా గ్రీవెన్స్ రీడ్రెసెల్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంతకు ముందు ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు కల్పన పలు అంశాలను డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్ళారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించడంతో పాటు ఆశాలకు సంబంధం లేని పనులను చేయించకూడదని సర్క్యులర్ జారీ చేయాలన్నారు. హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాలు, సబ్‌సెంటర్లలో ఆశా వర్కర్లు రావాల్సిన అవసరం లేకపోయినా పిలుస్తున్నారని తెలిపారు. ఆయా సమస్యలపై రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఎం డాక్టర్ వాణిశ్రీ, యూనియన్ జిల్లా కోశాధికారి అనూష, పరిశుద్ధం, అరుంధతి, దేవదానం, పద్మ, విజయ, దేవదానం, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు విశేష స్పందన

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 3: ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఐకూయేసి సంయుక్తంగా నిర్వహించిన జాతీయ అంతర్జాల సదస్సుకు విశేష స్పందన లభించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి అధ్యక్షతన జరిగిన సదస్సులో రసాయన శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి ఆహ్వానం పలుకగా భౌతికశాస్త్రం డాక్టర్ ఇందిర రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. డాక్టర్ జేఎస్.కిరణ్, డాక్టర్ ఎస్.మంజులభారతి, ప్రొఫెసర్ ఎస్‌వీఎస్.వేణుగోపాల్, డాక్టర్ కె.ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సదస్సులో ప్రసంగించారు.

24నుంచి పంచాయతీరాజ్ దినోత్సవ సదస్సులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 3: జాతీయ పంచాయతీరాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 24నుంచి మూడు రోజుల పాటు సదస్సులు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి తెలిపారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు అత్యంత చేరువగా ఉండే ప్రజాప్రతినిధి వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ అన్నారు. పంచాయతీరాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎంపిక చేసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, జడ్పీచైర్మన్, కౌన్సిలర్, కార్పొరేటర్లకు సేవా పురస్కారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రసాదరావు, మోహనరావు, సీతామహాలక్ష్మి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఏబీఎంకు పూర్వవైభవం తీసుకురావాలి



మాట్లాడుతున్న పుష్పరాజ్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 3 : ఒంగోలులో ఎంతో చరిత్ర ఉన్న ఏబీఎం విద్యా సంస్థకు పూర్వ వైభవం తీసుకొని రావాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆ విద్యా సంస్థల కరస్పాండెంట్ గారపాటి పుష్పరాజ్ పేర్కొన్నారు. స్థానిక ఏబీఎం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా ఎన్నోవేల మంది ఉన్నత స్థితిలో ఉండేందుకు తోడ్పడిన విద్యా సంస్థ అని చెప్పారు. బాలుర హాస్టల్‌ను ఎస్‌టీబీసీ చైర్మన్ దివాకర్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఈవో మధుసూదన్, ప్రిన్సిపాల్ దేవరకొండ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీవారి ఆస్థానం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 3: ఒంగోలు నగరం శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి ఆస్థానం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణానక్షత్రం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నాద నీరాజనం, చతుర్వేద పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణ, రామాయణ, భాగవత పారాయణ మొదలైన పలు క్రతువులు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. అనంతరం జరిగిన భక్తి సంకీర్తనల ఆలాపన భక్తులను విశేషంగా అలరించింది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, సీవీ.రామకృష్ణారావు, వేంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి తదితరులు పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

ధైర్యంగా ఓటుహక్కును వినియోగించుకోండి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

సంతనూతలపాడు, ఏప్రిల్ 3: రానున్న ఎన్నికల్లో ధైర్యంగా, మీ మనస్సుకు నచ్చిన అభ్యర్థికి ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. బుధవారం మండలంలో లక్ష్మీపురంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐటీ, నీట్ ఫౌండేషన్ శిక్షణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యాజమాన్యం

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 3 : నగరంలోని హైదరబాద్ స్కూలు రెండో బ్రాంచ్‌లో సీబీఎస్‌ఈ, ఐఐటీ, నీట్ ఫౌండేషన్‌లో మాక్ స్పీడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నట్లు డైరెక్టర్ జగదీష్ తెలిపారు. బుధవారం స్థానిక స్కూలులో ఆయన మాట్లాడుతూ హెచ్‌పీఎస్ స్కూలులో అడ్మిషన్లు పొందిన వారికి పాఠశాల విద్యాబోధనతోపాటు అదనంగా వీటిని అందిస్తున్నట్లు చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరంలో నూతనంగా ప్రవేశపెడుతున్న ఈ విధానం ద్వారా పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలలో సులువుగా సీట్లు సాధిస్తారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఏడు సచివాలయాల్లో ప్రారంభం కాని పింఛన్ల పంపిణీ

చీమకుర్తి, ఏప్రిల్3 : చీమకుర్తి పట్టణంతో పాటు మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో బుధవారం పింఛన్లు పంపిణీ చేస్తారన్న సమాచారంతో సచివాలయాలకు విచ్చేసిన పింఛన్‌దారులు ఎదురుచూపులు చూడాల్సి వచ్చింది. బ్యాంకులో నగదు పడకపోవటంతో సచివాలయ ఉద్యోగులు సైతం బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఎట్టకేలకు సాయంత్రం నాలుగు గంటల సమయంలో చీమకుర్తి టౌన్‌తో పాటు రూరల్ మండలాల్లో పింఛన్లు పంపిణీని మొదలుపెట్టారు. కానీ ఏడు సచివాలయాల పరిధిలో రాత్రి అయినా పంపిణీ మొదలుకాలేదు. దీనిపై ఎంపీడీవో రాఘువేంద్రను వివరణ అడగ్గా యూనియన్ బ్యాంకులో టెక్నికల్ సమస్య తలెత్తిందన్నారు. ఆయా సచివాలయ పరిధిలో కూడా పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు.

పింఛన్ల కోసం పడిగాపులు


ఎం నిడమలూరులో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

గ్రామ సచివాల వద్ద ఎదురుచూపులు
కొన్నిచోట్ల మధ్యాహ్నం నుంచి పంపిణీ
నగదు సరిపోక కొందరికే ఇచ్చి మమ
మరికొన్ని గ్రామాల్లో మొదలుకాని వైనం
నిరాశతో వెనుదిరిగిన లబ్ధిదారులు

టంగుటూరు, ఏప్రిల్ 3 : పింఛన్ల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాశారు. అధికారులు నిర్ధిష్ట సమయం చెప్పకపోవడంతో అంతా అయోమయంగా మారింది. పింఛన్‌దారులంతా ఉదయాన్నే గ్రామ సచివాలయాల వద్దకు చేరుకున్నారు. వయోభారంతో ఉన్న వారు, దివ్యాంగులు, ఇతరత్రా కారణాలతో మంచంలో ఉన్న వారికి నేరుగా ఇళ్లకే వచ్చి పింఛన్లు ఇస్తారని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటికే రెండు రోజులు ఆలస్యమవడంతో తల్లడిల్లుతున్న అవ్వాతాతలు ఇవేమీ పట్టించుకోలేదు. ముందు పింఛన్ సొమ్ము తీసుకుందామన్న ఆత్రుతతో గ్రామ సచివాలయాల వద్దకు ఉదయం నుంచే రావడం ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి నగదు తెస్తారు, ఆ వెంటనే పంపిణీ చేస్తారని ఎదురుచూశారు. కొన్నిచోట్ల కిలోమీటర్ దూరానికి పైగా నడచి గ్రామ సచివాలయానికి చేరుకున్న వారు తిరిగి వెళ్లలేక ఎండలోనే మలమలమాడుతూ అక్కడే ఉండిపోయారు. చాలా మంది మధ్యాహ్న భోజనం కూడా చేయకుండా పడిగాపులు కాశారు. ఎట్టకేలకు మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో పింఛన్ సొమ్ము బ్యాంకుల నుంచి సచివాలయ సిబ్బంది తీసుకున్నారని తెలుసుకొని అంతా సంబరపడ్డారు. పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాలకు రాగానే ఆగమేఘాలపై డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు నేరుగా గ్రామ సచివాలయాలకు చేరుకున్నారు. అదరాబదరా పంపిణీ ప్రారంభించారు. కొన్ని గ్రామ సచివాలయాలకు బ్యాంకులో చాలినంత నగదు లభించక వారు తికమక పడ్డారు. అందుబాటులో ఉన్న కాస్త సొమ్ము ఎవరికి ఇవ్వాలో అంతుబట్టక ఆందోళన చెందారు. అనంతవరం సచివాలయం పరిధిలో ఉన్న 477 మంది పింఛన్‌దారులకు రూ.14 లక్షలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.50వేలు మాత్రమే బ్యాంకులో జమ అయ్యాయి. ఆ సొమ్మును డ్రా చేసిన సచివాలయ సిబ్బంది ముందు వరుసలోని వారికిచ్చి మమ అనిపించారు. ఇలాగే మరికొన్ని గ్రామాల్లోనూ జరిగింది. దీంతో మిగిలిన వారు ఉసూరుమంటూ ఇంటి ముఖం పట్టారు.

కొండపి మండలంలో సాయంత్రం నుంచి పంపిణీ

కొండపి : పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నుంచి మండలంలోని సచివాలయాల్లో ప్రారంభించారు. ఉదయం 9 గంటలకే సచివాలయాల వద్దకు పింఛన్‌దారులు చేరుకున్నారు. అయితే 10.30 నిమిషాలకు విధులకు వచ్చిన సిబ్బంది బ్యాంకులకు వెళ్లి నగదు తెచ్చి సాయంత్రం ఇస్తామని చెప్పి వెళ్లారు. తిరిగి నగదుతో 4 గంటలకు సచివాలయాలకు చేరుకున్నారు. అప్పటి వరకూ చాలా మంది పింఛన్‌దారులు అక్కడే ఎదురుచూశారు. మండలంలో 6,415 మంది పింఛన్‌దారులు ఉన్నారు.రాత్రికి దాదాపు సగం మందికి పింఛన్ డబ్బులు అందజేస్తామని అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రానికి పంపిణీ పూర్తి చేస్తామని చెప్పారు.

పింఛన్‌లు త్వరగానే ఇస్తాం

కొండపిలోని సచివాలయం వద్ద పింఛన్‌ల పంపిణీని పీఆర్ ఏఈ, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి బి.ప్రసాదరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపి-1, కొండపి-2 పరిధిలోని గ్రామాల్లో 700మందికి పైగా లబ్ధిదారులున్నారన్నారు. తొలిరోజు మూడొంతుల మందికి సచివాలయ సిబ్బంది పింఛన్‌లు అందజేశారని చెప్పారు.

పొన్నలూరు మండలంలో..

మండలంలో 6,280 మంది పింఛన్‌దారులు ఉన్నారని ఎంపీడీవో బి.కల్పన తెలిపారు. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు 30శాతం మందికి నగదు పంపిణీ చేశామన్నారు. బెడ్ రెస్ట్‌లో ఉండే, అనారోగ్య సమస్యలతో సచివాలయాల వద్దకు రాలేని వారికి ఇళ్లకు వెళ్లి అందజేస్తామని ఆమె వివరించారు.

జరుగుమల్లి మండలంలో..

మండలంలోని 15 సచివాలయాల పరిధిలో 6,519 మంది పింఛన్‌దారులు ఉన్నారని ఎంపీడీవో జలజాక్షి తెలిపారు. సాయంత్రం నుంచి పింఛన్‌దారులకు సచివాలయ సిబ్బంది నగదును అందజేస్తున్నారని ఆమె చెప్పారు.


వేలం కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

పొగాకు వేలం కేంద్రాన్ని
సందర్శించిన బోర్డు చైర్మన్

టంగుటూరు, ఏప్రిల్ 3 : పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ బుధవారం స్థానిక వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. రైతులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రేడింగ్ చేసిన పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురావాలని వారికి సూచించారు. అన్యపదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనధికారికంగా పొగాకు అమ్మవద్దన్నారు. శీతల గిడ్డంగుల్లోని బేళ్ల వివరాలను, బయటకు తీసి వేలం కేంద్రంలో పెట్టే బేళ్ల వివరాలను వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. కొనుగోలుదారులతోనూ ఆయన మాట్లాడారు. అన్ని గ్రేడ్లకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బోర్డు ఆర్‌ఎం ఎం.లక్ష్మణరావు, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ జి.సిద్ధిరాజు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహారావు, టంగుటూరు, సాధువారిపాలెం, జరుగుమల్లి, వావిలేటిపాడు రైతులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు దక్షిణ రాజగోపుర కలశ ప్రతిష్ఠ

సింగరాయకొండ, ఏప్రిల్ 3 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం దక్షిణ రాజగోపుర ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో పి.కృష్ణవేణి తెలిపారు. విఖనస, క్షేత్రపాలక కాలభైరవస్వామి, వినాయక నూతన బింబ ప్రతిష్ఠ కూడా జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు వేదపండితుల ఆధ్వర్యంలో శాంతి కల్యాణం ఉంటుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులుకావాలని కోరారు. కాగా బుధవారం దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు.

అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

జిల్లాలో మొదటి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టరు దినేష్ కుమార్

పుల్లలచెరువు,ఏప్రిల్ 3: వచ్చే ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టరు , ఎన్నికల అధికారి ఏ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. బుధవారం ఎర్రగొండపాలెం మండలం పాలుట్ల చెంచు గూడెంలో ఎన్నికల ప్రకియలో భాగంగా వరుస సంఖ్యలో జిల్లా మొదటి పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం గూడెంలో పర్యటించి గిరిజనులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి ఓట్లు గురించి గిరిజనులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలుకు సుమారు 190 కిలోమీటర్ల దూరంలో పాలుట్ల దట్టమైన నల్లమల అటవీ ప్రాతంలో ఉందని అన్నారు. ఇక్కడ విద్యుత్ లేకపోయినా సోలార్, బోర్వెల్ ద్వారా ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉన్న మొదటి సంఖ్యను పాలుట్ల దక్కించుకుందని అన్నారు. పాలుట్లలో మొత్తం 3,000 వేల జనాభా ఉండగా 961 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. 2019 ఎన్నికల్లో ఇక్కడ 70 శాతం పోలింగ్ నమోదు అయ్యిందని, వచ్చే ఎన్నికల్లో 80 శాతం పైగా నమోదు అయ్యేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని అన్నారు. తద్వారా మారుమూల గ్రామమైనప్పటికి ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఉండేలా దృష్టి సారించిందని అన్నారు. అనంతరం తమ ఓటును నిర్భయంగా వినియోగించుకుంటామని గిరిజనులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టరు రవీంద్రరెడ్డి, మార్కాపురం సబ్‌కలెక్టరు రాహుల్‌మీనా ,జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, జిల్లా స్వీప్ నోడల్ అధికారులు జ్యోతి, రవి, వైపాలెం రిటర్నింగ్ అధికారి శ్రీ లేఖ, డీఎల్‌డీవో సాయి కుమార్, వైపాలెం తహసీల్దారు సోమ్లు నాయక్, అధికారులు పాల్గొన్నారు.


పాలుట్లలో ఎన్నికల గురించి గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టరు, ఎన్నికల అధికారి ఏ.ఎస్. దినేష్ కుమార్

నాగిరెడ్డిపల్లిలో..

కొనకనమిట్ల : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఇంటింటికీ మన కందుల కార్యక్రమాన్ని మార్కాపురం ఉమ్మడి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు.ఈకార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు రోహిత్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన రమ్య

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రమ్యకు బంగారు పతకం

టంగుటూరు, ఏప్రిల్ 3 : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పంచాయతీ పరిధిలోని రావివారిపాలెంనకు చెందిన బండి రమ్య సత్తా చాటారు. బంగారు పతకం సాధించారు. ఈపోటీలు గత నెల 30,31 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగాయి. 76 కేజీల అండర్-19 విభాగంలో పాల్గొన్న రమ్య పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఆమె జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలోని కేజీబీవీ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఈసందర్భంగా రమ్యను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.స్రవంతి, పీఈటీ బి.హెప్సిబా, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.


రాఘవరెడ్డితో జనసేన పార్టీ కొండపి నాయకులు

రాఘవరెడ్డిని కలసిన జనసేన నాయకులు

టంగుటూరు, ఏప్రిల్ 3 : తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డిని బుధవారం ఒంగోలులో కొండపి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కనపర్తి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ త్వరలోనే కొండపిలో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దానికి హాజరుకావాలని రాఘవరెడ్డిని ఆహ్వానించినట్లు తెలిపారు. రాఘవరెడ్డిని కలిసిన వారిలో మాగుంట ముఖ్యఅనుచరుడు ఐనాబత్తిన ఘనశ్యాం, జనసేన నాయకులు ఐనాబత్తిన రాజేష్, గూడా శశిభూషణ్, సయ్యద్ ఖాజాహుస్సేన్, కిచ్చంశెట్టి ప్రవీణ్‌కుమార్, లింగంగుంట చంద్రవాస్, మేళం శ్రీనివాసరావు, పంబ వీరబ్రహ్మయ్య అల్తాఫ్ ఉన్నారు.

13న కోదండరామస్వామి నూతన శిలాబింబ ప్రతిష్ఠ

జరుగుమల్లి (కొండపి), ఏప్రిల్ 3 : మండలంలోని దావగూడూరు గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీహనుమత్, లక్ష్మణ, సీతా సమేత కోదండ రామస్వామి నూతన శిలాబింబ ప్రతిష్ఠ ఈనెల 13న జరుగుతుందని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. అందుకు సంబంధించిన కార్యక్రమాలు 11వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ప్రతిష్ఠ రోజున అన్నదానం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కమిటీ కోరింది.

నవోదయలో ఆరుగురు విద్యార్థులకు సీట్లు

కొణిజేడు (టంగుటూరు), ఏప్రిల్ 3 : మండలంలోని కొణిజేడు శ్రీశ్రీనివాస యూపీ స్కూల్ విద్యార్థులు ఆరుగురు ఈ ఏడాది నవోదయలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొల్లి శ్రీనివాసులును తల్లిదండ్రులు, గ్రామస్థులు బుధవారం అభినందించారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి

» ఎమ్మెల్యే గొట్టిపాటి

బల్లికురవ, ఏప్రిల్ 3 : ఎన్నికలలో తెలుగదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కోరారు. బుధవారం చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే గృహంలో బుధవారం మండలంలోని వేమవరానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ వైసీపీ పార్టీ చేపట్టిన తప్పుడు పనుల వలన అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రజా సమస్యలు పట్టకుండా ప్రచార పిచ్చితో జగన్ పనిచేశారని అయన విమర్శించారు. అనంతరం గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వారితో చర్చించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ద్వారా పలు సీసీ రోడ్లు వేయించిన విషయాన్ని అయన వారికి గుర్తు చేశారు. పార్టీలో చేరిన వారిలో గరికపాటి సుబ్బారావు, ధర్మయ్య, పొత్తూరి సతీష్, గరికపాటి సత్యనారాయణ, చలపతి, రామకోటేశ్వరరావు, పొత్తూరి సుబ్బారావు, రామారావు, గోవర్ధనయ్య, హరిబాబు ఉన్నారు.


ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వేమవరం వాసులు

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్

మండలంలోని వేమవరం గ్రామంలో టీడీపీ నేత పేరం సుబ్బయ్య కుమారుడు సాయితేజ ఇటీవల మృతి చెందడంతో బుధవారం వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శించారు. అలాగే ఎస్టీ కాలనీలో కార్యకర్త భూక్యా నాయక్ మృతిచెందగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ నేతలు గొట్టిపాటి మారుతి ఉన్నారు.


ఓటర్లకు అవగాహన కలిగిస్తున్న నోడల్ అధికారి విక్టోరియా రాణి

ఓటర్లకు అవగాహన

కొండపి, ఏప్రిల్ 3 : ఓటర్లు తప్పనిసరిగా తమ హక్కును వినియోగించుకోవాలని నోడల్ అధికారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విక్టోరియారాణి పిలుపునిచ్చారు. మండలంలోని మూగచింతలలో బుధవారం పచ్చాకు కూలీలకు, గ్రామస్థులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఒక్క ఓటుతో ఏమవుతుందిలే అని నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. బాధ్యతగా ఓటు వేసి ప్రజలకు సేవచేసే నాయకుడిని ఎన్నుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

నేటి నుంచి మూడు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నీ

బల్లికురవ, ఏప్రిల్ 3 : మండలంలోని కొణిదెన గ్రామంలో నేడు గురువారం నుంచి బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమవుతాయని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. మెదటి బహుమతిగా రూ.20,116, రెండో బహుమతిగా రూ. 15,116, మూడో బహుమతిగా రూ.10,116, నాలుగో బహుమతిగా రూ.5,116 అందిస్తున్నామని ఆసక్తి కలిగిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన వచ్చని నిర్వాహకులు కోరారు.


గడ్డికి అంటుకున్న మంటలను ఆర్పుతున్న గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది

వైసీపీ అభ్యర్థి ప్రచారంలో అత్యుత్సాహం

- **కాల్చిన బాణసంచా గడ్డివామిపై పడి మంటలు**
- **యాభైవేల నష్టానికి పది వేలు చేతులో పెట్టిన అభ్యర్థి**

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 3: వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ ప్రచారంలో అపశ్రుతి చోటుచేసుకుంది.ఎన్నికల ప్రచారంలో పేద రైతుకు చెందిన వరిగడ్డిని కాల్చి యాభై వేల నష్టానికి పది వేలు చేతిలో పెట్టి వెళ్లాడు. ఆ రైతు లబోదిబో మంటున్నాడు. ఈ సంఘటన మండలంలోని చిన్నదోర్నాల గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. తాటిపర్తి పర్యటనలో భాగంగా పేల్చిన బాణ సంచా గడ్డివామిపై పడి అగ్ని ప్రమాదానికి గురైంది.పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడడంతో గ్రామ ప్రజలు పరుగులు తీశారు. 43డిగ్రీల ఉష్ణోగ్రతలో ఎండలు మండిపోవడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అప్రమత్తమైన గ్రామ వాసులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమివ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా గడ్డి అంతా పొగ చూరుకుపోయింది. గడ్డి యజమాని ఎలకపాటి అరున్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ మధ్యే యాభై వేలు పెట్టి నాలుగు ట్రిప్పులు ట్రాక్టరు గడ్డి కొన్నానని వాపోయాడు. దీంతో తాటిపర్తి ఇంట్లోకి అరున్‌ను తీసుకుపోయి పది వేలు చేతిలో పెట్టి తర్వాత చూద్దామంటూ చిన్నగుడిపాడు వెళ్లి పోయారు. అరున్‌కు ఏమి పాలుపోలేదు. యాభైవేల రూపాయలు గడ్డిని కాల్చి పది వేలు చేతిలో పెట్టి పోతే మా పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


దేవాలయం వెనుక వైపు తొలగించిన రాళ్లను చూస్తున్న గ్రామస్థులు

అంబాపురంలో గుప్తనిధుల కలకలం

కొనకనమిట్ల, ఏప్రిల్ 3 : మండలంలోని వాగుమడుగు పంచాయతీలోని అంబాపురంలోని బాలత్రిపురసుందరీ దేవి ఆలయంలో గుప్త నిధుల తవ్వకాలు జరిగాయంటూ కలకలం రేగింది. గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దేవాలయం వెనుక వైపుఉన్న గోడకు గుర్తు తెలియని వ్యక్తులు కొందరు కన్నం వేసే క్రమంలో గోడలో ఉన్న పెద్ద బండరాయిని తొలగించారు. వెంటనే సమాచారం అందుకున్న కొనకనమిట్ల పోలీసులు గ్రామంలోని దేవాలయాన్ని సందర్శించారు. పరిసరప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అయితే అక్కడ గునపాలతో బండరాయిని తొలగించినట్లు అనవాలు లేవని వారంటున్నారు. గ్రామస్థులతో పోలీసులు మాట్లాడి వివరాలు సేకరించారు.

నోటి సమస్యల నుంచి విముక్తి

» జిల్లా హాస్పిటల్‌లో
నోటి కేన్సర్‌ను గుర్తించే పరికరం ఏర్పాటు
» ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారులు పిలుపు

చీరాలటౌన్, ఏప్రిల్ 3 : నోటి నుంచి వచ్చే అతి భయంకరమైన రోగాల నుంచి ప్రజలు విముక్తి పొందాలని పలువురు వైద్యాధికారులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఏరియా వైద్యశాలలో హాస్పిటల్ దంత వైద్య నిపుణులు డా.సునయన, జిల్లా పొగాకు నియంత్రణ అధికారి రమేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నోటి ద్వారా సంక్రమించే కేన్సర్‌ను ముందుగానే గుర్తించే వెల్‌స్కోప్ పరికరం ఇక నుంచి బాపట్ల జిల్లా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నట్లు వివరించారు. దీనికి సంబంధించి స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. పలువురికి సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే నేరుగా జిల్లా హాస్పిటల్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ డా.శేషుకుమార్, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి, జిల్లా దంత వైద్యులు డా.శశి కుమార్, నర్సింగ్ ఫ్యాకల్టీలు, హాస్పిటల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



బాబు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న ఎరిక్షన్‌బాబు

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, ఏప్రిల్ 3: వచ్చే ఎన్నికల్లో తనను, ఎంపీ అభ్యర్థి మాగుంటను గెలిపించాలని, టీడీపీ ప్రభుత్వం రాగానే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతామని వై.పాలెం నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి తరుపు టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని ఎండూరివారిపాలెం, గుట్లఉమ్మడివరం గ్రామాల్లో మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి సూపర్ సిక్స్ పథకాలు, బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్ళలో వైసీపీ రాక్షస పాలనను సాగించిందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.వలరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, చలమయ్య ఏ.నాసరరెడ్డి, అల్లూరిరెడ్డి, జి.వెంకటనారాయణ, కొండలు, జనసేన నాయకులు మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేస్తా



రాచర్లలో టీడీపీలో చేరిన కుప్పా అనుచరులు

గిద్దలూరు టౌన్, : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి విజయానికి తామంతా కృషి చేస్తామని మాజీ జడ్పీటీసీ కుప్పా రంగ నాయకులు అన్నారు. ఆయన ఆహ్వానం మేరకు ముత్తుముల అశోక్‌రెడ్డి రాచర్ల మండలం ఆకవీడు గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లారు. కుప్పా రంగనాయకులు తన అనుచరులను వైసీపీని వీడి టీడీపీలో చేర్పించారు. వారందరికీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.



మినరల్ కూలింగ్‌వాటర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గునుపూడి వరలక్ష్మమ్మ

టీడీపీ నేత గునుపూడి దాతృత్వం

- మినరల్ వాటర్ కేంద్రం ఏర్పాటు

పొదిలి, ఏప్రిల్ 3 : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాధవిలు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలో అసలే తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే పొదిలి పట్టణానికి వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వస్తుంటారు. వచ్చిన వారు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు 24గంటలు మినరల్ కూలింగ్‌వాటర్ అందించే కేంద్రాన్ని పెద్దబస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. బుధవారం గునుపూడి సుబ్బారావు జ్ఞాపకార్థం తల్లి గునుపూడి వరలక్ష్మమ్మ చేతులమీదుగా మంచినీటి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండే ఎండల్లో పట్టణానికి వచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.



దేవాలయం వెనుక వైపు తొలగించిన రాళ్లను చూస్తున్న గ్రామస్థులు

అంబాపురంలో గుప్తనిధుల కలకలం

కొనకనమిట్ల, ఏప్రిల్ 3 : మండలంలోని వాగుమడుగు పంచాయతీలోని అంబాపురంలోని బాలత్రిపురసుందరీ దేవి ఆలయంలో గుప్త నిధుల తవ్వకాలు జరిగాయంటూ కలకలం రేగింది. గ్రామంలో మంగళవారం అర్థరాత్రి దేవాలయం వెనుక వైపుఉన్న గోడకు గుర్తు తెలియని వ్యక్తులు కొందరు కన్నం వేసే క్రమంలో గోడలో ఉన్న పెద్ద బండరాయిని తొలగించారు. వెంటనే సమాచారం అందుకున్న కొనకనమిట్ల పోలీసులు గ్రామంలోని దేవాలయాన్ని సందర్శించారు. పరిసరప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అయితే అక్కడ గునపాలతో బండరాయిని తొలగించినట్లు అనవాలు లేవని వారంటున్నారు. గ్రామస్థులతో పోలీసులు మాట్లాడి వివరాలు సేకరించారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 3 : రాష్ట్రంలో ప్రజలు వ్యవస్థలో మార్పు, విధానాల్లో మార్పు కోరుకుంటున్నారని టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఉమ్మడి విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ నాయకులు బాలీశ్వరయ్య మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని దుష్టశక్తులను ఓడించేందుకు కూటమిగా ముందుకు వస్తుందన్నారు. ఈసమావేశంలో పట్టణ అధ్యక్షులు షాన్వావలి,బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ పిడతల రమేష్‌రెడ్డి, జనసేన యువ నాయకుడు శ్రీకాంత్, మహిళ నాయకురాలు బొంతా లక్ష్మీదేవి బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అడుగంటుతున్న కంభం చెరువు

ప్రస్తుతం 5 అడుగుల మేర నీటిమట్టం

2 తూములగుండా లీకవుతున్న నీరు

నెలరోజులకే ఖాళీ

ఆందోళనలో రైతులు, ప్రజలు

కంభం, ఏప్రిల్ 3 : మూడు మండలాలకు తాగు, సాగు నీరు అందించే చారిత్రాత్మక కంభం చెరువులో ప్రస్తుతం 5 అడుగులమేర నీరు ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంభం, అర్థవీడు, బేస్తవారపేట మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటిబోర్లు ఒట్టిపోయాయి. ఈ నేపథ్యంలో అన్ని గ్రామాల్లో తీవ్ర నీటిసమస్య ఏర్పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. 2020లో కురిసిన భారీ వర్షాలకు 25 సంవత్సరాల తరువాత కంభం చెరువు నిండి అలుగుపారింది. దీనితో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మూడు సంవత్సరాల్లో వర్షాలు కురిసినా కంభం చెరువుకు చుక్క నీరు చేరలేదు. కంభం చెరువు రెండు తూముల వద్ద లీకుల రూపంలో నీరు వృథాగా పోతున్నది. ఈ రెండు తూములకు మరమ్మతులు చేసి లీకేజీని అరికట్టే అధికారి గాని, ప్రజాప్రతినిధులు గాని లేకపోవడంతో ప్రస్తుతం 5 అడుగులమేర నీరు ఉన్నది. రానున్న రెండు నెలల్లో తీవ్ర ఎండలకు చెరువు పూర్తిగా అడుగంటే ప్రమాదం ఉంది. లింగోజీపల్లి, ఎల్.కోట, సూరేపల్లి, కందులాపురం, జేబీ క్రిష్టాపురం తదితర గ్రామాలలో తాగునీటి బోర్లు ఒట్టిపోయి ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పంటలకు కూడా నీరు లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ ఎండాకాలం మూడు మండలాల్లో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంది. అధికారులు నీటి ఎద్దడిని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అడుగంటిన కంభం చెరువు (ఇన్‌సెట్లో) చిన్న కంభం తూము వద్ద వృథాగా పోతున్న నీరు

ప్రజాసేవకు డబ్బుకు మధ్య యుద్ధమిది

టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 3: ఈ ఎన్నికల్లో 22 ఏళ్ల ప్రజా సేవ డబ్బుకు మధ్య జరుగుతున్న యుద్ధమని టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక 9, 10 వార్డులలో ఇంటింటికీ మన కందుల ఎన్నికల ప్రచార కార్యక్రమం బుధవారం నారాయణరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 ఏళ్ల నుంచి తాను ప్రజా సేవలోనే గడిపానని, ఈ ఎన్నికల్లో ఒక్కచాన్స్ ఇవ్వాలని అన్నారు. ప్రజల జీవితాలు బాగుపడాలంటే మార్కాపురం ప్రత్యేక జిల్లాతోనే సాధ్యమన్నారు. టీడీపీ గెలిస్తేనే మార్కాపురం జిల్లా, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కందుల తనయుడు విగ్నేష్ రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కందుల

వైసీపీకి పతనం తప్పదు

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, ఆ పార్టీకి పతనం తప్పదని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి అన్నారు. పట్టణంలోని 4వ వార్డులో ఇంటింటి ప్రచారం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. ఎన్‌డీఏ అభ్యర్థులు కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డిలను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు మర్రి ఝాన్సీ, తెలుగు యువత నాయకులు కందుల రోహిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 వైసీపీ కుటుంబాలు చేరిక

స్థానిక 7, 8 వార్డులలో మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి బుధవారం రాత్రి ఇంటింటికి మన కందుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 7వ వార్డుకు చెందిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ ధర్మకర్త ఉప్పలపాటి శ్రావణి, ఉప్పలపాటి హనుమంతి, ఆరవీటి సూర్య, సుబ్బు, రాచకొండ సాయి, గోకవరపు సాయి, శివ కృష్ణ, రాచకొండ మణి, తుంబేటి గాలెయ్య, కొంటెపు సాయికృష్ణ, కనిగిరి పవన్, శివ, వెంకట్, చెరుకుపల్లి అజయ్, పోతనపల్లి వంశీ, రాచకొండ సునీల్, ఉప్పలపాటి నాగరాజు తదితర 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, కనిగిరి రమణ, షేక్ మౌలాలి, పఠాన్ గులాబ్, హుస్సేన్ ఖాన్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు

బొందలపాడులో 30 కుటుంబాలు టీడీపీలో చేరిక



బొందలపాడు ప్రజాగళంలో పోల్‌మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలవారు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 3: మండలంలోని బొందలపాడు గ్రామంలో ఇంటింటికీ మన కందుల ప్రజాగళంను మార్కాపురం నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన 30 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారితో మాట్లాడుతూ మార్కాపురం ప్రత్యేక జిల్లా తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని అన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు విసిగిపోయారని, అధిక ధరల పెరుగుదలతో ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. వైసీపీ నాయకులు ప్రజా వ్యతిరేక విధానలతో అక్రమ మద్యం, ఇసుక వ్యాపారాలు సాగుతున్నాయని అన్నారు. టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. యువతకు, మహిళలకు, రైతులకు అన్ని విధాల అండగా ఉంటావుని రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జవ్వాజి రామానుజలరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ మన కందుల కార్యక్రమం ప్రారంభం

పొదిలి : ఇంటింటికి మన కందుల కార్యక్రమాన్ని స్థానిక నగరపంచాయతీలోని నిమ్మవరం, రాములవీడు గ్రామాల్లో కందుల నారాయణ రెడ్డి, తనయుడు విగ్నేష్‌రెడ్డి నిర్వహించారు. జనసేన, బీజేపీలు బలపరిచిన ఉమ్మడి మార్కాపురం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని,తనను ఆదరించాలని ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. పొదిలి మండలానికి వెలుగొండ జలాలతో తాగు, సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు గమనించి రాబోవు ఎన్నికల్లో తమకు మద్దతు పలకాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తనయు డు విగ్నేష్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లిలో..

కొనకనమిట్ల : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఇంటింటికీ మన కందుల కార్యక్రమాన్ని మార్కాపురం ఉమ్మడి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు.ఈకార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు రోహిత్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

జిల్లాలో మొదటి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టరు దినేష్ కుమార్

పుల్లలచెరువు,ఏప్రిల్ 3: వచ్చే ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టరు , ఎన్నికల అధికారి ఏ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. బుధవారం ఎర్రగొండపాలెం మండలం పాలుట్ల చెంచు గూడెంలో ఎన్నికల ప్రకియలో భాగంగా వరుస సంఖ్యలో జిల్లా మొదటి పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం గూడెంలో పర్యటించి గిరిజనులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి ఓట్లు గురించి గిరిజనులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలుకు సుమారు 190 కిలోమీటర్ల దూరంలో పాలుట్ల దట్టమైన నల్లమల అటవీ ప్రాతంలో ఉందని అన్నారు. ఇక్కడ విద్యుత్ లేకపోయినా సోలార్, బోర్వెల్ ద్వారా ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉన్న మొదటి సంఖ్యను పాలుట్ల దక్కించుకుందని అన్నారు. పాలుట్లలో మొత్తం 3,000 వేల జనాభా ఉండగా 961 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. 2019 ఎన్నికల్లో ఇక్కడ 70 శాతం పోలింగ్ నమోదు అయ్యిందని, వచ్చే ఎన్నికల్లో 80 శాతం పైగా నమోదు అయ్యేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని అన్నారు. తద్వారా మారుమూల గ్రామమైనప్పటికి ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఉండేలా దృష్టి సారించిందని అన్నారు. అనంతరం తమ ఓటును నిర్భయంగా వినియోగించుకుంటామని గిరిజనులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టరు రవీంద్రరెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టరు రాహుల్‌మీనా ,జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, జిల్లా స్వీప్ నోడల్ అధికారులు జ్యోతి, రవి, వైపాలెం రిటర్నింగ్ అధికారి శ్రీ లేఖ, డీఎల్‌డీవో సాయికుమార్, వైపాలెం తహసీల్దారు సోమ్లు నాయక్, అధికారులు పాల్గొన్నారు.



పాలుట్లలో ఎన్నికల గురించి గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టరు, ఎన్నికల అధికారి ఏ.ఎస్. దినేష్ కుమార్



శింగరపల్లెలో మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..

- టీడీపీ గిద్దలూరు కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, ఏప్రిల్ 3: బేస్తవారపేట,ఏప్రిల్3: రాబోయే ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించి గెలిపించాలని,గిద్దలూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని గిద్దలూరు కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రజలను కోరారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా మూడో రోజు బేస్తవారపేట మండలంలోని కోనపల్లె గ్రామం నుంచి ప్రారంభించి సింగసానిపల్లె, పోగుళ్ళ, శింగరపల్లె, హనుమాయపల్లె, బాలేశ్వరపురం, బార్లకుంట, గలిజేరుగుళ్ళ చెన్నుపల్లె, పి.వి.పురం, జెన్నివారిపల్లె, చెరుకుపల్లె, ఘంటాపురం, బసినేపల్లె, అక్కపల్లె, ఎంపి.చెరువు, కొత్తపేట, ఖాజీపురం, పిటికాయగుళ్ళ, జేసీ అగ్రహారం గ్రామాల్లో పర్యటించి టీడీపీ చేసిన అభివృద్ధి గురించి వివరించారు. తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, మీకు ఏసమస్య వచ్చినా మీ ముందుంటానన్నారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని, అది జరగాలంటే టీడీపీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. రైతులు, పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత టీడీపీదేనని గుర్తుకు చేశారు. ఈకార్యక్రమంలో గిద్దలూరు జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు, టీడీపీ మండల అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు జి.రామలింగారెడ్డి,హూనూరు భూపాల్‌రెడ్డి, తీగిరెడ్డి భూపాల్‌రెడ్డి, బి.ప్రేమానందం, లంకా నరసింహం తదితరులు పాల్గొన్నారు.



గడ్డికి అంటుకున్న మంటలను ఆర్పుతున్న గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది

వైసీపీ అభ్యర్థి ప్రచారంలో అత్యుత్సాహం

- కాల్చిన బాణసంచా గడ్డివామిపై పడి మంటలు
- యాభైవేల నష్టానికి పది వేలు చేతులో పెట్టిన అభ్యర్థి

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 3: వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ ప్రచారంలో అపశ్రుతి చోటుచేసుకుంది.ఎన్నికల ప్రచారంలో పేద రైతుకు చెందిన వరిగడ్డిని కాల్చి యాభై వేల నష్టానికి పది వేలు చేతిలో పెట్టి వెళ్లాడు. ఆ రైతు లబోదిబోమంటున్నాడు. ఈ సంఘటన మండలంలోని చిన్నదోర్నాల గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. తాటిపర్తి పర్యటనలో భాగంగా పేల్చిన బాణసంచా గడ్డివామిపై పడి అగ్ని ప్రమాదానికి గురైంది.పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడడంతో గ్రామ ప్రజలు పరుగులు తీశారు. 43డిగ్రీల ఉష్ణోగ్రతలో ఎండలు మండిపోవడంతో ఒక్క సారిగా ఉలిక్కిపడ్డారు. అప్రమత్తమైన గ్రామవాసులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమివ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా గడ్డి అంతా పోగ చూరుకుపోయింది. గడ్డి యజమాని ఎలకపాటి అరున్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ మధ్యే యాభై వేలు పెట్టి నాలుగు ట్రిప్పులు ట్రాక్టరు గడ్డి కొన్నానని వాపోయాడు. దీంతో తాటిపర్తి ఇంట్లోకి అరున్‌ను తీసుకుపోయి పది వేలు చేతిలో పెట్టి తర్వాత చూద్దామంటూ చిన్నగుడిపాడు వెళ్లి పోయారు. అరున్‌కు ఏమి పాలుపోలేదు. యాభైవేల రూపాయలు గడ్డిని కాల్చి పది వేలు చేతిలో పెట్టి పోతే మా పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 3: అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు అన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ మద్యం తరలింపును నివారించాలని, నాటుసారా తయారీపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రేణుక, జడ్ఎం శివప్రసాద్, డీఎం రాధాకృష్ణ, పీ అండ్ ఈఐ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ బాబ్జీరావు

మహా సుదర్శన హోమం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 3: మార్కాపురంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో నాలుగు ప్రాకార గోపురాల కలశ స్థాపన, నూతన ధ్వజ పునఃప్రతిష్ఠ క్రతువులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహా సుదర్శన హోమం, కలశాలకు, ధ్వజానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు పాల్గొని పాలు, పెరుగు, తేనే, నెయ్యి, చక్కెర సమర్పించారు.



కలశ ధ్వజ పూజలు చేస్తున్న వేద పండితులు

ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలి

పుల్లలచెరువు, ఏప్రిల్ 3: సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాలని పుల్లలచెరువు ఎంపీడీవో విలియమ్స్‌కు టీడీపీ నేతలు వినతి ప్రతం అందజేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ద్వారా ఎండ తీవ్రత దృష్యా వేగంగా పంపిణీ పూర్తి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, మేడికొండ లక్ష్మీ నారాయణ, గోగిరెడ్డి శ్రీనివాస రెడ్డి, బడిపాటి ఓబులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పుల్లలచెరువు ఎంపీడీవో విలియమ్స్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

అయ్యప్ప ఆలయంలో ప్రతిష్ఠ పూజలు

గిద్దలూరు, ఏప్రిల్ 3 : పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దేవస్థానంలో ప్రతిష్ఠ మహోత్సవ పూజలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం హోమ కార్యక్రమాన్ని నిర్వహించగా దాతలైన దంపతులు హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. గురువారం దేవతామూర్తుల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పెన్షన్ కోసం వృద్ధుల పడిగాపులు

- మధ్యాహ్నం తర్వాత పంపిణీ

త్రిపురాంతకం, ఏప్రిల్ 3: ప్రతి నెలా ఇంటివద్దే తీసుకునే పెన్షన్‌ను తీసుకునే వృద్ధులను ప్రభుత్వం ఈనెల మాత్రం సచివాలయాల వద్ద పడిగాపులు కాసేలా చేసింది. పెన్షన్ల నగదు బ్యాంకు ఖాతాల్లో లేక పోవడం, సిబ్బంది చేతికి నగదు రాకపోవడంతో పెన్షన్ కోసం వృద్ధులు సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని అన్ని సచివాలయాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బుధవారం మధ్యాహ్నానికి బ్యాంకుల నుంచి నగదును తీసుకు రావడంతో 3 గంటల తర్వాత పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా సచివాలయాలకు దూరంగా ఉన్న హ్యాబిటేషన్‌లలో పాఠశాల భవనాలలో ఏర్పాట్లు చేసి వృద్ధులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఈవోపీఆర్డీ మురళీమోహన్ తెలిపారు.

పింఛన్‌దారుల అవస్థలు

మార్కాపురం వన్‌టౌన్ : పింఛన్‌దారుల కష్టాలు బుధవారం వర్ణనాతీతంగా మారాయి. సచివాలయ సిబ్బంది సమాచారం అందించకపోవటంతో పింఛన్‌దారులు ఉదయం నుంచి పడిగాపులు కాశారు. బ్యాంకుల నుంచి నగదు తీసుకురావాలని, మధ్యాహ్నం నుంచి పింఛన్లు ఇస్తామని తెలుపడంతో మండుటెండలో వెళ్లి వృద్ధులు పింఛన్‌లు తీసుకున్నారు. మంచాల్లో ఉన్న వారికి, దివ్యాంగులకు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్‌లు అందిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

కనీస వసతులు కరువు

తర్లుపాడు: ప్రభుత్వం గ్రామ సచివాలయ వద్ద వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. గ్రామ సచివాలయ వద్ద పింఛన్‌దారులకు కనీస వసతులు కల్పించకపోవటంతో మండుటెండలో వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సచివాలయ వద్ద టెంట్, మంచినీటి వసతి కల్పించాలని అధికారులు ఆదేశాలు ఇచ్చినప్పటికీ పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో పెన్షన్‌దారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం 4 గంటలకు సచివాలయ సిబ్బంది పింఛన్ పంపిణీ ప్రారంభించారు. కొంత మంది వృద్ధులు 3.30గంటల వరకు పడిగాపులు కాసి ఇళ్లకు వెళ్లిపోయారు.

కంభంలో..

కంభం : మండలంలోని 14 సచివాలయాల్లో బుధవారం నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీడీవో మస్తాన్‌వలి మాట్లాడుతూ బుధవారం ఉదయం 11గంటల నుంచి 6 సచివాలయాల పరిధిలో పంపిణీ ప్రారంభించామని, మిగిలిన 8 సచివాలయాల్లో సాయంత్రం 3గంటల నుంచి ప్రారంభించి రాత్రి 8గంటల వరకు పంపిణీ చేస్తామన్నారు. సచివాలయాల వద్దకు రాలేని వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది వారి గృహాల వద్దకు వెళ్ళి పింఛన్లు అందచేస్తారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీడీవో తెలిపారు.



తర్లుపాడు సచివాలయం వద్ద ఎడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

నేడు టీడీపీ కూటమి బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు

దర్శి, ఏప్రిల్ 3 : దర్శి పట్టణంలో టీడీపీ కూటమి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించే బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీపీ కూటమి అభ్యర్థిగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని నియమించిన విషయం తెలిసిందే. ఆమె గురువారం ఎన్నికల ప్రచారానికి భారీ ఊరేగింపుతో రానున్నారు. తొలుత నరసరావుపేట నుంచి కుటుంబ సభ్యులతో బయలుదేరి కొటప్పకొండకు వెళ్లి త్రికోటేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేస్తారు. అక్కడ నుంచి సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తారు. అనంతరం దర్శి నియోజకవర్గంలోని శంఖరాపురం నుంచి ర్యాలీగా సాయంత్రం 4గంటలకు దర్శికి చేరుకుంటారు. ఈ సందర్భంగా యువత భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. దర్శిలో జరిగే బహిరంగ సభలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితో పాటు ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, అద్దంకి, ఒంగోలు, కొండపి అసెంబ్లీ అభ్యర్థులు గొట్టిపాటి రవికుమార్, దామచర్ల జనార్దన్, డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్, దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బొటుకు రమేష్‌బాబు, జనసేన నాయకుడు గరికపాటి వెంకట్, బీజేపీ ఇన్‌చార్జి మాడపాకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొంటారని టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్

తాళ్లూరు, ఏప్రిల్ 3 : మండలంలోని శివరాంపురం కొండ్రు రాంబాబును కులంపేరుతో దూషించి గాయపరచగా నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పై దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్ బుధవారం విచారణ చేపట్టారు. చీమకుర్తి-తూర్పు గంగవరం రోడ్డులోని శివరాంపురం అడ్డరోడ్డు వద్ద జరిగిన ఘటనపై సంఘటనాస్థలాన్ని పరిశీలించి పలువురు సాక్షులను విచారించారు. వారి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. విచారణ చేపట్టిన డీఎస్పీని జిల్లా మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య కలిసి ఎస్సీ, ఎస్టీ కేసులోని నిందితున్ని తక్షణమే అరెస్టుచేసి న్యాయం చేయాలని కోరారు.

టీడీపీ అభ్యర్థి లక్ష్మి దంపతులను కలిసిన నేతలు



లక్ష్మి, సాగర్ దంపతులతో వెంకటరెడ్డి

తాళ్లూరు, ఏప్రిల్ 3 : జిల్లా టీడీపీ మాజీ కార్యవర్గ సభ్యుడు సీనియర్ నేత ఇడమకంటి వెంకటరెడ్డి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిలలిత సాగర్ దంపతులను నరసరావుపేటలో మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. దివంగత గొట్టిపాటి హనుమంతరావు, నరసయ్యలతో వెంకటరెడ్డి కుటుంబానికి సత్సంబంధాలు ఉన్నాయి. గొట్టిపాటి కుటుంబం నుంచి నరసయ్య కుమార్తె లక్ష్మి తిరిగి రాజకీయరంగ ప్రవేశం చేయటంతో వెంకటరెడ్డి వారిని కలిశారు. మండలంలో టీడీపీ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ యువనేత ఇడమకంటి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

టీడీపీ అభ్యర్థి లక్ష్మిని కలసిన ఈదర మాజీ సర్పంచ్

ముండ్లమూరు, ఏప్రిల్ 3 : దర్శి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని మండలంలోని ఈదర మాజీ సర్పంచ్ గద్దల పెదసుబ్బయ్య తన అనుచరులు బుధవారం నరసరావుపేట వెళ్లి ఆమెను కలసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను మీ బిడ్డగా ఆశీర్వదించి గెలిపించినట్లయితే ప్రతి గ్రామాన్ని ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దుతానని లక్ష్మి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిచ్చయ్య ఉన్నారు.

నేడు దర్శిలో టీడీపీ బహిరంగసభకు తరలిరావాలి

తాళ్లూరు, ఏప్రిల్ 3 : దర్శిలో ఈ నెల 4వ తేదీ సాయంత్రం జరగనున్న తెలుగుదేశం పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, గొట్టిపాటి లక్ష్మిల బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరిక

పామూరు నుంచి బోయిళ్ల అనుచరులు

వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఇన్‌చార్జి ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, ఏప్రిల్ 3 : సీఎస్‌పురం సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బోయిళ్ల నారాయణరెడ్డి అనుచరులు పామూరుకు చెందిన పలువురు కాపు సంఘం నాయకులు, మాజీ వార్డు మెంబర్ వరికూటి చిరంజీవి, హనుమంతరావు ఆధ్వర్యంలో 56 కాపు కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉగ్ర వారందరికీ పార్టీ కండువాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే తన ముందు ఉన్న ఏకైక లక్ష్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో మద్దిశెట్టి వెంకటస్వామి, రామిశెట్టి రమణయ్య, చిత్తూరి మురళి, ఇండ్ల నరసింహారావు, నల్లబోతుల చెన్నయ్య, కందికట్టి హజరత్తు, చిత్తూరి నారాయణ, గుత్తి సురేష్, కొండయ్య, బార్గం వెంకటేశ్వర్లు, పూల మాధవ, పిక్కిలి మనోహర్, రత్నం, రాంబాబులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు భైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, డీవీ మనోహర్, కావిటి సుబ్బయ్య, షేక్ ఖాజారహంతుల్లా, బద్దిపూడి మార్కు, ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, ఎస్ సాంబయ్య, ముబీనామౌలాలి, తోట రవికుమార్, బీ సత్యం, కొండా నరసింహులు, మెంటా నరసింహారావు పాల్గొన్నారు. ఆ మండలంలోని నుచ్చుపొద పంచాయతీ తిరగళదిన్నె గ్రామానికి చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన ఒంటేరు నాగారాజు, నాగేంద్ర, నవీన్‌లు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాలతో ఉగ్ర స్వాగతం పలికారు. నేతలు పువ్వాడి వెంకటేశ్వర్లు, బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, ఆరేకొండా హరిప్రసాద్, కొలూరి ఖాజారహంతుల్లా, కొలూరి హనీఫ్, ఆవుల రమణమ్మ, గోసుల సురేంద్ర, కామేపల్లి సూర్య పాల్గొన్నారు.



ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన కాపు కుటుంబాలు

తండ్రి గెలుపు కోసం తనయుడు ప్రచారం



సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న జయసింహా రెడ్డి

వెలిగండ్ల, ఏప్రిల్ 3 : కనిగిరి నియోజకవర్గాన్ని గతంలో ఎంతో అభివృద్ధి చేసిన టీడీపీ ఇన్‌చార్జి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉగ్ర కుమారుడు జయసింహారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని మొగళ్లూరు పంచాయతీలో టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి, చిలకల క్రిష్ణారెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, కొండు భాస్కర్ రెడ్డి, పల్నాటి కోటిరెడ్డి, మాజీ కోఆప్షన్ షేక్ షరీఫ్, అవు మాలకొండారెడ్డి, సుబ్రమణ్యం, తెలుగుయువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్ రెడ్డి, సాన జయపాల్ రెడ్డి, నరేంద్ర ముదిరాజ్, చంద్ర కార్యకర్తలు పాల్గొన్నారు.

17 ఎస్సీ కుటుంబాలు టీడీపీలో చేరిక

వెలిగండ్ల, ఏప్రిల్ 3 : మండలంలోని పద్మాపురం ఎస్సీ కాలనీకి చెందిన 17 కుటుంబాల వారు కనిగిరిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీలో చెరిన వారిలో అట్లూరి రామయ్య, గూడూరి చిన్నయ్య, ఇత్తడి పెదమాలకొండయ్య, గూడూరి ఎలియా, అంబటి మరియదాసు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ముత్తిరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, గవదకట్ల పెద మాలకొండయ్య, చిలకల వెంకటేశ్వర్లు, కర్నాటి భాస్కర్‌రెడ్డి, సాన జయపాల్‌రెడ్డి, అక్కి శ్రీను, అక్కి రాజేంద్ర, మహేష్, చంద్ర, వరయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకే పట్టం కట్టనున్న కనిగిరి ప్రజలు

కనిగిరి, హెచ్ఎంపాడు మండలాల్లో విస్తృత ప్రచారం

కనిగిరి, ఏప్రిల్ 3 : వచ్చే ఎన్నికల్లో కనిగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని వివిధ వర్గాల ప్రజలు టీడీపీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్ఎంపాడు మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్) చెప్పారు. మండలంలోని కొండారెడ్డిపల్లిలో చంద్రబాబు రూపొందించిన సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలతోపాటు డాక్టర్ ఉగ్ర కనిగిరి ప్రాంతాభివృద్ధికి చేపట్టబోయే ప్రణాళికలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రతి నెలా అందచేసే సామాజిక పింఛన్ల పంపిణీ చేయకుండా ఖజానాలోని సొమ్మంతా కాంట్రాక్టర్‌లకు ముట్టచెప్పి ఆ సొమ్ముతో ఎన్నికల ప్రచారానికి సిద్ధమైన జగన్ కుట్రను చంద్రబాబు తిప్పికొట్టారన్నారు. ఐదేళ్లపాటు ప్రజల్ని నానా ఇబ్బందులు పెట్టి నరకపాలనను చూపించిన జగన్‌కు ఎన్నికల వేళ ప్రజలపై లేని పోని ప్రేమ పుట్టుకొస్తోందని చెప్పారు. కనిగిరిలో మంచినీటి సమస్యతో పాటు ఉపాధి, ఉద్యోగాలు రావాలంటే ఉగ్రనరసింహారెడ్డినే ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాయం రామిరెడ్డి, మురహరి నరసయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, చావలి చినవెంకటేశ్వర్లుయాదవ్, తాతపూడి స్టాలిన్(బుజ్జి), ఉడుముల సుబ్బారెడ్డి, గుమ్మా చినకొండయ్య, కొండపురెడ్డి రమణారెడ్డి, జనసేన నాయకులు ఆకుపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన ఎస్సీ కుటుంబాలు

పింఛన్ కోసం పడిగాపులు

బ్యాంకులకు ఆలస్యంగా పెన్షన్ నగదు జమ

రెండు గంటల నుంచి సచివాలయాల వద్ద పెన్షన్ల పంపిణీ

తాళ్లూరు, ఏప్రిల్ 3 : బ్యాంకులకు పెన్షన్ నగదు జమచేయటంలో ప్రభుత్వం జాప్యం చేయటంతో పెన్షన్‌దారులు గ్రామ సచివాలయాల వద్ద ఉదయం నుంచి పడిగాపులు కాశారు. టీడీపీ నేత చంద్రబాబు వలంటీర్లను పెన్షన్ పంపిణీ నుంచి తీసి వేయించారని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేసినా ప్రభుత్వం నుంచి నగదు బ్యాంక్‌లకు జమకాలేదని అధికారులు చెప్పటంతో పెన్షన్‌దారులు విస్తుపోయారు. గ్రామ కార్యదర్శులు బ్యాంకుల చుట్టూ తిరిగి మధ్యాహ్నం 2గంటల సమయంతో అరకొరగా నిధులు తీసుకొచ్చి సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయించారు. సచివాలయ సిబ్బందిని ఇంటింటికీ పంపి పెన్షన్లు పంపిణీ చేస్తే వృద్ధుల వేసవి కష్టాలు తొలుగుతాయని పెన్షన్‌దారులు చెబుతున్నారు. కరోనా టైంలో ప్రభుత్వ ఉద్యోగులను అనేక పనులకు వినియోగించుని నేడు పెన్షన్లు పంపిణీకి సచివాలయ ఉద్యోగులను ఎందుకు వినియోగించలేక పోతున్నారని పలువురు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెన్షన్ పంపిణీ చేసేందుకు డబ్బులు లేక పంపిణీ జాప్యం చేసి ఎండకు పెన్షన్‌దారులను ఇబ్బందులు పెడుతూ ఆ నెపాన్ని చంద్రబాబుపై వేయటం విడ్డూరంగా ఉందని మండల టీడీపీ అధ్యక్షులు బి.ఓబుల్‌రెడ్డి చెప్పారు.

కురిచేడులో...

కురిచేడు, ఏప్రిల్ 3 : మండలంలో 15 పంచాయతీలుండగా ఎక్కడా సాయంత్రం 3 గంటల వరకు పింఛన్‌లు పంపిణీ ప్రారంభం కాలేదు. సాయంత్రం 4 గంటల సమయంలో కురిచేడు 1, 2 సచివాలయాలు, పడమర నాయుడుపాలెం, పడమర వీరాయపాలెం పంచాయతీలలో పింఛన్‌లు పంపిణీ ప్రారంభించారు. మండలం మొత్తం మీద రూ.1.48 కోట్లు అవసరం కాగా కేవలం రూ.40 లక్షలు మాత్రమే బ్యాంకుల నుంచి అందాయి. యూనియన్ బ్యాంకు నుంచి డబ్బులు అందగా, కెనరా బ్యాంకు ద్వారా సాయంత్రం 6 గంటల సమయానికి కూడా అందలేదు. దీంతో పింఛన్ పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు అనేక ఇబ్బందులు పడ్డారు. రాత్రికి బ్యాంకుల నుంచి పింఛన్ డబ్బులు తీసుకుని కొంత మేర పంపిణీ చేసి గురువారం నుంచి పూర్తి స్థాయిలో పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలియజేశారు.

57శాతం పింఛన్లు పంపిణీ

పీసీపల్లి, ఏప్రిల్ 3 : మండలంలో సచివాలయ ఉద్యోగులు బుధవారం చేపట్టిన పింఛన్ల పంపిణీ సాయంత్రానికి 57.07శాతం పూర్తయ్యింది. పింఛను నగదు కోసం బ్యాంకులకు వెళ్లిన ఉద్యోగులు మధ్యాహ్నానికి నగదు డ్రా చేసుకుని సచివాలయాలకు వచ్చారు. ఆ తరువాత సచివాలయ సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలకెళ్లి లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. సాయంత్రం 5.30గంటలకు 57.07శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేశారు. మండలంలో 4866మంది పింఛను లబ్ధిదారులు ఉండగా నాలుగు గంటల్లోనే 2777మందికి పింఛను నగదు ఇచ్చారు.



పింఛన్ కోసం వచ్చి చెట్ల కింద సేదతీరుతున్న వృద్ధులు

అత్యధికంగా ముద్దపాడు పంచాయతీలో 85శాతం, చింతగుంపల్లి పంచాయతీలో 84.4శాతం, పెదఅలవలపాడు పంచాయతీలో 76.06శాతం పంపిణీ జరిగింది. వాలంటీర్లకంటే సచివాలయ ఉద్యోగులే వేగంగా పింఛన్లు పంపిణీ చేశారని కొంతమంది లబ్దిదారులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో వెంకటసుబ్బారావు పర్యవేక్షించారు.

పెన్షన్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభం

దర్శి, ఏప్రిల్ 3 : వృద్ధులకు, వితంతువులకు, బుధవారం పెన్షన్ల పంపిణీ ఆలస్యంగా ఆరంభమైంది. అధికారులకు ఉదయం పూట నగదు అందక పోవటంతో జాప్యం జరిగింది. బ్యాంకులో నగదు తెచ్చి సచివాలయ సిబ్బంది మధ్యాహ్నం 3 గంటల నుంచి పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు. దర్శి మండలంలో 9750 మందికి పెన్షన్లు అందించాల్సి ఉంది. ఎండ తీవ్రత తగ్గగానే వృద్ధులు, వితంతువులు ఆయా సవాలయాలకు వెళ్లి పెన్షన్లు తీసుకున్నారు.

సాయంత్రం నుంచి ప్రారంభమైన పెన్షన్ల పంపిణీ

దొనకొండ, ఏప్రిల్ 3 : ప్రభుత్వం వితంతువులకు, వృద్ధులకు అందించే పెన్షన్లు పంపిణీ బుధవారం సాయంత్రం నుంచి మండలంలో ప్రారంభించారు. బ్యాంక్ అధికారులు బుధవారం సాయంత్రంకు నగదు అందించటంతో సచివాలయాల సిబ్బంది హుటాహుటిన గ్రామాలకు వెళ్లి అందుబాటులో ఉన్న లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెన్షన్ల కోసం పలు గ్రామాల్లో వృద్ధులు, వితంతువులు ఉదయం సచివాలయాల వద్దకు వెళ్లి పడిగాపులు కాశారు. సాయంత్రం 4గంటల తర్వాత పెన్షన్లు పంపిణీ జరుగుతుందని సిబ్బంది తెలపటంతో నిరుత్సాహంతో వెనుదిరిగారు. మండలంలో మొత్తం 5773 మంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉంది. రాత్రి 10 గంటల వరకైనా సచివాలయాల సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండి పెన్షన్ల పంపిణీ జరిపేలా చర్యలు చేపట్టామని ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు.

నిరీక్షించి సాయంత్రానికి పింఛన్ ఇచ్చి...

కనిగిరి, ఏప్రిల్ 3 : జగన్ పన్నిన దుర్మార్గపు పన్నాగానికి వృద్ధులు తమ ఫించన్ కోసం నానాఇబ్బందులు పడ్డారు. బుధవారం ఉదయం నుంచి పింఛన్ ఇస్తారని తెలియటంతో మహిళలు, వృద్ధులు కనిగిరి పట్టణంలోని సచివాలయాల వద్దకు వచ్చి తిరిగి వెళ్ళారు. సాయంత్రం నాలగున్నర గంటల నుంచి తిరిగి పింఛన్ పంపిణీ మొదలుపెట్టారు. బుధవారం మధ్యాహ్నం నుంచే పంపిణీ చేయాల్సి ఉండగా బ్యాంకుల నుంచి నగదు ఆలస్యంగా రావటంతో సాయంత్రం నుంచి రాత్రి 7గంటల వరకు పింఛన్‌లను పంపిణీచేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ముండ్లమూరు, ఏప్రిల్ 3 : మండలంలోని వేంపాడు - ముండ్లమూరు మధ్య చిలకలేరు వాగు వద్ద ఈనెల 1వ తేదీ గుర్తు తెలియని వాహనం ఢీకొని 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఒంగోలులోని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందారు. మృతి చెందిన వ్యక్తి ఎవరనేది ఎటువంటి ఆనవాళ్ళు లభించ లేదని ఎస్ఐ వీ ఆంజనేయులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహం రిమ్స్ ఆస్పత్రిలో ఉందని తెలిపారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 3 : దర్శి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి గురువారం తొలి సారిగా దర్శికి వస్తుండటంతో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావాలని మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు కోరారు.

దొనకొండ మండల వైసీపీకి భారీ షాక్



రాఘవరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేతలు

దొనకొండ, ఏప్రిల్ 3 : దొనకొండ మండల వైసీపీ కన్వీనర్ కందుల నారపురెడ్డి, వైస్ ఎంపీపీ వడ్లమూడి వెంకటేశ్వర్లు ఒంగోలు టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కార్యాలయంలో ఆయన తనయుడు రాఘవరెడ్డి సమక్షంలో బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. యువనాయకుడు మాగుంట రాఘవరెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిని గెలిపించాని, చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగితే యువతకు ఉపాధి, పేదవాడికి సంక్షేమం సాధ్యమని రాఘవరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మీ మామ కడియాల రమేష్ పాల్గొన్నారు.

జగన్ దుష్ట పాలనకు చరమగీతం పాడాలి





పత్రాలు అందజేస్తున్న టీడీపీ కూటమి శ్రేణులు

పామూరు, ఏప్రిల్ 3 : వైసీపీ దుష్ట పాలనలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని వైసీపీని గద్దె దింపి అభివృద్ధికి పాటుపడే టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, బీజేపీ నియోజకవర్గ నాయకులు కేవీ రమణయ్య కోరారు. ఉగ్ర ఆదేశాల మేరకు పట్టణంలోని సీఎస్ పురం రోడ్డు దర్గా, విరువూరు రోడ్డు, పాత స్టేట్ బ్యాంకు వరకు బాబు ష్యూరిటీ-భవిషత్తు గ్యారెంటీ, సూపర్‌సిక్స్ మహిళాశక్తి పథకాలపై బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పామూరు, ఏప్రిల్ 3 : మండలంలోని మోపాడు బంగ్లా ఎస్సీ కాలనీలోని కోదండరామస్వామి దేవస్థాన ఆవరణలో గ్రామానికి చెందిన షైదుకూరు మహేష్, రామచంద్రయ్య, కేశవులు ఆర్థిక సహకారంతో దేవస్థానంలో ధ్వజస్తంభ ఆరోహణ, శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం, ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తనయుడు జయసింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.









వినుకొండ : తాళాలు వేసి ఉన్న నరగాయపాలెం సచివాలయం

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(గురువారం)
సహారీ (ఉదయం) 4.43 (శుక్రవారం)



డబ్బులు లేవు పింఛన్ లేదు

డబ్బులు లేవు.. పింఛన్ ఇవ్వలేము. నగదు రాకుంటే మేమేమి చేస్తాం.. ఇదీ తొలి రోజు సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ తీరు. సచివాలయాల ఖాతాలకు నగదు జమ చేయలేదు. అయినా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. వృద్ధులు ఎంతో ఆశతో అష్ట కష్టాలు పడి సచివాలయాలకు వస్తే సిబ్బంది సమాధానంతో నిరాశకు గురయ్యారు. ఉదయం.. మధ్యాహ్నం.. సాయంత్రం అంటూ వృద్ధులను చాలా చోట్ల సచివాలయాల సిబ్బంది తిప్పుకున్నారు. కొన్ని దగ్గర్ల అయితే వృద్ధులు, దివ్యాంగులు సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. వయో వృద్ధులు, దివ్యాంగులు ఉదయం 7 గంటల నుంచే సచివాలయాల వద్దకు చేరుకున్నా కొన్ని దగ్గర్ల రాత్రి వరకు వారికి పింఛన్ ఇవ్వలేదు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మూడొంతుల సచివాలయాల్లో ఇదే పరిస్థితి. తొలిరోజు మధ్యాహ్నం ఒంటిగంట వరకూ నూటికి ముగ్గురికి కూడా పింఛను అందలేదంటే పరిస్థితి ఎంతదారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. అయితే ప్రభుత్వం కావాలని వృద్ధులకు పడిగాపుల శిక్ష విధించిందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

- సచివాలయాల ఖాతాలకు జమకాని నగదు
- డబ్బులు రాకుంటే మేమేమి చేస్తామన్న సిబ్బంది
- పలు సచివాలయాల్లో ప్రారంభమేకాని పంపిణీ
- మూడు జిల్లాల్లో 25 శాతం మందికే పింఛన్లు..
- వృద్ధులకు పడిగాపుల శిక్షపై ప్రతిపక్షాల ఆగ్రహం

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ.. పింఛన్ల పంపిణీని అధికార పార్టీ రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకుంటుందా అంటే.. బుధవారం నాటి పరిస్థితులు అవునంటున్నాయి. మండే ఎండల్లో వృద్ధులు, దివ్యాంగులు, రోగులు సచివాలయాలకు రాలేరని తెలిసి కూడా వారితో ప్రభుత్వం ఆడుకుంది. అష్టకష్టాలు పడి సచివాలయాలకు వచ్చినా పింఛన్ ఇవ్వకుండా పడిగాపుల శిక్ష వేసింది. ప్రతి నెలా ఒకటో తేదీన ఇస్తున్న పింఛన్‌ను ఏప్రిల్‌లో రకరకాల కారణాలు చెప్పి మూడో తేదీకి వాయిదా వేసిన ప్రభుత్వం, ఆ రోజు కూడా వృద్ధులకు చుక్కలు చూపించింది. సచివాలయాల ఖాతాలకు నగదు జమ చేయకుండా పింఛన్ల పంపిణీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మెజారిటీ సచివాలయాల్లో మధ్యాహ్నం వరకూ పింఛన్ల పంపిణీ ప్రారంభమే కాలేదు. ఒక్కో మండల పరిధిలో సగటున 15 సచివాలయాలు ఉంటే 3, 4 సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో మాత్రమే నిధులు పడ్డాయి. వాస్తవానికి ఆ నిధులు ముందురోజే సంబంధిత బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సి ఉన్నా ప్రభుత్వం వాటిని మంజూరు చేయలేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు పింఛను పంపిణీపై చేతులెత్తేశారు. సచివాలయాలకు వచ్చిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సమాధానం చెప్పలేక సిబ్బంది బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి మరికొన్ని బ్యాంకుల్లో నిధులు జమవడంతో కొన్ని దగ్గర్ల పింఛన్ల పంపిణీ జరిగింది. మున్సిపాలిటీల్లో కొన్ని సచివాలయాలు, పలు మండల కేంద్రాల్లో కొన్నిదగ్గర్ల మాత్రమే అరకొరగా పింఛన్ల పంపిణీ జరిగింది. వలంటీర్ల సేవలున్నప్పుడు ప్రభుత్వం ఒకే రోజున నగదు మొత్తాన్ని విడుదల చేసేది. అలాంటిది ఇప్పుడు అరకొరగా విడుదల చేయడంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ప్రతిపక్షాలపై పింఛన్‌దారుల్లో వ్యతిరేకత ఏర్పరచడమే దీని ఉద్దేశమన్న ఆరోపణలు వస్తున్నాయి. కాగా కొన్ని సచివాలయాల వద్ద వైసీపీ నాయకులు మకాం వేసి టీడీపీ వల్లే ఈ ఇబ్బందులన్న రీతిలో ప్రచారం చేయించే ప్రయత్నం చేశారు. దీనిని పసిగట్టిన సచివాలయాల సెక్రెటరీలు సెక్రెటేరియట్ల కాంపౌండ్లలో పింఛన్‌దారులు మినహా మరెవరూ ఉండటానికి వీల్లేదని, లేకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించడంతో వారు జారుకున్నారు.



తెనాలిలో మధ్యాహ్నం 3 గంటల తర్వాత పింఛన్ల పంపిణీ చేస్తామని యంత్రాంగం చెప్పడంతో వేచి ఉన్న వృద్ధులు

వృద్ధులకు శిక్ష.. ప్రభుత్వ కుట్ర

పింఛన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఆదేశాలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతనలేకుండా ఉంది. వయో వృద్ధులు, దివ్యాంగులు, రోగులకు ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని, సచివాలయాల సిబ్బంది నేరుగా వచ్చి అందిస్తారని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఏ సచివాలయ పరిధిలోనూ ఇది అమలు కాలేదు. అదేమంటే తమకు ఆదేశాలు అందలేదని సచివాలయాల సిబ్బంది చెప్పారు. నగదు కావాలంటే సచివాలయాలకు రావాల్సిందే అని సిబ్బంది సూచించారు. దీంతో అష్టకష్టాలు పడి పలువురు పింఛన్ కోసం సచివాలయాలకు వచ్చారు. ఎండలో సాయంత్రం వరకు పడిగాపాలు కాయాల్సి వచ్చింది. నగదు జమ కాకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఖాతాల్లో నగదు జమకాలేదని, తామేమీ చెయ్యలేమంటూ సిబ్బంది తేల్చి చెప్పారు. దీంతో ఉదయం వచ్చి మధ్యాహ్నం వరకు వేచి ఉన్న వారు విసిగిపోయి.. ఎండలో ఉండలేక ఇళ్లకు వెళ్లిపోయారు. రేపల్లెలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొన్ని సచివాలయాల్లో నగదు జమ కావటంతో పింఛన్ల పంపిణీని 4 గంటల సమయంలో ప్రారంభించారు. వేమూరు పరిధిలో చదలవాడ, వరహాపురం, కుచ్చెళ్ళపాడు, వెల్లబాడు, చావలి, పెరవలి, పెరవలిపాలెం, జంపని గ్రామాలకు నగదు అందడంతో మధ్యాహ్నం 3 గంటల తర్వాత పంపిణీ ప్రారంభించారు. కొల్లూరు మండలం అనంతవరం సచివాలయ పరిధిలో 432 పింఛన్లకు సంబంధించి రూ.12 లక్షల వరకు నగదు జమ కావాల్సి ఉండగా కేవలం రూ.25 వేలు మాత్రమే జమ చేశారు. దీంతో 75 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది అందజేశారు. దీనికి తోడు మధ్యమధ్యలో సాంకేతిక కారణాలతో పింఛన్ల పంపిణీకి అంతరాయం ఏర్పడింది. వినుకొండ పరిధిలోని నరగాయపాలెం సచివాలయానికి సిబ్బంది ఏకంగా తాళాలు వేసి వెళ్ళిపోయారు. దీంతో పింఛన్ కోసం వచ్చిన వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో 700 పింఛన్లు ఉండగా సచివాలయంలో కేవలం ఇద్దరు సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉండటంతో లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. గుంటూరులో తొలిరోజు నగదు విడుదల కాకపోవడంతో 12 సచివాలయాల పరిధిలో పంపిణీనే ప్రారంభం కాలేదు. ప్రభుత్వం కుట్రతోనే తమకు పడిగాపుల శిక్ష విధించిందని పలువురు మండిపడ్డారు.

మధ్యాహ్నం వరకు 2.5 శాతమే..

బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకి మూడు జిల్లాల్లో పింఛన్ల పంపిణీ సగటున 2.5 శాతంగా ఉంది. గుంటూరు జిల్లాలో 2 లక్షల 61వేల మంది పింఛనుదారులు ఉండగా వారిలో 5,630 మందికి మాత్రమే మధ్యాహ్నానికి పింఛన్లు అందాయి. పల్నాడు జిల్లాలో 2లక్షల 82వేల మందిలో 5,369 మందికి, బాపట్ల జిల్లాలో 2 లక్షల 35వేల మందిలో 9,300 మందికి పింఛన్లు అందాయి. మధ్యాహ్నం నుంచి బ్యాంకుల్లో నిధులు జమ కావడం మొదలవడంతో పింఛన్ల పంపిణీ మొదలైంది. సాయంత్రానికి బాపట్ల జిల్లాలో 41.99 శాతం, గుంటూరు జిల్లాలో 41.61 శాతం, పల్నాడు జిల్లాలో 44.75 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. అరకొరగా నగదు విడుదలతో ఈ స్థాయిలో పింఛన్ల పంపిణీ జరిగింది.

ప్రతిపక్షాలపై నెపం వేసేందుకేనా?

ఒకవైపు మండే ఎండలు.. మరోవైపు సచివాలయాలకు వస్తేనే పింఛన్ ఇస్తాం అని చెప్పి.. అష్టకష్టాలు పడి వచ్చిన వారికి నగదు అందజేయని ప్రభుత్వ తీరును చూసిన పలువురు అధికార పార్టీ కావాలని ఇదంతా చేస్తోందని ఆరోపిస్తున్నారు. పింఛన్ల పంపిణీలో లోటుపాట్లు సరిచేసుకోకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కావాలని ప్రతిపక్షాలపై నెపం వేసేందుకు బుధవారం నాటి పరిణామాలను ప్రభుత్వం సృష్టించిందన్న విమర్శలు వచ్చాయి. మధ్యాహ్నం వరకు కూడా పింఛన్ పంపిణీ జరగకపోవడం, లబ్ధిదారుల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేని సచివాలయ సిబ్బంది అసలు విషయం చెప్పేశారు. బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కాలేదు.. అందువల్ల పింఛన్లు ఇవ్వలేకపోతున్నామని చేతులెత్తేశారు. దీంతో లబ్ధిదారులకు అసలు విషయం బోధపడింది. దీంతో ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలు పటాపంచలైపోయాయి. ప్రభుత్వమే నిధులు మంజూరు చేయకుండా ఓట్ల నాటకానికి తెర తీసిందని పలువురు తెలుసుకున్నారు. నేరుగా తమ ఖాతాల్లో వేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం, అధికార వైసీపీనే తమను మండుటెండల్లో సచివాలయాల వద్ద పడిగాపులు పడేలా చేసిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చీరాల బరి చైతన్య ఝరి

నియోజకవర్గ ముఖచిత్రం

చీరాల పోరాటాల పురిటి గడ్డ. ఇక్కడి ప్రజలు చైతన్య వంతులు. ఉద్యమ నేపథ్యం వారి సొంతం. బ్రిటీష్ పాలకులు చీరాల, పేరాల గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా చేస్తే వ్యతిరేకించారు. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణ మహాత్మాగాంధీ సూచించిన మార్గాల్లో ఒకటైన పుర బహిష్కరణతో బ్రిటీష్ పాలకుల మెడలు వంచారు. నియోజక వర్గ పరిధిలోని వేటపాలేనికి చెందిన అలివేలు మంగతాయారు స్వాంతంత్రోద్యంలో పాల్గొన్న తొలి మహిళగా ప్రతీతి. లోక్‌సభ నియోజక వర్గాల ప్రాతిపదికగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని బాపట్ల ప్రత్యేక జిల్లాగా ఏర్పడింది. ఈ జిల్లా పరిధిలోకి చీరాల అసెంబ్లీ నియోజక వర్గం వచ్చింది. ఈ క్రమంలో చీరాల నియోజక వర్గం గురించి ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం..



కోటయ్య వెంకటేశ్వర్లు చంద్రమౌళి సాంబు రామారావు

- పోరాటాల పురుటిగడ్డ.. రాజకీయ చైతన్య దీపిక
- భిన్నత్వంలో ఏకత్వం ఇక్కడి ప్రత్యేకత
- ఓటరు తీర్పు విలక్షణం
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిని అందించిన నియోజకవర్గం
- తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన డాక్టర్ కొణిజేటి రోశయ్య
- వస్త్రవ్యాపారానికి చినబొంబాయిగా ప్రసిద్ధి

చీరాల, ఏప్రిల్ 3: చీరాల నియోజకవర్గం ప్రజలు భిన్న మతాలు, కులాల సమాహారం. భిన్నత్వంలో ఏకత్వం స్పష్టంగా కనిపిస్తుంది. పరస్పరం గౌరవించుకుంటారు. పరమత సహనం పాటిస్తారు. చీరాల నియోజకవర్గంలో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడ స్థిరపడ్డవారి సంఖ్య అధికంగానే ఉంటుంది. సుమారు 18 కిలోమీటర్లు పొడవున సముద్ర తీరప్రాంతం ఉంది. మత్స్యకార గ్రామాల్లో వారి కట్టుబాట్లు వేరుగా ఉంటాయి.

ఓటరు తీర్పు విలక్షణం..

చీరాల నియోజకవర్గ ఓటరు తీర్పు విలక్షణంగా ఉంటుంది. చైతన్యవంతంగా ఆలోచిస్తారు. తమకు మేలు చేస్తారని ఓటు ద్వారా ఆశీర్వదిస్తారు. లేదంటే తిరస్కరిస్తారు. 1952లో నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు అందుకు నిదర్శనంగా రాజకీయ పండితులు విశ్లేషిస్తుంటారు.

ఇప్పటి వరకు 16 పర్యాయాలు ఎన్నికలు

చీరాల నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 16 పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1980లో ఒక పర్యాయం ఉపఎన్నిక జరిగింది.

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1952	ప్రగడ కోటయ్య	కేఎంపీపీ	యూయూ గుప్తా	ఇండి	8,231
1955	ప్రగడ కోటయ్య	కాంగ్రెస్	జేఎల్ నారాయణ	సీపీఐ	6,073
1962	జేఎల్ నారాయణ	సీపీఐ	ప్రగడ కోటయ్య	కాంగ్రెస్	5,054
1967	ప్రగడ కోటయ్య	కాంగ్రెస్	కొణిజేటి రోశయ్య	ఇండి	2,566
1972	జి.కోటయ్య	కాంగ్రెస్	సజ్జా చంద్రమౌళి	ఇండి	608
1978	ఎం.వెంకటేశ్వర్లు	కాంగ్రెస్(ఐ)	సజ్జా చంద్రమౌళి	జనతాపార్టీ	1857
1980	సజ్జా చంద్రమౌళి	జనతా పార్టీ	బీఎస్పీ బండ్ల	కాంగ్రెస్(ఐ)	19,573
1983	చిమటా సాంబు	టీడీపీ	బీబీ వెంకటేశ్వర్లు	కాంగ్రెస్(ఐ)	33,687
1985	సజ్జా చంద్రమౌళి	టీడీపీ	అందె నరసింహారావు	కాంగ్రెస్(ఐ)	8,766
1989	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్(ఐ)	చిమటా సాంబు	టీడీపీ	23,333
1994	పాలేటి రామారావు	టీడీపీ	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్(ఐ)	3,606
1999	పాలేటి రామారావు	టీడీపీ	గోలి అంజలీదేవి	కాంగ్రెస్(ఐ)	13,508
2004	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్(ఐ)	పాలేటి రామారావు	టీడీపీ	30,077
2009	ఆమంచి కృష్ణమోహన్	కాంగ్రెస్(ఐ)	జంజనం శ్రీనివాసరావు	టీడీపీ	11,286
2014	ఆమంచి కృష్ణమోహన్	నవోదయం	పోతుల సునీత	టీడీపీ	10,335
2019	కరణం బలరాం	టీడీపీ	ఆమంచి కృష్ణమోహన్	వైసీపీ	17,419

నియోజకవర్గం ఆవిర్భావం తొలినాళ్లలో ప్రస్తుతం పర్చూరు నియోజకవర్గంలోని కారంచేడు మండలంలో సింహభాగం చీరాల నియోజకవర్గంలో ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన తరువాత చీరాల పట్టణం, చీరాల, వేటపాలెం మండలాలతో నియోజకవర్గం రూపాంతరం చెందింది. ఈ నియోజకవర్గం నుంచి ప్రగడ కోటయ్య, సజ్జా చంద్రమౌళి, కొణిజేటి రోశయ్య, చిమటా సాంబు, డాక్టర్ పాలేటి రామారావు, ఆమంచి కృష్ణమోహన్‌లు పలుమార్లు పోటీ చేశారు. గెలుపు, ఓటములను చవి చూశారు. 2019 ఎన్నికల్లో కరణం బలరామకృష్ణమూర్తి గెలుపొందారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా రోశయ్య

చీరాల నుంచి పలుమార్లు పోటీచేసి గెలుపు, ఓటములను చవి చూసిన డాక్టర్ కొణిజేటి రోశయ్య ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తరువాత తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. రాజకీయం నేపథ్యం నామమాత్రంగా కూడా లేని చిమటా సాంబు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలుపొంది సత్తాచాటారు. డాక్టర్ పాలేటి రామా రావు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర మంత్రిగా కూడా పనిచేశారు. వారివురు యాదవ సామాజికవర్గానికి చెందినవారు.

ప్రస్తుతం బరిలో ఉన్న అభ్యర్థులు

టీడీపీ, జనసేన, బీజేపీ(ఎన్‌డీఏ) కూటమి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీకి తరపున ఎంఎం కొండయ్యను, వైసీపీ తరపున కరణం వెంకటేష్‌ను ఆయా పార్టీలు ప్రకటించాయి. కొండయ్య నియోజవర్గంలో తొలిసారిగా పోటీచేస్తున్నారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం ఆయన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ తండ్రి కరణం బలరామకృష్ణమూర్తి 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత వైసీపీకి మద్దతు తెలిపారు. ఆయన కుమారుడు వెంకటేష్ పార్టీ ఇన్‌చార్జ్‌గా పని చేస్తూ బరిలో నిలిచారు. అభ్యర్థులిద్దరు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

నియోజవకర్గ ఓటర్లు
2,00,332
పురుషులు
97,559
మహిళలు
1,02,750
ఇతరులు : 23

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

- పద్మశాలి : 29,000
- దేవాంగ : 26,000
- ఎస్సీ : 33,000
- (మాల 27,000,
- మాదిగ 6వేలు)
- యాదవ : 26,000
- వైశ్య : 22,000
- రెడ్డి : 11,500
- కాపు : 11,500
- ముస్లిం : 10,500
- మత్స్యకారులు :
- 9,000
- (పట్టపు, పల్లెకారులు)
  ఎస్టీ : 10,000
  (ఎరుకుల, యానాది)
- కమ్మ : 4,000
- ఇతరులు : 8,000

ఇంటి వద్దకే పెన్షనివ్వాలి

- కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మ



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, ఏప్రిల్ 3: వృద్ధులు,దివ్యాంగులు, వితంతువులకు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దే పెన్షన్ అందించే కార్య క్రమాన్ని చేపట్టాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, పార్టీ శ్రేణులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సచివాలయాల వద్దకు వెళ్ళి పెన్షన్ తీసుకోవాలని ప్రభుత్వం చెప్పటం సరికాదన్నారు. వేసవి తీవ్రత వల్ల అనారోగ్యంతో ఉన్న వారు సచివాలయాల వద్దకు వెళ్ళలేరన్నారు. ప్రభుత్వం వారి జీవితాలతో ఆటలాడుకోకుండా తక్షణమే ఇంటికి పెన్షన్ పంపించాలన్నారు. తాము వలంటీర్ వ్యవస్థకు వ్యతిరేకం కాదన్నారు. వైసీపీ మూకలు దీనిని టీడీపీవారు చేయించారని చెప్పటం సరికాదన్నారు. ఇలాంటి దుష్ప్రచారాన్ని మానుకోవాలని ప్రజలు కూడా దీనిని నమ్మరాదని కృష్ణప్రసాద్ కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పెన్షన్ డబ్బులు ఇంటివద్ద కొచ్చి ఇవ్వాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కళ్ళం హరినాధరెడ్డి, రమేష్, దొప్పలపూడి రామ్మోహనరావు ఉన్నారు.

సీసీసీ ఫోన్ నెంబరు సిద్ధం

08592 288599 నెంబర్ ఏర్పాటు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోలు సెంటర్(సీసీసీ)లో 24 గంటలు పనిచేసేలా టెలిఫోన్ నెంబరును ఏర్పాటు చేసినట్లు జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఇన్‌చార్జీ వరకుమార్ బుధవారం తెలిపారు. ప్రజలు/ఓటర్లు ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ ఫోన్ నెంబరుకు తెలపవచ్చని ఆయన పేర్కొన్నారు.

6 నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 3 : అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 6 నుంచి సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ)-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి తెలిపారు. పరీక్షల టైం టేబుల్‌ను ఆయన విడుదల చేశారు. 1 నుంచి 8 తరగతి వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, 9వతరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు పరీక్ష జరుగుతుంది. 6న అన్ని తరగతులకు ప్రథమభాష తెలుగు పరీక్ష ఉంటుంది. 8న 1 నుంచి 5 తరగతులకు ఇంగ్లీషు పార్ట్ ఏ, 6 నుంచి 9 తరగతులకు ద్వితీయ భాష హిందీ ఉంటుంది. 10న 1 నుంచి 5 తరగతులకు ఇంగ్లీషు పార్ట్‌బీ లోఫెల్, 6 నుంచి 9 తరగతులకు ఇంగ్లీషు పార్ట్‌ఏ పరీక్ష, 12న 1 నుంచి 5 తరగతులకు గణితం, 6 నుంచి 9 తరగతుల వరకు ఇంగ్లీషు పార్ట్‌బీ లోఫెల్, 13న 3, 4, 5 తరగతులకు పరిసరాల విజ్ఞానం, 6 నుంచి 9 తరగతులకు గణితం పరీక్ష ఉంటుంది. 15న 3, 4, 5 తరగతులకు ఓఎస్ఎస్సీ, 6, 7 తరగతులకు జనరల్ సైన్స్, 8, 9 తరగతులకు ఫిజికల్ సైన్స్, 16న 1 నుంచి 5 తరగతులకు ఎస్ఎల్ఏఎస్ గ్రేడ్ 4, 8, 9 తరగతులకు బయాజికల్ సైన్స్ పరీక్ష, 18న 6 నుంచి 9 తరగతులకు సోషల్ స్టడీస్ పరీక్ష ఉంటుంది. 19న 6 నుంచి 9 తరగతులకు కాంపోజిట్ కోర్సు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలు పూర్తయిన తర్వాత 21వతేదీ నాటికి జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తిచేయాలి. 23వతేదీ నాటికి ప్రోగ్రెస్ కార్డులు, ప్రమోషన్ జాబితాలు తయారుచేయాలని ఆ ఉత్తర్వుల్లో డైరెక్టర్ ఆదేశించారు.

చంద్రబాబు అధికారంలోకి వస్తేనే భవిష్యత్

బూదవాడ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గొట్టిపాటి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎల్ఏ గొట్టిపాటి

పంగులూరు, ఏప్రిల్ 3 : చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని బూదవాడ గ్రామంలో కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ బుధవారం రాత్రి స్థానిన నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రాభివృద్ధి కోసమే పొత్తుతో పోటీకి దిగామన్నారు. ప్రజా ఆస్తులను దోచుకోవడమే లక్ష్యంగా వైసీపీ పాలన ఐదేళ్లుగా సాగుతోందన్నారు. జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడాలని గొట్టిపాటి పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు జగన్‌రెడ్డి అనేక హామీలను గుప్పించి వాటిని తుంగలోకి తొక్కారన్నారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల వేళ అబద్ధపు ప్రచారంతో ప్రజలను మోసగించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఐదేళ్లుగా అనేక వాటిపై ధరలు, పన్నులు పెంచి పేదలను పీడించారన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు, రైతులు, శ్రామికులు, వ్యాపారులు నష్టపోయారని గొట్టిపాటి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల కష్టాలు తొలగిపోయేందుకు మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. మే 13న జరిగే ఎన్నికలో సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. రైతులకు రూ.13,500 ఇస్తామని చెప్పి కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చి మోసం చేశారన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి అసలు ప్రీమియమే కట్టలేదన్నారు. 9 గంటలు రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీని అమలు చేయలేదన్నారు. విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెడుతూ వారిని మనోవేదనకు గురిచేశారన్నారు. ప్రతి నియోజకవర్గంలో శీతల గిడ్డంగులు, గోడౌన్‌లు కడతామని చెప్పిన జగన్‌రెడ్డి ఎక్కడా ఒక్కటీ నిర్మించలేదన్నారు. కోఆపరేటివ్ సెక్టార్‌ను పునరుద్ధరిస్తామని మాయమాటలు చెప్పిన వైసీపీ వాటిని పట్టించుకోకపోగా, మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీలను, డెయిరీలను తెరిపించలేదన్నారు. చిత్తూరు, ఒంగోలు పాల డెయిరీలను అమూల్‌కి కట్టబెట్టడం వెనుక ఎంతటి మోసం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రైతులకు ఏడాదికి రూ.20వేల పెట్టుబడి సాయం అందించడంతోపాటు పంటలకు గిట్టుబాటు ధరను కల్పిస్తామని గొట్టిపాటి తెలిపారు. ప్రచార కార్యక్రమంలో కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, అలవల సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డితో, పార్టీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, సహదేవుడు, ఆదిశేఖర్, మస్తాన్‌వలి, ఆదిరెడ్డి, నార్ని సుబ్బారావు, పెదవల్లి అశోక్, ఉన్నం రవిబాబు, అమృతపూడి ఏసోబు, ఓబుల్‌రెడ్డి, రాధాకృష్ణ, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం, సారాపై ఉక్కుపాదం మోపండి

ఎస్ఈబీ ఈఎస్ గోవిందనాయక్



రికార్డులు పరిశీలిస్తున్న ఈఎస్ గోవింద్ నాయక్

చీరాల, ఏప్రిల్ 3 : మద్యం అక్రమ రవాణా, కల్తీ మద్యం, ఎన్‌డీపీఎల్ (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్), సారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్ఈబీ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) సూపరిండెంట్ గోవిందనాయక్ అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో విధి నిర్వహణలో అనుసరించాల్సిన ప్రత్యేక జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. తరువాత జాతీయ రహదారి పరిశీలన, వాహనల తనిఖీ చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో సెబ్ చీరాల ఎస్‌హెచ్‌వో కె.కర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

100 మంది వలంటీర్లు రాజీనామా

సంతమాగులూరు, ఏప్రిల్ 3 : ఎన్నికల్లో స్థానిక నాయకులతో కలసి ఇం టింటి ప్రచారంలో వలంటీర్లు పాల్గొనేందుకు ఎన్నికల కమిషన్ అడ్డుకట్ట వే సింది. ఈ నేపథ్యంలో సంతమాగులూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వలంటీర్లు 100మంది బుధవారం మూకమ్మడిగా రాజీనామా చేశారు.

దొనకొండ మండల వైసీపీకి భారీ షాక్



రాఘవరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేతలు

దొనకొండ, ఏప్రిల్ 3 : దొనకొండ మండల వైసీపీ కన్వీనర్ కందుల నారపురెడ్డి, వైస్ ఎంపీపీ వడ్లమూడి వెంకటేశ్వర్లు ఒంగోలు టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కార్యాలయంలో ఆయన తనయుడు రాఘవరెడ్డి సమక్షంలో బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. యువనాయకుడు మాగుంట రాఘవరెడ్డి వారికి పార్టీ కండవాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిని గెలిపించాని, చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగితే యువతకు ఉపాధి, పేదవాడికి సంక్షేమం సాధ్యమని రాఘవరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మీ మామ కడియాల రమేష్ పాల్గొన్నారు.

నిధులివ్వకుండా నిందలు!

వైసీపీ రాజకీయ క్రీడతో సచివాలయాల వద్ద వృద్ధులు అగచాట్లు

పింఛన్ కోసం రోజంతా పడిగాపులు

పలుచోట్ల ఉదయం నుంచే నిరీక్షణ

బ్యాంకుల వద్ద సిబ్బంది ఎదురుచూపు

మధ్యాహ్నం తర్వాతే ఖాతాలకు జమ

కొన్ని సచివాలయాలకు అందని నగదు

అరకొరగానే నిధులు.. సాయంత్రం ప్రారంభం

కొద్దిమంది లబ్ధిదారులకే అందజేత

ఒంగోలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ వైసీపీ ఆడుతున్న రాజకీయక్రీడ సామాజిక పొందే పింఛన్ లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసింది. ప్రత్యేకించి వయస్సు మళ్లీ, పింఛన్‌పైనే ఆధారపడిన వృద్ధులు, వితంతువులు సచివాలయాల వద్ద ఉదయం నుంచి పింఛన్ కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. అయినా అత్యధికులకు పింఛన్లు అందిన పరిస్థితి లేదు. జిల్లాలో మొత్తం 2,93,120 మంది వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు రూ.87.93కోట్ల మేర సామాజిక పింఛన్ మొత్తం అందుతుంది. టీడీపీ హయాంలో గ్రామకార్యదర్శుల ద్వారా చెల్లింపులు జరిగేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నూతనంగా తెచ్చిన వలంటీర్లతో ప్రతినెల 1వతేదీన ఇంటికి వచ్చి ఇస్తున్నారు. కాగా ప్రస్తుత ఎన్నికల కోడ్ అమలుతో వలంటీర్ల ద్వారా పంపిణీకి ఎన్నికల కమిషన్ బ్రేక్ వేసింది. అధికార వైసీపీకి చెందిన కార్యకర్తలనే వలంటీర్లుగా నియమించి వారి ద్వారా ప్రభుత్వ కార్యక్రమాల పేరుతో పార్టీ ప్రచారాన్ని సాగిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో అలా ఈసీ నిర్ణయం తీసుకుంది. ప్రత్యామ్నాయంగా సచివాలయాల సిబ్బంది ద్వారా చెల్లింపులకు ఈసీ సూచనలకు అనుగుణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ విషయాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం రాజకీయం చేసింది. పింఛన్లను టీడీపీ అడ్డుకుంటున్నదని దుష్ప్రచారం ప్రారంభించారు.

సరిపడా సిబ్బంది ఉన్నా ఇవ్వరట..

అదే సమయంలో ఇంటింటికి తిరిగి పింఛన్‌ను ఇచ్చేందుకు సరిపడా సచివాలయాల సిబ్బంది ఉన్నప్పటికి అలాకాకుండా లబ్ధిదారులు సచివాలయాలకు వచ్చి తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తద్వారా వైసీపీ అలాగే ప్రభుత్వ ఉన్నతాధికారులు టీడీపీపై నిందలు వేసే ప్రయత్నం చేపట్టారు. ఈ విషయాన్ని గుర్తించిన టీడీపీ మిత్రపక్షాలు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేస్తూ వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు అసలు ప్రభుత్వ ఖజానాలో ఉన్న డబ్బును వైసీపీ అనుకులురైన కాంట్రాక్టర్లకు దోచి పెట్టి పింఛన్లకు డబ్బు లేకుండా చేశారన్న విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. అందువల్లనే 1వ తేదీన పింఛన్లు ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో అటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, వైసీపీపైనా వత్తిడి, విమర్శలు పెరగడంతో ఈనెల 3 నుంచి సచివాలయాల వద్ద పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ముందుగానే నగదు సిబ్బందికి ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులందరికి సక్రమంగా సమాచారం ఇవ్వలేదు. దీంతో బుధవారం ఉదయం తొమ్మిది గంటలకే జిల్లాలోని ఆయా ప్రాంతాల్లోని సచివాలయాల వద్దకు వృద్ధులు, ఇతర లబ్ధిదారులుపెద్ద సంఖ్యలో చేరారు. ఆ సమయానికి సచివాలయ సిబ్బందికి కూడా విధులకు రాకపోగా వచ్చిన సిబ్బంది అడ్మిన్ సెక్రటరిలు డబ్బు కోసం బ్యాంకులకు వెళ్లిన విషయాన్ని చెప్పడంతో వచ్చిన లబ్ధిదారులు అంతా సచివాలయాల వద్దనే పడిగాపులు కాచారు.

పింఛన్ల పంపిణీ వ్యవహారంలో వైసీపీ ప్రభుత్వ డ్రామాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఉద్దేశపూర్వకంగా బ్యాంకుల్లో నగదు జమచేయకుండా పండుటాకులను మండుటెండలో ఏడిపించారు. ఏడు పదుల వయస్సు దాటిన వృద్ధులకు వైసీపీ డ్రామాలు అర్థం కాక, గంటల తరబడిఎదురుచూశారు. గతంలో ఎన్నడూ సచివాలయం ముఖం చూడని వారు సైతం పింఛన్ల కోసం బారులు తీరారు. ప్రభుత్వం కావాలనే జాప్యం చేసి పింఛన్‌దారులను ఇబ్బందులకు గురిచేయగా, ఆ నెపాన్ని టీడీపీపై మోపేందుకు వైసీపీ శ్రేణులు విశ్వప్రయత్నాలు చేశారు. అయితే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పింఛన్ల పంపిణీలో ఆలస్యం చేసిందనే విషయాన్ని గ్రహించిన పలువురు సచివాలయ సిబ్బందిని ప్రశ్నించారు కూడా. పేదలకు పింఛన్లు అంటూ గొప్పలకు పోయే వైసీపీ ప్రభుత్వం చివరకు వాటిని రాజకీయం చేసి, తమ స్వార్థం కోసం విషప్రచారం చేయడాన్ని పలువురు చీదరించుకుంటున్నారు.



పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

మధ్యాహ్నం తర్వాత అదీ అరకొరగానే..

అడ్మిన్ సెక్రటరీలు బ్యాంకుల వద్ద నగదు కోసం ఉండగా మధ్యాహ్నం 12 గంటల వరకు నగదు జమకాకపోవడంతో నిరీక్షించాల్సి వచ్చింది. ఆ తర్వాత ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క సమయంలో సాయంత్రం నాలుగు గంటల వరకు ఖాతాలలో వేశారు. అది కూడా మొత్తం కాకుండా కొద్దిమేర మాత్రమే వేశారు. కాగా మధ్యాహ్నం మూడు గంటల నుంచి పంపిణీ ప్రారంభమైంది. అప్పటివరకు వృద్ధులు, ఇతర లబ్ధిదారులు పడిగాపులు కాస్తూ కూర్చోగా తీరా సెక్రటరిలు వచ్చాక కొద్ది మందికి మాత్రమే పంపిణీ చేశారు. టంగుటూరు మండలం అనంతవరం సచివాలయ పరిధిలో 477మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికి రూ.14లక్షలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.50వేలు మాత్రమే ఖాతాలో జమయ్యాయి. సిబ్బంది ముందువరుసలో ఉన్న 16 మందికి ఇచ్చి మిగతా వారికి మరుసటిరోజు వచ్చి తీసుకోమని చెప్పిపంపారు. ఒంగోలు నగరంలో పలుచోట్ల అరకొరగా పంపిణీ జరిగింది. వడ్డెపాలెం సచివాలయానికి అసలు నగదే అందక పంపిణీ ప్రారంభం కాకపోగా, ఇందిరమ్మ కాలనీ వద్ద పెద్దసంఖ్యలో వృద్ధులు ఉన్న కొద్దిమందికే ఇచ్చే సరికి నగదు అయిపోవడంతో వారంతా రాత్రి వరకు అక్కడవేసి చూసి వెళ్లాల్సి వచ్చింది. కొప్పోలు సచివాలయం వద్ద తీవ్ర రద్దీ ఏర్పడగా అక్కడ కొద్ది మందికి ఇచ్చారు.

ఉసూరుమంటూ ఇళ్లకు..

జిల్లాలోని ఇతర అన్ని ప్రాంతాల్లోనూ సచివాయాల వద్ద గంటల కొద్దీ పింఛన్ కోసం ఆశతో పడిగాపులు కాచిన వృద్ధులు, ఇతర లబ్ధిదారులు చివరకు నగదు అందకుండానే ఇళ్లకు పోవాల్సి వచ్చింది. కొన్నిచోట్ల కనీసం కూర్చునేందుకు కుర్చీలు, తాగడానికి మంచినీరు వంటి సౌకర్యాలు కూడా లేక అవస్థలు పడ్డారు. గిద్దలూరులోని కొన్ని సచివాలయాల వద్ద చెట్ల కింద నేలపై కూర్చోని నిరీక్షించాల్సి వచ్చింది. కురిచేడులో దాతలు ఏర్పాటు చేసిన బల్లలపై సేదతీరారు. త్రిపురాంతకంలో సచివాలయ మెట్లపైనే కూర్చోని వృద్ధులు పడిగాపులు కాశారు. పొదిలిలో పంపిణీ సమయంలో రద్దీ కనిపించింది. ఇదిలా ఉండగా మొత్తం చూస్తే బుధవారం సాయంత్రం 6.30 గంటల సమయానికి 36.26శాతం మందికి మాత్రమే పంపిణీ చేశారు. జిల్లాలో ఉన్న మొత్తం 2,93,920మంది పింఛన్‌దారులకు రూ.87.93 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఆ సమయానికి 1,06,574 మందికి రూ.32.23కోట్లు వరకు అందజేసినట్లు సమాచారం. మిగిలిన వారికి గురు, శుక్రవారాల్లో అందజేస్తామని అధికారులు చెప్తున్నారు. మొత్తం మీద రాజకీయ లబ్ధికోసం వైసీపీ ఆడిన రాజకీయ క్రీడ ఫించన్ లబ్ధిదారులను ప్రత్యేకించి వృద్ధులను తీవ్ర అగచాట్లకు గురిచేసింది.

అరకొరగానే జీతాలు

పట్టుమని పదిశాతం మంది ఉద్యోగులకు పడలేదు

రిటైర్డ్ ఉద్యోగులు జీతాల కోసం ఎదురుచూపులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఉద్యోగులకు జీతాల కష్టాలు తప్పడం లేదు. మార్చి 31వతేదీతో గత ఆర్థిక సంవత్సరం ముగియడంతో 2వతేదీ నుంచి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు వస్తాయని గత నెలలోనే ప్రభుత్వం ప్రకటించింది. అయితే మంగళవారం నుంచి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు వారి వారి అకౌంట్లలో జమ అవుతాయని ఆశించారు. కానీ బుధవారం సాయంత్రం వరకు కూడా వారి అకౌంట్లలో జీతాలు జమకాలేదు. జిల్లాలో పనిచేసే ఉద్యోగుల్లో పట్టుమని పదిశాతం మంది కూడా జీతాలు అందలేదు. ప్రభుత్వ ఉద్యోగులు జీతాల కోసం, రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత కొంతకాలం నుంచి వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఉద్యోగులు, పెన్షనర్లు మరింత ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 48వేల మందికిపైగా ఉన్నారు. కేవలం సచివాలయ, పోలీసు, ట్రెజరీ ఇతర శాఖల్లోని కొద్ది మందికి జీతాలు పడగా, ఉపాధ్యాయులకు నిరాశే ఎదురైంది. ఉద్యోగులు తమ బ్యాంకు అకౌంట్లలో వేతనం పడిందా లేదా అని సెల్‌ఫోన్ మేసేజ్ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గత నాలుగైదు నెలల నుంచి ప్రభుత్వం శ్లాబ్ విధానంలో జీతాలు వేస్తుండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఆర్థిక శాఖ అమరావతిలోనే డిపార్ట్‌మెంట్ల వారీగా విభజించి జీతాలు వేస్తుండగా ప్రస్తుత నెలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. జీతాలు ఎప్పుడు పడుతాయోనని అందరూ ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉలిక్కిపడ్డ పోలీసు

ఎస్పీపై బదిలీ వేటు ఎఫెక్ట్

అడ్డగోలు వ్యవహారంతోనే ఏసీబీ చిక్కిన టంగుటూరు ఎస్ఐ

మరికొంతమందిపైనా ఈసీ దెబ్బపడే అవకాశం

ఒంగోలుక్రైం,ఏప్రిల్ 3: ఊహించని విధంగా ఎస్పీ పరమేశ్వరరెడ్డిపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేయడంతో పోలీసు శాఖ ఉలిక్కిపడింది. ప్రధానంగా అధికారపార్టీకి కొమ్ముకాస్తున్న కొందరు పోలీసులలో ఆందోళన మొదలైంది. పైకి ఎన్నికల ప్రక్రియలో అదంతా సాధారణమే అంటూ కొట్టిపారేస్తున్నా లోపల మాత్రం వణికిపోతున్నారు. ఇప్పటికే ఆరోపణలు, కేసులు ఎదుర్కొంటున్న వారు లోలోన ఆందోళనకు గురవుతున్నారు. తమపై వేటు పడకుండా ఎలా బయటపడాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు. అదేసమయంలో టంగుటూరు ఎస్సై నాగేశ్వరరావు రూ.70వేలు లంచం తీసుకుంటు అవినీతి నిరోధకశాఖ అధికారులకు దొరికిపోయారు. రెండు ఘటనలు మంగళవారమే జరగడంతో పోలీసుశాఖలో కలకలం మొదలైంది. అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా వేటు తప్పదు అనే సంకేతాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కొంతమంది పోలీసు అధికారులు ఎన్నికల నిబంధనలకు లోబడి పనిచేసుకుపోదం అని చర్చించుకోవడం విశేషం. నిన్నమొన్నటి వరకు పోస్టింగ్ ఇప్పించి ఆదరించిన వారికి రుణం తీర్చుకోవాలని బాహాటంగా చెప్పిన అధికారులు సైతం కాస్త వెనక్కు తగ్గారు. ఎస్పీపైనే వేటు పడటంతో అధికారపార్టీకి అటకాగుదామని నిర్ణయం తీసుకున్న పోలీసు అధికారుల వెన్నులో చలి ప్రారంభమైంది. జిల్లా బాస్‌ను ఎన్నికల విధులకు దూరంగా ఉంచమని ఈసీ దేశాలు ఇవ్వడంతో కిందిస్థాయి అధికారులలో అలజడి బయలుదేరింది. ఏ ఇద్దరు పోలీసు అధికారులు కలిసినా ఇదే చర్చ నడుస్తోంది. కొంతమంది ఎస్ఐలు ఫోన్లు చేసుకొని మాట్లాడుకుంటున్నారు. జాగ్రత్తగా ఉండాలంటూ మాట్లాడుకోవడం కనిపించింది. అదేవిధంగా కిందిస్థాయి సిబ్బంది కూడా అలర్ట్ అయిన పరిస్థితి. ముఖ్యంగా తిరుపతిలో అక్రమాలతో పాటు గిద్దలూరు మండలం పరమేశ్వరపురంలో జరిగిన మునయ్య హత్య విషయంలో ఎస్పీ పీకలలోతు ఇరుక్కుపోయిన విషయం తెలిసిందే. అయితే గిద్దలూరు ప్రాంతంలో పనిచేస్తున్న పోలీసు అధికారులపైనా విచారణ జరుగుతుందని సమాచారం. ఎస్పీపై వేటు వేసిన ఎన్నికల కమిషన్ అందుకు నేరుగా బాధ్యులైన అధికారులపై చర్యలు ఉంటాయని తెలుస్తోంది. ఇటీవల మంత్రి గారి రుణం తీర్చుకోవాలనే తలంపుతో టీడీపీ నాయకులను బెదిరించడం, రౌడీషీట్లు తెరిచిన ఎస్ఐపై కూడా విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే ఒంగోలులోని ఇద్దరు సీఐలపైన నేరుగా టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేశారు. వారిపైన ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

నగదు, సామగ్రి గమ్యం చేర్చారు

తిరుపతి నుంచి జిల్లాకు ఎస్పీ పరమేశ్వరరెడ్డి బదిలీపై రావడమే వివాదాస్పదంగా మారింది. ఒంగోలు పార్లమెంట్ స్థానం వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించేందుకు పరమేశ్వరరెడ్డి బదిలీ జరిగిందని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అనంతరం చెక్‌పోస్టుల వద్ద అధికార పార్టీ నగదు, సామగ్రి బాస్ సిఫార్సులతో గమ్యం చేరాయని ఆరోపణలు ఉన్నాయి. అదేక్రమంలో ప్రధానమంత్రి సభకు ట్రాఫిక్ విధులలో పాల్గొన్న పరమేశ్వరరెడ్డి వైఫల్యం చెందారు. ఇలా అనేక ఆరోపణలు రావడం, అవన్నీ నిజమేనని తేలడంతో ఎన్నికల కమిషన్ విచారణ చేసి వేటువేసింది.

మరికొంతమందిపైనా వేటు పడే అవకాశం

పోలీసు శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి అధికారులు మరి కొంత మందిపై వేటు పడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే అధికారపార్టీకి వంతపాడుతూ ఇతరులపై కక్షగట్టి పనిచేసిన కొందరు సీఐలు, ఎస్ఐలపై ఇప్పటికే ప్రతిపక్షపార్టీలు నేరుగా ఈసీకి ఫిర్యాదులు చేశారు. అలాగే కోర్టులోనూ కేసులు వేశారు. ఆయా ఫిర్యాదులపై విచారణ చేసిన తరువాత చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోలీసు శాఖలోనే చర్చ నడుస్తోంది. ఎస్పీని బదిలీ చేసిన తరువాత వారెంత అనే భావనను ఎక్కువమంది వ్యక్తం చేస్తున్నారు. అధికారపార్టీకి అండగా పనిచేస్తున్న పోలీసు అధికారులలో మాత్రం భయం మొదలైంది.

నేడు టీడీపీ కూటమి బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు

దర్శి, ఏప్రిల్ 3 : దర్శి పట్టణంలో టీడీపీ కూటమి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించే బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీపీ కూటమి అభ్యర్థిగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని నియమించిన విషయం తెలిసిందే. ఆమె గురువారం ఎన్నికల ప్రచారానికి భారీ ఊరేగింపుతో రానున్నారు. తొలుత నరసరావుపేట నుంచి కుటుంబ సభ్యులతో బయలుదేరి కొటప్పకొండకు వెళ్లి త్రికోటేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేస్తారు. అక్కడ నుంచి సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తారు. అనంతరం దర్శి నియోజకవర్గంలోని శంఖరాపురం నుంచి ర్యాలీగా సాయంత్రం 4గంటలకు దర్శికి చేరుకుంటారు. ఈ సందర్భంగా యువత భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. దర్శిలో జరిగే బహిరంగ సభలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీతో పాటు ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, అద్దంకి, ఒంగోలు, కొండపి అసెంబ్లీ అభ్యర్థులు గొట్టిపాటి రవికుమార్, దామచర్ల జనార్దన్, డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్, దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బొటుకు రమేష్‌బాబు, జనసేన నాయకుడు గరికపాటి వెంకట్, బీజేపీ ఇన్‌చార్జి మాడపాకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొంటారని టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ చెప్పారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ముండ్లమూరు, ఏప్రిల్ 3 : మండలంలోని వేంపాడు - ముండ్లమూరు మధ్య చిలకలేరు వాగు వద్ద ఈనెల 1వ తేదీ గుర్తు తెలియని వాహనం ఢీకొని 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతూ బుధవారంరాత్రి ఒంగోలులోని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందారు. మృతి చెందిన వ్యక్తి ఎవరనేది ఎటువంటి ఆనవాళ్ళు లభించ లేదని ఎస్ఐ వీ ఆంజనేయులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృత దేహం రిమ్స్ ఆస్పత్రిలో ఉందని తెలిపారు.

వైసీపీ పతనం ప్రారంభమైంది

టీడీపీ కూటమి అభ్యర్థి విజయ్‌కుమార్

55 కుటుంబాలు వైసీపీ నుండి టీడీపీలో చేరిక

ఒక్కొక్కరిగా వైసీపీని వీడుతున్న నాయకులు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన బీఎన్



బీఎన్ సమక్షంలో పార్టీలో చేరిన నరసయ్య

సంతనూతలపాడు, ఏప్రిల్ 3 : రాష్ట్రంలోని నిరంకుశ పాలనతో పేద, మధ్యతరగతి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, ఇక వైసీపీకి పతనం ప్రారంభమైందని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఘైనంపాడులో గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు మాదాల నరసయ్య, మాదాల రవి అనుచరులు బుధవారం బీఎన్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారితోపాటు 55 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈసందర్భంగా వారందరికి బీఎన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాదాల నరసయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందని, వైసీపీ మాత్రం మాటలతో మాయ చేస్తోందని వారు అన్నారు. బీఎన్ ఎమ్మెల్యేగా గెలుపు ఖాయమని, బాబు పాలనలో మళ్లీ బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర కులాలకు సమన్యాయంగా పథకాలు ఉంటాయని తెలిపారు. మాదాల రవి మాట్లాడుతూ ఇటు రాష్ట్రంలోను, నియోజకవర్గంలోను వైసీపీ నాయకుల నియంత పోకడలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, చంద్రబాబు సీఎం కావడమే దీనికి సమాధానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర పార్టీ సెక్రటరి అడకా స్వాములు తన్నీరు శ్రీను, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

బల్లికురవ, ఏప్రిల్ 3 : మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో అక్క ఇంటి నుంచి పాలెపోగు కిరణ్ అనే యువకుడు అదృశ్యం కావడంతో బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం మాధవవరానికి చెందిన 19ఏళ్ల యువకుడు పాలెపోగు కిరణ్ 10వ తరగతి వరకు చదివి ఖాళీగా ఉండడంతో తన అక్క ఊరు బల్లికురవ మండలం సోమవరప్పాడు గ్రామంలో లారీకి వెళుతూ కొంత కాలం నుంచి ఉంటున్నాడు. నాలుగు రోజుల కిందట కిరణ్ బైకును తీసుకొని ఇంట్లో సెల్‌ఫోను తీసుకొని ఇంటి నుంచి వెళ్లాడు. వారి బంధువులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువకుడి బావ అనపర్తి నరేంద్రబాబు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏబీసీ కాలువలో పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

బల్లికురవ , ఏప్రిల్ 3 : మండల పరిధిలోని వల్లపల్లి సమీపంలో ఉన్న అద్దంకి బ్రాంచి కెనాల్ కాలువలో వివాహ వేడుకలకు వస్తూ ప్రమాదవశాత్తు బైక్‌తో కాలువలో పడి ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... పల్నాడు జిల్లా ఉమ్మడివరం గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామానికి వివాహ కార్యక్రమానికి బుధవారం వస్తున్నారు. ప్రమాదవశాత్తు బైక్‌తో సహా ఆయన కాలువలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై ఉన్న మరో వ్యక్తికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు.



పర్చూరులో టీడీపీ, జనసేన కూటమి ప్రచారంలో పాల్గొన్న శ్రేణులు

పర్చూరులో జోరుగా కూటమి ప్రచారం

ఉత్సాహంగా పాల్గొంటున్న యువత

పర్చూరు, ఏప్రిల్ 3 : పర్చూరులో తెలుగుదేశం, జనసేన, బీ జేపీ కూటమి ప్రచారం జోరుగా సాగుతోంది. పెద్దఎత్తున యువకులు, మహిళలు తరలిరావడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. మేనిఫెస్టోలో రూపొందించిన పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ నా యకులు ముందుకు సాగుతున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలోని పలు వీధుల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాంప్రసాద్, తంగెళ్ల మల్లికార్జునరావు, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, శ్రీరాం వెంటకసుబ్బారావు, మల్లాది సురేష్, కొల్లా చౌదరి, కోటగిరి ప్రసాద్, పఠాన్ బాజీ, కృష్ణంశెట్టి జగదీష్, షేక్ బుల్లా మేస్త్రీ, జనసేన నాయకులు దీర్ఘాల రమేష్ నాయుడు, బేత భూపతి, జట్టి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై వైసీపీ అబద్ధాలు

» జగన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు జనం సిద్ధం

» ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 3 : రాజకీయ లబ్ధి కోసమే పింఛన్ల పంపిణీని వైసీపీ ప్రభుత్వం జాప్యం చేసిందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. బుధవారం మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంప్ కార్యాలయంలో మార్టూరు, యద్దనపూడి మండలాల క్లస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి ఏలూరి వారికి దిశానిర్దేశం చేశారు. పింఛన్‌లను సకాలంలో అందజేయకుండా వైసీపీ రాజకీయ డ్రామా ఆడుతోందన్నారు. వైసీపీ పాలనలో సాగించిన అక్రమాలను కూకటివేళ్లతో పెకిలించడానికి, జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారని ఏలూరి అన్నారు. ప్రజా సంక్షేమం కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ చేపట్టే సంక్షేమ పథకాలను ప్రచారం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల కష్టాలు తీర్చేందుకు కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలు ఇప్పటికే మనస్సులో నిర్ణయించుకున్నారని ఏలూరి అన్నారు. పేదరిక నిర్మూలన, అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత మీదేనన్నారు. మరో 45 రోజులలో జగన్‌రెడ్డి పార్టీ గాలికి కొట్టుకుపోతుందన్నారు. సమావేశంలో గుదే తారక రామారావు, బోయపాటి సాంబయ్య, రంగయ్య చౌదరి, అనిల్ పాల్గొన్నారు.



పూనూరు క్లస్టర్ యూనిట్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

గ్రామాలలో పర్యటించిన ఏలూరి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం మండలంలోని రాజుపాలెం, కోలలపూడి, తాటి వారిపాలెం గ్రామాలలో పర్యటించారు. రాజుపాలెం గ్రామంలో అడుసుమల్లి నాగ శ్రీహర్ష, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడుసుమల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం కోలలపూడి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావు తదితరుల పర్యవేక్షణలో ఏలూరి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. తాటివారిపాలెంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన మాజీ సర్పంచ్ వజ్జా వీరాంజనేయులను ఏలూరి పరామర్శించారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

నోటి సమస్యల నుంచి విముక్తి

» జిల్లా హాస్పిటల్‌లో నోటి కేన్సర్‌ను గుర్తించే పరికరం ఏర్పాటు

» ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారులు పిలుపు

చీరాలటౌన్, ఏప్రిల్ 3 : నోటి నుంచి వచ్చే అతి భయంకరమైన రోగముల నుంచి ప్రజలు విముక్తి పొందాలని పలువురు వైద్యాధికారులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఏరియా వైద్యశాలలో హాస్పిటల్ దంత వైద్య నిపుణులు డా.సునయన, జిల్లా పొగాకు నియంత్రణ అధికారి రమేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నోటి ద్వారా సంక్రమించే కేన్సర్‌ను ముందుగానే గుర్తించే వెల్‌స్కోప్ పరికరం ఇక నుంచి బాపట్ల జిల్లా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నట్లు వివరించారు. దీనికి సంబంధించి స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. పలువురికి సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే నేరుగా జిల్లా హాస్పిటల్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ డా.శేషుకుమార్, ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డా.సుభాషిణి, జిల్లా దంత వైద్యులు డా.శశికుమార్, నర్సింగ్ ఫ్యాకల్టీలు, హాస్పిటల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పింఛన్ లబ్ధిదారులకు అసౌకర్యం కల్పించవద్దు

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాలటౌన్, ఏప్రిల్ 3 : పింఛన్ అందుకునేందుకు వచ్చే లబ్ధిదారులకు అసౌకర్యం కలుగకుండా సేవలందించాలని చీరాల మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. పింఛన్‌ల పంపిణీ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ క్రమంలో ఆంధ్రరత్ననగర్ సచివాలయాన్ని కమిషనర్ సందర్శించి పంపిణీను పరిశీలించారు. పింఛన్‌దారులతో మాట్లాడారు. అలాగే సేవలపై ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని సిబ్బందికి సూచించారు. విధిగా తాగునీరు. షామియానా, కుర్చీలు వివిధ సౌకర్యాలు కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం సాయంత్రం నుంచి సచివాలయ సిబ్బందితో పంచన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. బ్యాంకుల నుంచి నగదు తెచ్చుకోవడం ఆలస్యం కావడంతో ఎంపీడీవో కార్యాలయం నుంచి నగదు సమకూరింది. గురువారం అన్ని గ్రామాలలో పింఛన్ల పంపిణీ వేగవంతం చేసేలా అధికారులు సిద్ధం చేస్తున్నారు.

పర్చూరు : పర్చూరు మండల పరిధిలో బుధవారం ఆయా గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల వద్ద పెన్షన్‌ల పంపిణీ చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సిబ్బంది ఉరుకులు పరుగులు తీసారు. మరో ప్రక్క పెన్షన్ దారులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా పంపిణీ కేంద్రాల వద్ద వీఆర్ సిబ్బంది నేతృత్వంలో మంచినీటి సౌకర్యంతోపాటు, సచివాలయాల ప్రాంగణంలో టెంట్‌లను కూడా ఏర్పాటు చేశారు. వృద్దులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా సిబ్బంది త్వరిత గతిన ఫించన్‌లను అందజేశారు. పర్చూరు మండల పరిధిలో మొత్తం 8,345 పెన్షన్‌లకు సబంధించిన లబ్ధిదారులు ఉండగా రూ.2కోట్ల,52లక్షల, పదివేలు అందజేసే విధంగా చర్యలు చేపట్టామని ఎంపీడీవో బి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ పిచ్చిరెడ్డి సందర్శించి పరిశీలించి, సిబ్బందికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు.



పర్చూరు సచివాలయం వద్ద పెన్షన్‌లను అందజేస్తున్న సిబ్బంది

మార్టూరు : మండలంలో బుధవారం సాయంత్రం పెన్షన్లు పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రారంభించారు. ఉదయం నుండి పెన్షను సొమ్ములు కోసం వృద్దులు, వితంతువులు, పెన్షను దారులు సచివాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అ ు తే బ్యాంకు నుండి నగదు తీసుకురాలేదని చెప్పిన సచివాలయం సిబ్బంది ఎట్టకేలకు సాయంత్రం 4 గంటల తర్వాత పెన్షను పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.పెన్షను దారులు తప్పని సరిగా ఆధార్ కార్డు లను తీసుకురావాలని చెప్పడంతో సచివాలయం వద్దకు వచ్చిన పెన్షను దారులు మరల ఇంటికి వెళ్లి ఆధార్ కార్డులను తీసుకురావడంతో సచివాలయాల వద్ద రద్దీ ఏర్పడింది.

యద్దనపూడిలో


యద్దనపూడి మండలంలో పూనూరు లోని రెండు సచివాలయాలు, యద్దనపూడి సచివాలయంలో మాత్రం బుధవారం పెన్షను పంపిణీ జరగలేదు. మిగిలిన అన్ని గ్రామ సచివాలయాల్లో పెన్షను పంపిణీ చేశారు. అయితే సరిపడా నగదు రాకపోవడంతో మూడు సచివాలయాల్లో పెన్షను పంపిణీ చేయలేదని, గురువారం ఈ మూడు సచివాలయాల్లో పెన్షను పంపిణీ చేస్తామని యంపీడీవో శి వ సుబ్రమణ్యం తెలిపారు.

నేటి నుంచి మూడు జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నీ

బల్లికురవ, ఏప్రిల్ 3 : మండలంలోని కొణిదెన గ్రామంలో నేడు గురువారం నుంచి బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమవుతాయని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. మెదటి బహుమతిగా రూ.20,116, రెండో బహుమతిగా రూ. 15,116, మూడో బహుమతిగా రూ.10,116, నాలుగో బహుమతిగా రూ.5,116 అందిస్తున్నామని ఆసక్తి కలిగిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన వచ్చని నిర్వాహకులు కోరారు.

250 మందికి ఉచిత వైద్య సేవలు

ఇంకొలు, ఏప్రిల్ 3 : మండలంలోని పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలను వైద్య సిబ్బంది ఉచితంగా నిర్వహించారు. గుండె, కిడ్నీ, విష జ్వరాలు, ఇతర వ్యాధులపై వైద్యులు అవగాహన కల్పించారు. అనంతరం మందులను ఉచితంగా అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ మహిత, ఆప్తమాలజిస్ట్ రాణి, కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



శివారు ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్న ఈపూరుపాలెం పోలీసులు

ఎన్నికలకు ప్రత్యేక నిఘా

గవినివారిపాలెం(చీరాలటౌన్), ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఈపూరుపాలెం ఎస్ఐ మర్రి శివకుమార్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని గవినివారిపాలెంలో ప్రత్యేక పోలీసు బృందాలతో కవాతు నిర్వహించారు. బస్, ఆటో పలు రకాల అనుమానస్పద వాహనాలు తనిఖీ చేశారు. అలాగే శివారు ప్రాంతంలోని పొలాల్లో సైతం కవాతు నిర్వహించి తనిఖీలు చేశారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక పోలీసు బృందం పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

చినగంజాం : ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంతరావూరు గ్రామంలో పోలీసులతో కలిసి కేంద్ర సాయుధ బలగాలు బుధవారం కవాతు నిర్వహించాయి. గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకుండా ముందుస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల సమయంలో ఒకసారి కేసు నమోదైతే ప్రతి ఎన్నికల్లోను వారిపై నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల్లో ప్రజలు వివాదాలకు తావు లేకుండా అందరూ సహకరించాలని కోరారు. ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్లలో..

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించాని మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్ కోరారు. బుధవారం మేదరమెట్లలో కేంద్ర బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలలో ఎటువంటి అవాంచనీయ సంఘటలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతియుతంగా పోలింగ్ నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. డీఎస్పీ అనుమతి లేకుండా మైకులు వాడకూడదన్నారు. సభలు, సమావేశాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాలను వినియోగించుకోవాలి : ఆర్డీవో



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో రవీందర్

పర్చూరు, ఏప్రిల్ 3: వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాలను వినియోగించుకోవాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో గంధం రవీందర్ అన్నారు. పర్చూరు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చవివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంతోపాటు, ప్రభుత్వ కార్యాలయాలకు కూడలిగా ఉన్న ప్రాంతంలో వివిధ పనుల కోసం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చవివేంద్రాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్.సుబ్బయ్య, ఎంఈవో వెంకట్రామయ్య, డీటీ లగడపాటి నాగలక్ష్మీ, ఆర్ఐ ప్రేమ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాలొన్నారు.

మార్టూరులో

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్‌డీవో రవీందర్ బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేసవిలో ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వచ్చే ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చలివేంద్రాన్ని కొనసాగించాలని ఆర్‌డీవో రవీందర్ తహసీల్దార్ సంధ్యశ్రీకి సూచనలు చేశారు. అనంతరం మార్టూరులో పాండురంగస్వామి గుడి సమీపంలో హోం ఓటింగ్ 12 డీ ఫారాన్ని మంచంపై ఉన్న వృద్ధుడికి ఆయన అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, ఆర్ఐ రహమాన్ బాషా పాల్గొన్నారు.

యద్దనపూడిలో

యద్దనపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఆర్‌డీవో రవీందర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన గ్రామంలోని మోడల్ పోలింగఫ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలింగ్ స్టేషన్‌లో ఉన్న వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.నాగరాజు, ఆర్ఐ విష్ణు, ఎంపీడీవో శివ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహపూర్వక పోటీతత్వం

చీరాల, ఏప్రిల్ 3 : క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసంతో పాటు స్నేహపూర్వక పోటీతత్వం అలవడుతుందని వైసీపీ చీరాల నియోజకవర్గ అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. దండుబాట జాలమ్మగుడి వెనుక బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోటీలను వెంకటేష్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. తరువాత కొంతసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. అనంతరం క్రీడాకారుల మధ్య మ్యాచ్ రసవత్తరంగా సాగింది. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేష్

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి

» ఎమ్మెల్యే గొట్టిపాటి

బల్లికురవ, ఏప్రిల్ 3 : ఎన్నికలలో తెలుగదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కోరారు. బుధవారం చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే గృహంలో బుధవారం మండలంలోని వేమవరానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ వైసీపీ పార్టీ చేపట్టిన తప్పుడు పనుల వలన అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రజా సమస్యలు పట్టకుండా ప్రచార పిచ్చితో జగన్ పనిచేశారని అయన విమర్శించారు. అనంతరం గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వారితో చర్చించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ద్వారా పలు సీసీ రోడ్లు వేయించిన విషయాన్ని అయన వారికి గుర్తు చేశారు. పార్టీలో చేరిన వారిలో గరికపాటి సుబ్బారావు, ధర్మయ్య, పొత్తూరి సతీష్, గరికపాటి సత్యనారాయణ, చలపతి, రామకోటేశ్వరరావు, పొత్తూరి సుబ్బారావు, రామారావు, గోవర్ధనయ్య, హరిబాబు ఉన్నారు.



ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వేమవరం వాసులు

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్

మండలంలోని వేమవరం గ్రామంలో టీడీపీ నేత పేరం సుబ్బయ్య కుమారుడు సాయితేజ ఇటీవల మృతి చెందడంతో బుధవారం వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శించారు. అలాగే ఎస్టీ కాలనీలో కార్యకర్త భూక్యానాయక్ మృతిచెందగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ నేతలు గొట్టిపాటి మారుతి ఉన్నారు.

ఒక వైపు తండ్రి ... మరో వైపు తనయుడు

ఈపురుపాలెంలో అభ్యర్థి కొండయ్య... కొట్లబజారులో మహేంద్రనాథ్ ప్రచారం

చీరాల, ఏప్రిల్ 3 : ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య, ఆయన తనయుడు మహేంద్రనాథ్ బుధవారం పార్టీల శ్రేణులతో కలసి వేర్వేరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొండయ్య మండలంలోని ఈపురుపాలెంలో నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు గుద్దంటి చంద్రమౌళి, కొమ్మనబోయిన రజని తదితరులు ఆయా ప్రాంతాల వారిని పరిచయం చేశారు. ప్రధానంగా మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్, బీసీ డిక్లరేషన్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో వారు పర్యటించిన ప్రాంతాల్లో సా నుకూలత లభించింది. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. పట్టణంలోని కొట్లబజారులో తదితర ప్రాంతాల్లో కొం డయ్య కుమారుడు మహేంద్రనాథ్, పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు, ఎంఆర్‌ఎఫ్ రమేష్, నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నారు. పార్టీ కార్యాలయంలో పలువురు పాస్టర్లు కొండయ్యను కల సి ఆత్మీయతను తెలిపారు. ఆయా కార్యక్రమా ల్లో టీడీపీ, జనసే, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఈపురుపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న కొండయ్య



కొట్లబజారులో ప్రచారం చేస్తున్న మహేంద్రనాథ్

లక్ష్మి మృతికి ఏలూరి సంతాపం

పర్చూరు, ఏప్రిల్ 3 : విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శివాలశెట్టి కృష్ణారావు సతీమణి శివాలశెట్టి లక్ష్మి మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం పర్చూరులోని ఆమె నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె కుమారుడు మాజీ క్రికెటర్ శివాలశెట్టి రవిని పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. అదే గ్రామంలో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు షేక్ కరిముల్లా మృతదేహాన్ని సందర్శించి ఏలూరి నివాళులర్పించారు. ఆయనవెంట టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, నాయకులు కొల్లా శివరాంప్రసాద్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, తంగెళ్ల మల్లికార్జునరావు, తులసి శ్రీనివాసరావు, ఆకుల మధుబాబు, మల్లాది సురేష్, శ్రీరాం వెంకట సుబ్బారావు, పఠాన్ సమీర్, పఠాన్ మీరావలి, పఠాన్ బాజీ ఉన్నారు. దీనికి ముందు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్ కుమార్ లక్ష్మి మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన వెంట జనసేన పార్టీ నాయకులు విన్నకోట అజయ్, కారంపూడి సందీప్ తేజ, అచ్చుకోలు సతీష్, తులసి చంటి పాల్గొన్నారు.



లక్ష్మి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కిషోర్‌బాబు

కాంగ్రెస్ మేనిఫెస్టోతో అందరికీ లబ్ధి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలతో పేద ప్రజలందరికీ లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్‌బాబు అన్నారు. బుధవారం అద్దంకిలో ఇండియా కూటమి ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ అద్దంకి మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలల్లో పర్యటించి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. నన్ను నమ్మి నాకు ఓటు వేసిన వారికి ఎప్పుడైనా వైద్య సాయంలో భాగంగా సగం నగదు చెల్లించేందుకు నేను సిద్ధంగా ఉన్నానని, ఇది నా వ్యక్తి గత హామీ అన్నారు. స్థానికులను నమ్మి ఓటు వేయాలని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాకే ప్రథమ ప్రాధాన్యత అన్నారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ జాయింట్ డైరెక్టర్ కోరే సురేంద్రనాద్, శ్రీనివాసరావు, ఆమ్ ఆద్మీ నాయకులు నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు సురేష్‌బాబు, కబలా సుబ్రహ్మణ్యం, మహిళ నాయకురాలు రోజారాణి, సజీనా పాల్గొన్నారు.



భీమావారిపాలెం సచివాలయం వద్ద పెన్షన్ కోసం ఉన్న వారితో మాట్లాడుతున్న కూటమి నరేంద్రవర్మ, తెన్నేటి

చేసింది చెప్పుకోవడానికి లేక టీడీపీపై విమర్శలు

కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్

బాపట్ల,ఏప్రిల్ 3 : వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిన ప్రగతి చెప్పుకోవడానికి ఏమీలేక పెన్షన్ రాకుండా చేస్తున్నారని చంద్రబాబుపై వైసీపీ మూకలు విమర్శలు చేస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని భీమావారిపాలెం సచివాలయం వద్ద పెన్షన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులను బుధవారం వారు పలకరించారు. పెన్షన్ ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ నుంచి ఇంకా డబ్బులు రాలేదని వచ్చిన వెంటనే ఇస్తామని సచివాలయ సిబ్బంది చెప్పినట్లు లబ్ధిదారులు తెలిపారు. దీనిపై నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులను అడ్డుపెట్టుకొని టీడీపీపై దుష్ప్రచారాలు చేయటాన్ని మానుకోవాలని వైసీపీని హెచ్చరించారు. చంద్రబాబు పెన్షన్‌ల విషయమై ఎన్నికల కమిషన్, చీఫ్ సెక్రటరీతో మాట్లాడి పెన్షన్ సజావుగా లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరినట్లు తెలిపారు. రెండునెలలు తర్వాత టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే వచ్చి రూ.4వేల పింఛన్ ఇస్తామని తెలిపారు.

పారని పాచిక!



కందుకూరులోని ఓ బ్యాంకులో నగదు కోసం సచివాలయాల సిబ్బంది ఎదురుచూపు



కలిగిరిలో పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది



మనుబోలు-2 సచివాలయం వద్ద పింఛనుదారుల నిరీక్షణ



ఉదయగిరి-3 సచివాలయం వద్ద ఎండలో నిరీక్షిస్తున్న పింఛనుదారులు

- పెన్షన్ కోసం సచివాలయాలకే రావాలని చాటింపు
- ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అవస్థలు
- మధ్యాహ్నం తర్వాత బ్యాంకుల్లో నగదు జమ
- సాయంత్రం నుంచి పింఛన్ల అందజేత
- 3 గంటల్లోనే 52 శాతం మందికి పంపిణీ

పింఛన్ల వ్యవహారంలో ప్రతిపక్షాలపైనే అబాంఢం వేయాలనుకున్నారు. అవ్వాతాతలు, దివ్యాంగులంతా ఉదయానికల్లా సచివాలయాల వద్దకు వస్తేనే పెన్షన్ సొమ్ము ఇస్తామని చాటింపు వేశారు. ఆ పిలుపు అందుకుని నానాయాతనలు పడుతూ ఉదయానికల్లా సచివాలయాలకు చేరిపోయారు. అయితే, తీరిగ్గా మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో బ్యాంకుల్లో నగదు చేశారు. డబ్బులు చేతికి అందడం ఆలస్యమైనా సచివాలయాల ఉద్యోగులు, గ్రామ కార్యదర్శులు ప్రశంసాపూర్వకంగానే పని చేశారు. కేవలం మూడు గంటల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 52 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసి అధికారపక్షం రాజకీయ ప్రయోజనానికి గండి కొట్టారు.

నెల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 19 మండలాల్లో గరిష్ఠంగా 73 శాతం నుంచి కనిష్ఠంగా 50 శాతం వరకు, 20 మండలాల్లో 25 నుంచి 45 శాతం వరకు పెన్షన్ పంపిణీ చేశారు. కందుకూరు, వలేటివారిపాళెం మండలాల్లో మాత్రం 10నుంచి 15 మందికి మాత్రమే పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 3,16,492 మంది పెన్షనర్లకుగాను బుధవారం 1,48,246 పింఛన్లు పంపిణీ చేశారు. ఇంకా 1,68,246 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. ఉదయమే బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేసి ఉంటే తొలిరోజే 80 శాతానికి పైగా పంపిణీ జరిగి ఉండేదనే వాదన వినిపిస్తోంది. వలంటీర్లను పక్కన పెట్టిన కారణంగానే ఇలా జరిగిందని పింఛనుదారులు భావించేలా, అందుకు ప్రతిపక్ష పార్టీలే కారణమనే అభిప్రాయం వారిలో కలిగేలా చేయడానికే ప్రభుత్వం ఆలస్యంగా బ్యాంక్ ఖాతాల్లో నిధులు జమ చేసిందనే ఆరోపణలు ఉన్నాయి.

పడిగాపుల పాపం ఎవరిది!?


సాధారణ పరిస్థితుల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియలో తొలిరోజు 75 నుంచి 80 శాతం వరకు పంపిణీ జరుగుతుంది. ఉదయమే బ్యాంకుల్లో నగదు జమ చేసి ఉంటే బుధవారం కూడా అంతే శాతం పంపిణీ జరిగేది. కానీ బ్యాంక్‌ల్లో నిధులు జమ కావడంలో అసాధారణ జాప్యం జరిగింది. ఈ కారణంగా పింఛన్ల కోసం సచివాలయాల వద్ద అవ్వాతాతలు, దివ్యాంగులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. అసలు వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినా క్షేత్రస్థాయిలో అది అమలు కాలేదు. ఎవరైనా సరే సచివాలయం వద్దకు వచ్చి పింఛను తీసుకోవాలని చాటింపు వేయడంతో అంతా అక్కడకు చేరుకుని పడగాపులు కాశారు. కొన్ని చోట్ల సచివాలయం వద్దకు చేరుకోవడానికి వృద్ధులు, దివ్యాం గులు 2, 3 కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ ఉత్తర్వులు సక్రమంగా అమలై ఉంటే పింఛనుదార్లకు ఈ అవస్థలు ఉండేవి కావు. వలంటీర్లు లేని కారణంగానే ఈ కష్టం వచ్చిందనే భావన పింఛనుదార్లలో కల్పించడానికి, ఆ పాపాన్ని ప్రతిపక్ష పార్టీలపై తోసేయడానికి అధికార వైసీపీ గట్టిగానే ప్రయత్నించింది. కానీ ఎన్ని అవాంతరాలు ఎదురైనా, సచివాలయాల వద్ద కొన్ని గంటల సేపు నిరీక్షించాల్సి వచ్చినా గ్రామ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది తొలిరోజు 52 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేయడంతో సమస్య తీవ్రత తగ్గింది. క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు అధికారపక్షం రాజకీయ ప్రయోజనానికి గండి కొట్టినట్లు అయ్యింది.

14 వరకు ఓటరు నమోదుకు అవకాశం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 3 : నగరంలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో నెల్లూరు పార్లమెంటు, 8 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కూడా అక్కడే చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 20,44,814 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని చెప్పారు. ఫారం-6 దరఖాస్తులు 7,971 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మే 13న పోలింగ్ రోజున ఓటరు జాబితాలో చిన్న చిన్న తప్పులు, ఫొటోలు సరిగా లేకపోయినా భారత ఎన్నికల సంఘం సూచించిన 10 గుర్తింపు కార్డులలో ఒక దాన్ని చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని అన్నారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు, పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. భారీ ర్యాలీలు, సభలు, ప్రచారాలకు ముందస్తుగా సంబంధిత ఆర్వో నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. ఆ సమావేశంలో డీఆర్వో లవన్న, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంటు సుబ్రహ్మణ్యం, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జలగండం!

రోజు రోజుకూ ఎండ తీవ్రత అధికమవుతుండటంతో జిల్లాలోని ప్రధాన నీటి వనరుల్లో నీటిమట్టం దిగువస్థాయికి పడిపోతున్నది. సాగు, తాగునీటి అవసరాలు పెరిగి జిల్లాపై కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. పాలకుల నిర్లక్ష్యంతో గతేడాది జిల్లాకు ఆశించినస్థాయిలో నీరు లభించలేదు. ఈ సమస్యతో నీటి ఇబ్బందులు పడే ప్రమాదం నెలకొంది. సోమశిల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 79.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం క్రస్ట్‌గేట్ల దిగువకు 9.4 టీఎంసీలకు నీటిమట్టం పడిపోయింది. ఈ పరిస్థితిని చూసి జిల్లావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రెండో పంటకు నీరు లేక సాగుకు విరామం ప్రకటించే సమయం ఆసన్నమైంది. పంటలు పండించకపోతే తమ పరిస్థితి ఎలా అని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.



- 'సోమశిల' పూర్తిస్థాయి నీటిమట్టం 79.988 టీఎంసీలు
- ప్రస్తుతం క్రస్ట్‌గేట్ల దిగువన 9.4 టీఎంసీలే..
- రెండో పంటకు విరామమే?
- పెరిగిన తాగు, సాగునీటి అవసరాలతో ప్రజల ఆందోళన

అనంతసాగరం, ఏప్రిల్ 3 : సోమశిల ప్రాజెక్టులో మొదటి పంట సాగుచేసే సమయానికి 36టీఎంసీల నీరు నిల్వ ఉండేది. సాగునీటి సలహా మండలి సమావేశంలో 2.6 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చేలా అధికారులు తీర్మానం చేశారు. అందుకోసం 26 టీఎంసీలు కేటాయించారు. మిగిలిన జలాలు తాగునీటి అవసరాల కోసం ఉంచాలని అధికారులు, పాలకమండలి సభ్యులు నిర్ణయించారు. ఆ దిశగా మొదటి పంటకు గతేడాది నవంబరు నుంచి నీరు విడుదల చేయగా నాన్‌డెల్టా పరిధిలోని కొన్నిచోట్ల ఇంకా పంటల దిగుబడులు చేతికందని పరిస్థితి ఉన్నది. ఈ దిగుబడులు చేతికందాలంటే ఈ నెల 20వ తేదీ వరకు నీరు ఇవ్వాల్సి ఉంది. ఆ దిశగా నీటి సరఫరా ఇంకా జరుగుతోంది. ఈ తరుణంలో సోమశిల డెడ్‌స్టోరేజ్‌కు చేరుకుంది. క్రస్టుగేట్లకు 5 అడుగుల కిందకు నీటిమట్టం పడిపోయి డ్యాం కళావిహీనంగా మారింది. నీటినిల్వ తగ్గి 40 అడుగుల మేరకు కొండచరియలు బయటపడుతున్నాయి. సహజంగా మొదటి పంట ఏప్రిల్ 15వ తేదీకి పూర్తయితే.. ఆ తర్వాత డ్యాంలో నీటి లభ్యతను బట్టి రెండో పంటకు నీరు ఇచ్చేలా యంత్రాంగం చర్యలు చేపడుతుంది. ఈసారి ప్రాజెక్టు పరిధిలో తాగునీటికే ఇబ్బందిపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రెండో పంట సాగుకు విరామం అనివార్యమయ్యేలా కనిపిస్తున్నదని డెల్టా రైతులే చర్చించుకుంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోంది.

ఈ ఏడాది ఆశించిన ధరలు..

వరి పంట దిగుబడులకు ఈ ఏడాది ఆశించిన ధర లభిస్తోంది. పుట్టి రూ.22 వేలు పలుకుతోంది. రెండో పంటకు సరిపడా నీరు ఉండి ఉంటే రైతుల ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడి ఉండేది. కాగా గతేడాది ఎగువ నుంచి మన జిల్లాకు రావల్సిన కృష్ణా జలాలు సమృద్ధిగా వచ్చి వుంటే ఈ నీటి ఇబ్బందులు వుండేవి కావనీ, ఆ దిశగా పాలకులు చర్యలు చేపట్టకపోవడంతో నేడు పొలాలు బీళ్లుగా పెట్టుకోవాల్సిన విపత్కర పరిస్థితి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

అడుగంటిన 'గండిపాళెం'

ఉదయగిరి రూరల్ : మెట్ట ప్రాంత రైతుల వరప్రదాయిని పొన్నెబోయిన చెంచురామయ్య (గండిపాళెం) జలాశయం అడుగంటుతోంది. 35 అడుగుల నీటి సామర్థ్యం కలిగిన ఈ జలాశయం పరిధిలో వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో 16 వేల ఎకరాల ఆయకట్టుతోపాటు ఆయా మండలాల్లో ప్రజల తాగునీటి కష్టాలు తీరుస్తోంది. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా జలాశయంలో నీటిమట్టం (3.5 అడుగులు) డెడ్‌స్టోరేజీకి చేరింది. దీంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి.

వర్షాభావ పరిస్థితులు



ఉదయగిరి నియోజకవర్గంలో రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు సాగు, తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2019, 2020, 2021 సంవత్సరాల్లో పుష్కలంగా వర్షాలు కురవడంతో జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొంది. ఆ తర్వాత అరకొరగా వర్షాలు కురవడంతో 2022లో 24, 2023లో 11 అడుగుల మేర నీరు ఉండటంతో అధికారులు మెట్ట పంటలకు నీరు విడుదల చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరి పూర్తిస్థాయిలో అడుగంటిపోయింది. ఎండలు అధికంగా కాస్తుండటంతో ఉన్న నీరు సైతం పూర్తిగా అడుగంటే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఈ ఏడాదైనా వరుణుడు కరుణిస్తాడో లేదో వేచిచూడాలి మరి.

రెండోపంటకు నీరు లేనట్టేనా!?



బుచ్చిరెడ్డిపాళెం : సుమారు 3 లక్షల ఎకరాలకు సాగునీరందించే కనిగిరి రిజర్వాయర్ వెలవెలబోతోంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 3.45 టీఎంసీలు ప్రస్తుతం 0.7 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. జిల్లాలోని పది మండలాల రైతుల ఆయువు పట్టు అయిన కనిగిరి రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గుతుండటంతో ఆయకట్టు రైతుల్లో దిగాలు చెందుతున్నారు. అప్పోసప్పో చేసి పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చిన వెంటనే పెట్టుబడులకు తెచ్చిన అప్పులు, భూ యజమానికి లీజు చెల్లించి, రెండో పంట సాగు తర్వాత వచ్చేదే ఆదాయంగా వ్యవసాయం చేయడం కౌలురైతు పరిస్థితి. రెండో పంట కోసం ఇప్పటికే చాలామంది రైతులు పొలాలు దుక్కులు చేసుకుంటున్నారు. అయితే, నీటివిడుదలపై ఇరిగేషన్ అధికారులు ఏ నిర్ణయం వెల్లడించకపోవడంతో అందరిలో నిరాశ నెలకొంది. ఇరిగేషన్ ఏఈ వినయ్‌కుమార్ మాట్లాడుతూ కనిగిరి డ్యాంలో ఉన్న నీరు తాగునీటికి, పశువులకు తప్ప రెండో పంటక సరఫరా లేదన్నారు. అల్లూరు కాలువ, పైడేరు ఛానల్ కింద కొంతమేర లేతపంటలకు నీరు వదులుతున్నామని, అది కూడా మరో 10రోజుల్లో ముగుస్తాయని తెలిపారు.

భయపెడుతున్న 'కండలేరు'!



రాపూరు(డక్కిలి) : కండలేరు జలాశయంలో నీటి మట్టం అంతకంతకు తగ్గిపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పవన్న ఆందోళ నెలకొంది. కండలేరు జలాశయం పూర్తి సామర్థ్యం 68.3 టీఎంసీలు కాగా ప్రసుత్తం 8.060 టీఎంసీల నీరు ఉంది. డ్యాం నుంచి ప్రతిరోజు తాగునీటి అవసరాలకు 25 క్యూసెక్కులు, రైతుల కోసం 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మండుతున్న ఎండలకు డ్యాంలో నీటిమట్టం అడుగంటడంతో భూగర్భ జలాలు కూడా ఇంకిపోయాయి. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోకపోతే ముందు నీటికష్టాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పంటల నూర్పిళ్ళు పూర్తి కావస్తున్న దృష్ట్యా నీటి అవసరాలను గుర్తించి వినియోగించుకొంటే తాగునీటి ఎద్దడి తీవ్రతను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. డ్యాంలో నీటిమట్టం ఇంతకంటే తగ్గితే పంపింగ్ చేస్తే కానీ విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది.

తాగునీటికే రాళ్లపాడు నీరు!



కందుకూరు: సాగు, తాగునీటి అవసరాలకు ఉద్దేశించిన రాళ్లపాడు రిజర్వాయరు ఈ ఏడాది కేవలం తాగునీటికే పరిమితమైంది. ఏటా రబీలో వరి, వేసవిలో పత్తి సాగుకు నీరందించే ఈ రిజర్వాయరు ద్వారా ఈ ఏడాది ఒక్క ఎకరానికి కూడా సాగు నీరందించలేదు. రాళ్లపాడు ఆయకట్టులో వరిసాగుకి నీరందించే పరిస్థితి లేదని అధికారులు ముందుగానే ప్రకటించటంతో రైతులు సాగును విరమించుకున్నారు. అడపాదడపా వేసవి పత్తి సాగు చేసినప్పటికీ రిజర్వాయరులో నీరు తాగునీటి అవసరాలకే అంతంతమాత్రంగా ఉన్నాయన్న ఆలోచనతో అధికారులు ఆరుతడులకు కూడా నీరివ్వలేదు. దీంతో రైతులు బోర్ల ఆధారంగా తంటాలు పడుతున్నారు. 21 అడుగుల నీటిమట్టంతో 1.05 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన రాళ్లపాడు రిజర్వాయరులో ప్రస్తుతం 11.3 అడుగులు మాత్రమే నీరు నిల్వ ఉంది. ఈ నీరు 0.35 టీఎంసీలు ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. రిజర్వాయరుకు వర్షాధారంగా సహజ వనరులైన మన్నేరు, ఎలికేరుల ద్వారా కేవలం 14 అడుగులు (0.5 టీఎంసీలు) నీరు చేరగా సోమశిల ప్రాజెక్టు నుంచి రాళ్లపాడుకు జరిగిన కేటాయింపుల్లో అంతంతమాత్రంగానే వచ్చింది. సోమశిల నుంచి రాళ్లపాడుకు 1.5 టీఎంసీల నీటిని ఇవ్వాల్సి ఉండగా అందులో కేవలం 0.25 టీఎంసీలు మాత్రమే ఇచ్చి చేతులెత్తేశారు. దీంతో రిజర్వాయరు నిల్వ సామర్థ్యంలో సగం నీరుమాత్రమే ఉండగా అందులో 30 శాతం ఇప్పటికే తాగునీటి అవసరాలకు ఖర్చయింది. రాళ్లపాడు రిజర్వాయరు ఆధారంగా మూడు మంచినీటి పథకాల ద్వారా 80కి పైగా గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం ఉన్న నీటితో ఈ వేసవి అంతా ఇబ్బంది లేకుండా తాగునీరు సరఫరా చేయవచ్చని, వచ్చే ఏడాది అయినా వర్షాధారంతో రిజర్వాయరు నిండితేనే సోమశిల నుంచి వచ్చే అదనపు జలాలను ఆసరా చేసుకుని సాగునీరు ఇవ్వగలమని, లేనిపక్షంలో తాగునీటికే తప్ప సాగునీటికి గ్యారెంటీ లేదని అధికారులు తెలిపారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- 9వతేదీ వరకు నిర్వహణ
- జిల్లాలో 8 వేల మందికిపైగా హాజరు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 3 : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీ రింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి గురువారం నుంచి జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈనెల 9వతేదీ వరకు ఉదయం, మధ్నాహ్నం రెండు సెషన్లలో జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 8 వేల మందికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పర్యవేక్షణలో టీసీఎస్ ఈ పరీక్షలను నిర్వహిస్తోంది. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్నాహ్నం 3 నుంచి 6 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లాలో ఈ పరీక్షల నిర్వహణకు పొట్టేపాళెం సమీపం లోని అయాన్ డిజిటల్ సెంటర్, గూడూరులో నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాకు చెందిన మరికొంత మంది విద్యార్థులు ఇతర ప్రాంతాలు, జిల్లాలకు చెందిన పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసుకున్నట్లు కళాశాలల నిర్వాహకులు తెలిపారు. కాగా, ఉదయం సెషన్‌లో 7.30 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించి 8.30 గంటలకు మెయిన్ గేట్లు మూసేస్తారు. ఇదేవిధంగా మధ్యాహ్నం సెషన్‌కూ అమలు చేస్తారు.



కమిషనర్‌కు రాజీనామా పత్రాలు అందచేస్తున్న వలంటీర్లు

రాజీనామా చేయండి!

- వలంటీర్లపై వైసీపీ నేతల ఒత్తిళ్లు
- కావలిలో ఇప్పటివరకు 242 మంది రిజైన్

కావలి, ఏప్రిల్ 3 : రాజీనామాల కోసం వలంటీర్లపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. ఆ ఒత్తిళ్లు తట్టుకోలేక బుధవారం సాయంత్రానికి కావలిలో 242 మంది వలంటీర్లు తమ రాజీనామా ప్రతులను మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్‌కు అందజేశారు. వైసీపీ వార్డు ఇన్చార్జులు తమ పరిధిలోని వలంటీర్లను మున్సిపల్ కార్యాలయం వరకు తీసుకొచ్చి మరీ రాజీనామా చేయిస్తున్నారు. గడిచిన 3 రోజులుగా వలంటీర్లు, వైసీపీ నాయకులతో మున్సిపల్ కార్యాలయ ఆవరణం కిటకిటలాడుతోంది. వలంటీర్లంతా రాజీనామా చేయాలని వైసీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కసమర్లపూడి నారాయణ ఇచ్చిన పిలుపు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ తర్వాత రాజీనామా చేసిన కొందరు వలంటీర్లు వైసీపీ నేతలకన్నా ఘోరంగా తాము కావలి ఎమ్మెల్యే కోసం ప్రచారం చేసి గెలిపించుకుంటామని ఆడియోలో చెప్పినట్టే చెప్పడం అంతా ఒక పథకం ప్రకారం జరిగినట్లు తెలుస్తోంది.

ఉదయగిరిపై టీడీపీ జెండా ఎగరడం తథ్యం : కాకర్ల


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు


మాట్లాడుతున్న కాకర్ల సురేష్, వేదికపై వీపీఆర్ తదితరులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 3: వచ్చే ఎన్నికల్లో ఉదయగిరి కోటపై టీడీపీ జెండా ఎగరడం తథ్యమని ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో సీతారామపురం, ఉదయగిరి మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో మండల కన్వీనర్లు బయ్యన్న, ప్రభాకర్‌రాజుల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 నుంచి టీడీపీలో పనిచేసిన ప్రతి ఒక్కర్ని గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. మీ శ్రమ వల్లే మేం ఇక్కడ ఉన్నామని, మీరు లేకపోతే మేం లేమన్నారు. చిన్న చిన్న విబేధాలను పక్కనపెట్టి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు జోలికొస్తే ఎంతటివారినైనా సహించేదిలేదన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు, తాగునీటి కష్టాలు తీర్చి మెట్ట ప్రాంత రూపురేఖలు మార్చేస్తామన్నారు. వలసలు నివారించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పింఛన్ల పంపిణీలో అధికార పార్టీ పెద్ద కుట్ర పన్ని ప్రతిపక్షంపై బురదచల్లే పన్నాగం పన్నుతుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డిలు మాట్లాడుతూ నమ్మిన వారిని నట్టేటముంచిన నమ్మకద్రోహి సీఎం జగన్‌రెడ్డి అన్నారు. గతంలో ఇద్దరు ఒక్కటైతే గెలిచేవారమని, ఇప్పుడు నలుగురం అయ్యామని, అత్యధిక మెజార్టీ తప్పదన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. అనంతరం వేమిరెడ్డి, కాకర్లకు నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు శాంతకుమారి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, మన్నేటి వెంకటరెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి, సీతారామపురం సర్పంచి భాగ్యమ్మ, బీజేపీ నేత కదిరి రంగారావు, జనసేన నేతలు భోగినేని కాశీరావు, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీలో చేరికలు

వింజమూరు మండలం బొమ్మరాజుచెరువులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం దుత్తలూరు మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌ల ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు ఉండేలా గురవారెడ్డి, కనసాని సుబ్బారెడ్డి, మద్దిరెడ్డి వెంకటసుబ్బరామిరెడ్డి, రెడ్లదిన్నె సర్పంచి ఉండేల నాగమ్మ, ఎంపీటీసీ మీసాల వెంకటేశ్వర్లు తదితరులు వారి అనుచరులతోపాటు మండలంలోని నందిపాడు, వెంకటంపేట, రెడ్లదిన్నె, పాపంపల్లి, భైరవరం, రాచవారిపల్లి, బ్రహ్మేశ్వరం, బండకిందపల్లి గ్రామాలకు చెందిన సుమారు 200 కుటుంబాల వారు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి వేమిరెడ్డి, కాకర్ల కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

● ఇఫ్తార్ విందులో కాకర్ల

ఉదయగిరి మండలంలోని వెంగళరావునగర్‌లో బుధవారం రాత్రి ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ ముస్లిం లకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, వాజీద్, బీ.వెంకటేశ్వర్లు, కాకి ప్రసాద్, బొడ్డు లక్ష్మయ్య, ఆగర సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎండకు ఉపశమనం



సంగం, ఏప్రిల్ 3: ఎండలు తీవ్రంగా ఉన్నాయి. బుధవారం 40 డిగ్రీలపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ట్రాక్టర్‌పై ప్రయాణం చేసే కూలీలు ట్రాక్టర్‌పై పట్టలు కట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. పొదలకూరుకు చెందిన పలువురు యాత్రికులు మల్లెంకొండకు వెళ్లి వస్తూ ఎండ తీవ్రత కారణంగా నీడ కోసం ట్రాక్టర్‌పై పట్టలు కట్టుకుని ప్రయాణం చేయడం ఆంధ్రజ్యోతి కంట పడింది.

● ఎండలతో జాగ్రత్త సుమా!

చేజర్ల : రోజురోజుకి పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ కే గోపికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన సమాచారం మేరకు ఈనెల నుంచి జూన్ వరకు ఎండలు విపరీతంగా ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వీలైనంత వరకు మధ్యాహ్నం 12 గంటల లోపు పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఎక్కువగా ద్రవపదార్థాలు తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు ఎక్కువగా బయట తిరగకుండా ఉండాలన్నారు.

విద్యార్థినికి అభినందనలు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 3: స్థానిక బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న రాపూరి ప్రణీత నవోదయ ప్రవేశ పరీక్షలో సీటు సాధించింది. దీంతో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 తోట శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో విజయం సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జీ.నాగయ్య, ఉపాధ్యాయులు షేక్ యస్థానీ, హకీమ్‌గౌస్‌బాషా, మొహమ్మద్, సారధి తదితరులు పాల్గొన్నారు.

వీపీఆర్‌ను సన్మానించిన లీగల్ సెల్

ఉదయగిరి రూరల్ : వింజమూరు మండలం బొమ్మరాజుచెరువులో గల టీడీపీ కార్యాలయంలో బుధవారం నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వచ్చే ఎన్నికల్లో వేమిరెడ్డితోపాటు ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ కమిటీ సభ్యులు గొట్టిపాటి మనోరమ, కల్లూరి తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక దళాల కవాతు

వింజమూరు, ఏప్రిల్ 3 : పట్టణంలో బుధవారం కేంద్ర ప్రత్యేక దళాలు బంగ్లా సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ కోటిరెడ్డి తెలిపారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా ఈ కవాతు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేక మహోత్సవాలు

ఆత్మకూరు : పట్టణంలోని శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు మూడు రోజుల నుంచి వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం విష్వక్సేన పూజ, పుణాహవచనం, తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం కుంభారాధన, మహాశాంతిహోమం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జయహో బీసీ సభలను జయప్రదం చేయండి


విలేకరులతో మాట్లాడుతున్న కాకర్ల సురేష్ తదితరులు

వింజమూరు, ఏప్రిల్ 3: త్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా జరిగే జయహో బీసీ సభలను జయప్రదం చేయాలని ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. వింజమూరులోని కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బీసీల కోసం ప్రత్యేక మేనిఫెస్టోను ప్రవేశ పెట్టాడని తెలిపారు. 50 ఏళ్లు నిండిన బీసీలకు పెన్షన్ ఇవ్వాలని, బీసీలకు పెళ్లి కానుకగా రూ.లక్ష, చంద్రన్న బీమా రూ.10లక్షలు, ఆరోగ్య పథకం ద్వారా రూ.5లక్షలు, బీసీ రక్షణ నిధి రూ.10వేల కోట్లు, రూ.1.50వేల కోట్లతో సబ్‌ప్లాన్‌ను అమలు చేయనున్నారని పేర్కొన్నారు. ఈ విషయాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన కార్యకర్తలను, నాయకులను కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ పి.చెంచలబాబుయాదవ్, బీసీ నాయకులు రవీంద్రబాబు, గంజం రాఘవేంద్ర, చింతనబోయిన బయన్న, పోలుపోయిన శ్రీకాంత్, పాముల మహేష్, వేములపాటి మణికుమార్, చల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● నేటి నుంచి కాకర్ల ప్రచారం

సీతారామపురం : నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ గురువారం ఉదయం 8 గంటల నుంచి మండల పరిధిలోని చిన్ననాగంపల్లి నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారని నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కే. భాగ్యకుమారి, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల వరకు పల్లెల్లో ఇంటింటికి ప్రచారం చేస్తారని, ఉదయగిరి మండలంలో ఈనెల 9న ఎన్నికల ప్రచారం ముగిస్తుందన్నారు. పార్టీ కార్యకర్తలు,నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

బెదిరింపులకు భయపడొద్దు.. అండగా మేముంటాం !


ప్రచారం చేస్తున్న లక్ష్మీ సాయిప్రియ

కలువాయి, ఏప్రిల్ 3: టీడీపీకి ఓటు వేస్తే ఇబ్బంది పెడతామని వైసీపీ నాయకులు చేస్తున్న బెదిరింపులకు ఎవరూ భయపడవద్దని, మీకు అండగా మేం ఉంటామని వెంకటగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ భరోసా ఇచ్చారు. మండలంలోని కుల్లూరులో బుధవారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు. వైసీపీ రాక్షస పాలనను తరిమికొట్టేందుకు అందరూ కలసి యుద్ధం చేయాలని కోరారు. అధికారంలోకి రాగానే కుల్లూరులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను విస్తరిస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట పార్టీ నాయకులు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, నరాల సునీల్, చల్లా రాజేష్ రెడ్డి, షేక్ కాలేషా, కేతా సోమిరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి : డాక్టర్ కంచర్ల


సన్మానం పొందిన డాక్టర్లు రవీంద్రనాథ్, రమేష్

ఏఎస్‌పేట,ఏప్రిల్ 3 : విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, తద్వారా దేశాభివృద్ధి చెందుతుందని గ్లోబల్ ఆసుపత్రి (హైదరాబాద్) అధినేత డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్, రెయిన్‌బో ఆసుపత్రి అధినేత డాక్టర్ కంచర్ల రమేష్ తెలిపారు. బుధవారం వారు తమ స్వగ్రామమైన చిరమనకు విచ్చేశారు. ఈ సందర్భంగా తమ సహకారంతో ఏర్పాటు చేసిన హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు.హైస్కూల్‌లో ఇతర సౌకర్యాల గురించి హెచ్ఎం సుబ్రహ్మణ్యం తెలియ చేయగా, త్వరలోనే సమకూర్చుతామన్నారు. పీహెచ్‌సీలో సమావేశం గది నిర్మిస్తామని, అవసరమైన మందులను ఉచితంగా అందిస్తామన్నారు. అనంతరం వారిని శాలువా లు,పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జ్యోతిరాణి, నాగవినుత, గ్రామస్థులు కంచర్ల రమాధర్‌నాయుడు,ఉప్పుగండ్ల అంకయ్యచౌదరి, కే సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలి


ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, ఏప్రిల్ 3 : లబ్ధిదారులకు పింఛన్లను సక్రమంగా పంపిణీ జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని టీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు వారు బుధవారం, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు. వృద్ధులు, దివ్యాంగులు తదితరులకు సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పీ జయకర్, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు. తోడేటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

● 80 చోట్ల పింఛన్ల పంపిణీ

సంగం : మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టారు. 13 సచివాలయం పరిధిలో సచివాలయంతోపాటు మరో మూడు నాలుగు చోట్ల కలిపి మొత్తం 80 చోట్ల తాత్కాలిక పింఛన్ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి పంపిణీ ప్రారంభించారు. మండలంలో మొత్తం 6,830 పింఛన్లు ఉండగా సాయంత్రం 6 గంటలకు 60.5 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మిగిలిన పింఛన్లను గురువారం పంపిణీ చేస్తామన్నారు.

అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా!

చిట్రగుంట, ఏప్రిల్ 3: బోగోలు మండలం ఎస్‌జీవీ కండ్రిక పంచాయతీ నుంచి స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ ప్రచారం నిర్వహించారు. బీజీవీ కండ్రిక, జక్కేపల్లిగూడూరు, ఏటీ కండ్రిక, నాగులవరం, ఏకే కండ్రిక గ్రామాల్లో ఆయన పర్యటిస్తూ ఓట్లు అభ్యర్థించారు. పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా గ్రామాల్లో తాను చేస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. ఆయన వెంట పసుపులేటి వెంకటేశ్వర్లు, సురేష్, ఏడుకొండలు, వెంకటరమణయ్య, శ్రీహరినాయుడు, సుబ్బారావు, జగదీష్, ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 3: పట్టణంలోని షాదీమంజిల్‌లో బుధవారం రాత్రి ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక : కావ్య


టీడీపీలో చేరిన యువతతో కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 3: రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని కూటమి ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మూడు పార్టీల నేతలు మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు, వారి భవిష్యత్తు, ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సి నిధులు, జరగాల్సిన అభివృద్ధి కోసమే రాష్ట్రంలో మూడు పార్టీలు జతకట్టాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అరాచకపాలన నుంచి రాష్ట్రాన్ని కాపడేందుకు కూటమిగా ప్రజల్లోకి వస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ పట్టణ అధ్యక్షులు గుత్తికొండ క్రిషోర్, పొబ్బా సాయి విఠల్, కే.బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసక పాలనను తరిమికొడదాం

నవరత్నాల మాటున రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంలోని శక్తులు, కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆయన అనుచరులు అన్నిరకాలుగా ప్రజల సొమ్మును దోపిడీ చేస్తున్నారని, ఈ విధ్వంసక పాలనను తరిమి కొడదామని కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కావలి టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కావలిరూరల్ మండలం ఆనెమడుగు పంచాయతీ మొండిదిన్నెపాలెం, కట్టకింద పాలెం గ్రామాలకు చెందిన యువత కోనంకి కిషోర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి కావ్య ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంకట్రావు, కండ్లగుంట మధుబాబునాయుడు, అద్దంకి ప్రభాకర్, ఉప్పాల వెంకటేశ్వర్లు, కోనంకి అశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి


సమావేశంలో టీడీపీ నాయకులు

కొండాపురం, ఏప్రిల్ 3: తెలుగుదేశంతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ముస్లింలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా మసీదుల నిర్మాణాలకు, అభివృద్ధికి నిధులు కేటాయించడంతోపాటు దుల్హన్ పథకం, రంజాన్‌తోఫా పథకాలు అమలు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం వాటన్నింటిని రద్దు చేసిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించుకొని ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును, నెల్లూరు ఎంపీగా వీపీఆర్‌ను, ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను గెలిపించి వైసీపీకి చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యారవ క్రిష్టయ్య, పీ.రమేష్, షేక్ ఖాసిం, దామా మహేశ్వరారవు, వెంకటాద్రి, పీ.చంద్రబాబునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో బొల్లినేని భేటీ


కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొల్లినేని వెంకటరామారావు

జలదంకి, ఏప్రిల్ 3: కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు బుధవారం నాగ్‌పూర్‌లోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బొల్లినేని కేంద్రమంత్రికి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం గడ్కరీ ఇచ్చిన అల్పాహారవిందులో పాల్గొని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత రాజకీయఅంశాలపై చర్చించినట్లు బొల్లినేని తెలిపారు. ఎన్డీఏలో టీడీపీ చేరిన తరువాత ఏపీలో కూటమి విజయావకాశాలపై వీరివురి మధ్య సుదీర్ఘ చర్చ కొనసాగిందని పేర్కొన్నారు.

రోజుకు రూ.300 వచ్చేలా పని చేయించాలి

లింగసముద్రం, ఏప్రిల్ 3 : ఉపాధి హామీ పథకంలో కూలీలకు రోజుకు రూ.300 వచ్చేలా పని చేయించాలని రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి వేణుగోపాల్ చెప్పారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతిరోజూ కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి 11 గంటల వరకు చేయాలన్నారు. పని ప్రదేశంలో మార్కింగ్ విధానం, కొలతలు, ఫారం పాండు పనులు, నూతన మార్గదర్శకాల గురించి సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యుశేషబాబు, జెక్యూసీ కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

31వ వార్డులో టీడీపీ ఇంటింటి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న ఇంటూరి సౌజన్య

కందుకూరు, ఏప్రిల్ 3: పట్టణంలోని 31వ వార్డు పరిధిలోని ఎల్ఐసీ ఆఫీసు ఎదురుప్రాంతంలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య బుధవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు అత్తంటి శివకృష్ణ, ముచ్చు శ్రీను, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, నల్లబోతుల మురళి, జమ్ము చైతన్యలక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, ఆహారం పంపిణీ

ఉలవపాడు, ఏప్రిల్ 3 : ఉలవపాడులోని కోటిరెడ్డి కుంట ఎస్టీలకు యూత్ హెల్పింగ్ ఆర్గనైజింగ్ ఆధ్వర్యంలో బుధవారం దుస్తులు, భోజనం, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. టంగుటూరు గ్రామానికి చెందిన షేక్ ఖాసీం, సుల్తాన్‌ల కుమార్తె సమీర జ్ఞాపకార్థం మొదటి వర్థంతి సందర్భంగా పేదలకు రంజాన్ మాసంలో సాయం చేయాలని మహిళలకు చీరలు, పిల్లలకు డ్రస్ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సభ్యులు దేవరపల్లి చంద్రశేఖర్, పొదిలి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు : ఆర్వో


మాట్లాడుతున్న ఆర్వో శీనానాయక్

కావలి, ఏప్రిల్ 3: ఎన్నికల కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కావలి రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో బుధవారం రాజకీయపార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశం ఆయన ఎన్నికల కోడ్ నిబంధనలు అతిక్రమిస్తే తీసుకొనే చర్యలు గురించి వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏ రాజకీయ పార్టీ నాయకులు తమ ప్రచారాల సమయంలో కానీ ఇతర సమయాల్లో కానీ బాణాసంచా కాల్చకూడదన్నారు. సభలు సమావేశాలకు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. నామినేషన్ల సమయంలో పాటించాల్సిన నిబంధనలను, ఈవీఎంలు ఎప్పుడు వస్తాయి వాటి భద్రత, ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం, పోస్టల్ బ్యాలెట్లు ఎప్పుడు ఇస్తారు, వాటిని ఎలా వినియోగించుకోవాలి తదితర అంశాలపై వివరించారు. ప్రతి రాజకీయ పార్టీ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు.

కూటమి విజయమే లక్ష్యంగా పనిచేస్తాం

● ఇంటూరికి మద్దతు తెలిపిన ఎంఆర్పీఎస్ నాయకులు


మాట్లాడుతున్న ఇంటూరి, ఎంఆర్పీఎస్ నేతలు

కందుకూరు, ఏప్రిల్ 3: ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయం కోసం శక్తివంచన లేకుండా పని చేస్తామని, రాష్ట్రంలో చంద్రబాబు విజయం మాదిగ జాతి విజయంగా తాము భావిస్తున్నామని ఎంఆర్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని ఎంఆర్పీఎస్ నాయకులు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జనసేన, బీజేపీ బలపరుస్తున్న టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఎంఆర్పీఎస్ నాయకులు జలదంకి నరసింగరావు, వర్ల దేవదాస్ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు నేలపాటి రాజు, రావినూతల ముత్యు, రావినూతల ఐజాక్, పున్నేపల్లి శ్రీనివాసులు, జంగిలి లెనిన్, గౌడపేరు బాబు, చేవూరి శ్రీను, చదలవాడ శ్రీనాథ్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల మద్దతు : టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు మద్దతుగా టీడీపీలో చేరేందుకు పలువురు ఆర్యవైశ్య వ్యాపారులు ముందుకు రాగా వారికి నాగేశ్వరరావు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రకాశం జిల్లా ఆర్యవైశ్యసంఘం కార్యదర్శి తాతా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తాతా సీతారామాంజనేయులు బ్రదర్స్, పద్మనాభుని మార్కండేయులు, కందుకూరు క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తాతా మోహనరావు అండ్ సన్స్, కోట నరసింహం, తుమ్మపూడి సుబ్బయ్య, గుర్రం మహేష్, కారంశెట్టి వెంకన్న, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు అండ్ బ్రదర్స్, గుర్రం హరిబాబు, గుర్రం చిన అల్లూరయ్య, కొత్త శ్రీనివాసరావు తదితరులు టీడీపీలో చేరారు.

బృందావనంలో ఇంటింటి ప్రచారం : పట్టణంలోని 5వ వార్డు పరిధిలోని బృందావనంలో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట స్థానిక పార్టీ నాయకులు, బృందావనం యువకులు పాల్గొన్నారు.

ముస్లిం ద్రోహి సీఎం జగన్


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ముస్లిం నేతలు

కావలి, ఏప్రిల్ 3: ముస్లింల ప్రయోజనాల కోసం గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు అమలు చేసిన దుల్హన్ పథకం, రంజాన్‌తోఫా వంటి అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసిన ముస్లింల ద్రోహి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ముస్లిం నేతలు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ముస్లిం ద్రోహి జగన్ అనే ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2014లో టీడీపీ, బీజేపీ పొత్తు ఉండిందని, ఆ పాలనలో ముస్లింల అభివృద్ధి, సంక్షేమం నిరాటంకంగా కొనసాగిందన్నారు. టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకోవడం కొత్తేమి కాదని, దీనివలన ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. కావలి ఎమ్మెల్యేగా కావ్య క్రిష్ణారెడ్డిని, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల విజయానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ రహీం, హఫీజ్,మస్తాన్, ఖాదర్‌బాషా, ఇట్టు, రఫీ, ఖమర్‌బాబు, హజరత్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో తీవ్ర జాప్యం

● జగన్ రాజకీయ లబ్ధి కోసమేనంటున్న ప్రతిపక్షాలు


లింగసముద్రం: పింఛను అందజేస్తున్న సిబ్బంది

ఉలవపాడు, ఏప్రిల్ 3 : పథకం ప్రకారం పింఛన్లు పంపిణీ ఆలస్యం చేసి ఆ నెపం టీడీపీపై, చంద్రబాబుపైకి నెట్టి రాజకీయ లబ్ధి పొందాలనేదే జగన్‌రెడ్డి వ్యూహమని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. మండలంలో బుధవారం సాయంత్రం వరకు సచివాలయాల వద్ద వృద్ధులు, వితంతువులు పింఛన్ కోసం పడిగాపులు కాచారు. తీరా 4 గంటలకు బ్యాంక్‌ల నుంచి నగదు తీసుకొచ్చి తీరిగ్గా పంపిణీ మొదలు పెట్టారు. ఉదయం నుంచి ట్రెజరీ నుంచి నగదు బ్యాంకులకు జమ కాలేదని, మధ్యాహ్నం 3 గంటలకు ఖాతాల్లో జమకావడంతో తీసుకొచ్చామని సచివాలయ సిబ్బంది చెప్తున్నారు.

కలిగిరి : ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ద్వారా బుధవారం పింఛన్ల పంపిణీ జరిగింది. సచివాలయాలకు వచ్చి లబ్ధిదారులు పిచన్లను తీసుకెళ్లారు. అనారోగ్యానికి గురై సచివాలయ కేంద్రానికి రాని లబ్ధిదారులను గుర్తించి ఇంటికెళ్లి అందజేసినట్లు అధికారులు తెలిపారు.

లింగసముద్రం : మండలంలో బుధవారం మధ్యాహ్నం 3.30 నుంచి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. సాయంత్రం 7 గంటల వరకు మండలంలోని 13 సచివాలయాల పరిధిలో సుమారు 43 శాతం మంది లబ్ధిదారులకు నగదు అందజేశామని ఎంపీడీవో యు శేషబాబు చెప్పారు.

తాగునీటి సమస్య కూడా పట్టదా?


ప్రచారంలో కోటారెడ్డి, గిరిధర్, బినీత్‌రెడ్డి

అల్లూరు, ఏప్రిల్ 3 : వైసీపీ ప్రభుత్వానికి తాగునీటి సమస్య కూడా పట్టడం లేదని రానున్న ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎంపీగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కావ్య కృష్ణారెడ్డిలను గెలిపిస్తే మండలంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తామని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి అన్నారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డితో కలసి బుధవారం పట్టణ పరిధిలోని మధ్యకాపు వీధి, తూర్పు కాపువీధి, దసరా దేవాలయం, రాయాజి వీధి, తూర్పు మహమ్మదీయ పాలెం, కుమ్మరవీధిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులరెడ్డి, కృష్ణచైతన్య, అరగల రమణయ్య, ఊటు శ్రీకాంత్ రెడ్డి, ఊటు అశోకరెడ్డి, పరంధామరెడ్డి, అనూరాధ పాల్గొన్నారు.

విష్ణు అనుచరుడు టీడీపీలో చేరిక : మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్థన్‌రెడ్డి వీరాభిమాని రామిశెట్టి శీనయ్య బుధవారం స్థానిక టీడీపీ కార్యకర్త మంగిశెట్టి సురేష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ విష్ణు పోటీలో ఉంటే తన మద్దతు ఆయనకే ఉంటుందని, ఆయన తనకు నచ్చని వైసీపీలో చేరడంతో తాను టీడీపీలో చేరానన్నారు.